ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

మహబూబ్‌నగర్ : fb.com/vaartha Digital






Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

28-12-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 327 పేజీలు: 10+4 వెల: 8.00


# 5 నుంచి 'ఉపాధి హామీ' బచావో

## దేశవ్యాప్తంగా ఉద్యమం ఆరంభించాలని కాంగ్రెస్ నిర్ణయం

### మహాత్మాగాంధీ పేరిటగల పథకాన్ని బిజెపి ప్రభుత్వం రద్దు చేయడంపై 'సిడబ్ల్యుసి'లో తీవ్ర నిరసన

### మహాత్ముని పేరు తొలగించి జాతినే అవమానించారు: రాహుల్

### సిడబ్ల్యుసి వివరాలు వెల్లడించిన సిఎం రేవంత్

### సోనియా గాంధీ, రాహుల్‌తో చర్చించిన సిఎం


న్యూఢిల్లీలో సోనియా, రాహుల్‌తో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్27:** ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సిడబ్ల్యుసి) సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ మీటింగ్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ,అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే,తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి,పార్టీ సీనియర్ నేత శశిథరూర్‌తో సహా అనేక మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా శనివారం సిఎం రేవంత్‌రెడ్డి ఎక్స్(ట్విట్టర్) వేదికగా కీలక వివరాలు వెల్లడించారు. జనవరి 5 నుంచి దేశ వ్యాప్తంగా 'మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం' బచావో ఉద్యమం >>2

## గాంధీజీ పేరు తొలగింపు

# సహించం

### ఎంజిఎన్‌రేగా చట్టాన్ని రక్షించుకుంటాం: ఖర్గే, రాహుల్

**న్యూఢిల్లీ, డిసెంబరు 27:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సమూలంగా మార్చివేసి పేదల కడుపు కొడుతున్న ఎన్డీయే సర్కారుకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళన నిర్వహించనున్నట్లు ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గే వెల్లడించారు. ఎంజిఎన్‌రేగా స్థానంలో ప్రభుత్వం విబిజి రామ్‌జి చట్టాన్ని తీసుకురావడం నిరుపేదలకు భృతిని కరువు చేయడమేనని దుయ్యబట్టారు.కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో గాంధీపేరును చెరిపివేయడం చూస్తుంటే బాపూ జీని జాతిపిత గాంధీని అవమానించడమేనని అన్నారు. వర్కింగ్‌కమిటీ సమావేశంలోనే >>2




శనివారం ఓ కళాశాలలో ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

# వందేమాతరం.. ఒక ప్రేరణాత్మక నినాదం

### ఆ గీతం స్ఫూర్తితో ప్రతిపౌరుడు వికసిత్ భారత్ నిర్మాణంలో భాగస్వామి కావాలి

### దేశాన్ని ముందుకు నడిపిస్తున్న చైతన్యం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్27:** వందేమాతరం! వందేమాతరం నినాదం.. ఈ రెండు పదాలు మాత్రమే కాదు..దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించేందుకు మన పెద్దలు పడిన తపన, తాపత్రయానికి,ఇందుకోసం వారు చేసిన స్వార్థం లేని త్యాగానికి,మన భరతజాతి ఆత్మగౌరవానికి ప్రతీక అని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. వందేమాతర గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం వివేక వర్ధిని కాలశాలలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడారు. భారతదేశ స్వాతంత్ర్యోద్యమంలో దేశభక్తి భావనను పెంపొందించేందుకు వందేమాతరం ఒక ప్రేరణాత్మకమైన రణనినాదం.ఆ తర్వాత దేశాన్ని నిరంతరం ముందుకు నడిపిస్తున్న స్ఫూర్తి, మంత్రం అని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంకల్పించిన వికసిత భారత నిర్మాణ దిశలోనూ.. వందేమాతరం కొత్త శక్తిని మనకు అందిస్తుందన్నారు. సుమారు 150 సంవత్సరాల క్రితం మహాకవి బంకించంద్ర చటర్జీ భారతమాత ఔన్నత్యాన్ని,ఆధ్యాత్మిక వైభవాన్ని,సాంస్కృతిక గొప్పతనాన్ని ప్రతిబింబించేలా వందేమాతరం పదాన్ని సృష్టించారని చెప్పారు. బ్రిటిష్ పాలకులు విభజించి పాలించు విధానంతో దేశాన్ని చీల్చాలని చూసినప్పుడు, వందేమాతరం భారతీయులను ఏకం చేసింది.కులం, మతం, ప్రాంతం అన్న భేదాల్ని మరిచిపోయి దేశమే ప్రథమం.. మిగిలినవన్నీ తర్వాతే అన్న భావనను పెంచిందని ఈ గీతం స్వాతంత్ర్య పోరాటానికి ప్రాణం పోసిందన్నారు. 1905 >>2

## నాటి డ్రగ్స్ కేసు

# విచారణ ఏమైంది?



## సేకరించిన ఆధారాలు, వీడియో, స్టేట్‌మెంట్ రికార్డులన్నీ ఏమయ్యాయి?

### నాటి సిఎస్ సోమేశ్ కుమార్‌ను వెంటనే అదుపులోకి తీసుకుని విచారించాలి

### ఈగల్ టీంలో కొందరు డ్రగ్ పెడ్లర్లతో రాజీపడుతున్నారు: కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్27:** పండుగలు, నూతన సంవత్సరం వేడుకల సమయంలోనే డ్రగ్స్ కేసుల నమోదుకు పరిమితం అవుతున్నారే తప్ప రాష్ట్ర పభుత్వం సీరియస్ గా వ్యవహరించడం లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో జరిపిన డ్రగ్స్ కేసు విచారణ నివేదికపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా నాటి డ్రగ్స్ కేసులో అనేక మంది బడా వ్యక్తుల పేర్లు, సినీ ప్రముఖులు ఉన్నారంటూ బండి సంజయ్ బాంబు పేల్చారు. డ్రగ్స్ కేసులో పట్టుబడిన వాళ్లను అకున్ సబర్వాల్ టీం నాడు విచారణ చేస్తే కేసీఆర్ కుటుంబ సభ్యులకు డ్రగ్స్ విక్రయదారులతో సంబంధాలున్నాయని తేలిందన్నారు. ఆ కుటుంబ సభ్యులు సైతం తమతో కలిసి డ్రగ్స్ తీసుకున్నారని డ్రగ్స్ కేసులో పట్టుబడి నిందితులు ఆనాడు అకున్ టీం ఎదుట వాంగ్మూలమిచ్చారని పేర్కొన్నారు. ఆ వాంగ్మూలంతో కూడిన ఆడియో, వీడియో రికార్డులు బయటకొస్తే తన కుటుంబ సభ్యుల రాజకీయ భవిష్యత్తు సమాధి అవుతుందని భయపడ్డ నాటి సీఎం కేసీఆర్ ఆకున్ సబర్వాల్‌ను అర్ధాంతరంగా డ్రగ్స్ కేసు బాధ్యతల నుండి తప్పించారని తెలిపారు. అదే సమయంలో ఆ కేసుపై అకున్ సబర్వాల్ టీం రూపొందించిన నివేదికను,రికార్డు చేసిన ఆడియో, వీడియో, స్టేట్ మెంట్లన్నింటినీ నాటి సీఎస్ సోమేశ్ కుమార్ స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. ఆ తరువాత డ్రగ్స్ >>2

## ఆ మాటలు విత్‌డ్రా చేసుకుంటున్నా


### మహిళాకమిషన్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పా: సినీనటుడు శివాజీ 3

# 31లోగా ఆస్తుల వివరాలివ్వండి



### ఐఎఎస్‌లకు కేంద్రం హెచ్చరిక

**హైదరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త:** తాము విధించిన గడువు లోపల ఆస్తుల వివరాలు సమర్పించాల్సిందేనని కేంద్రం స్పష్టం చేసింది. లేకపోయినట్లయితే కఠిన చర్యలు తప్పవని ఐఎఎస్ అధికారులకు కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. నిర్దేశిత గడువు లోపల తమ ఆస్తుల వివరాలు సమర్పించాల్సిన బాధ్యత నిర్వర్తించాలని, తమ ఆదేశాలను సకాలంలో అమలు చేయకుంటే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. ఈ మేరకు దీనికి సంబంధించి ఐఎఎస్ అధికారులకు కేంద్రం నోటీసులు జారీ చేసింది. ప్రస్తుత 2025 క్యాలెండర్ సంవత్సరానికి సంబంధించి తప్పనిసరిగా వచ్చే జనవరి నెలాఖరు లోపు ఐఎఎస్ అధికారులు స్పారో సాఫ్ట్‌వేర్ ద్వారా తమ ఆస్తి వివరాలను ఆన్‌లైన్ మాడ్యూల్లో అందించాలని పేర్కొంది. ఇందుకు గాను ఈ నెల 23న డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డిఒపిటి) విడుదల చేసిన సర్క్యులర్ పేర్కొన్న మార్గదర్శకాల ప్రకారం సమర్పించాలని సూచించింది. గడువు తర్వాత ఆన్లైన్ మాడ్యూల్ ఆటోమేటిక్‌గా మూసివేయబడుతుందని తేల్చిచెప్పింది. కాగా ఐఎఎస్ అధికారులకు వారి స్థిర మరియు చరాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో అందించడానికి స్పారో అప్ పోర్టల్‌ను కేంద్రం రూపొందించింది. దీనికి సంబంధించి అన్ని రాష్ట్రాల ఐఎఎస్ అధికారులకు లాగిన్ మరియు పాస్‌వర్డ్ కూడా ఇవ్వబడింది. డిఒపిటి మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రాలోని అందరు ఐఎఎస్ అధికారులు ప్రతి సంవత్సరం జనవరి 1 మరియు 21 మధ్య వారి >>2




## గమనిక

**ఆదివారం అనుబంధం బదులుగా నేటి సంచికతో 2026 కేలండర్ అందుకోండి.**

-సర్క్యులేషన్ మేనేజర్

## సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో ఛార్జిషీటు దాఖలు 3




నకిలీ ఫోన్ కాల్స్ మరియు కాల్పనిక/కపట ప్రతిపాదనలకు లొంగకుండా జాగ్రత్తపడండి. ఐఆర్‌డిఎఐ లేదా దాని అధికారులు బీమా పాలసీలు విక్రయించడం, బోనస్ ప్రకటించడం లేదా ప్రీమియంలు పెట్టుబడిపెట్టడం. మొత్తాలను రిఫండ్ చేయడం లాంటి పనులు వేటినీ చేయరు. ఇలాంటి ఫోన్ కాల్స్‌ని అందుకునే ప్రజలను పోలీసులకు ఫిర్యాదు చేయవలసిందిగా కోరడమైనది. నష్టాంశాలు, నియమ నిబంధనలపై మరిన్ని వివరాల కొరకు, దయచేసి పాలసీ విక్రయాన్ని ముగించే ముందు అమ్మకాల బ్రోచర్‌ని జాగ్రత్తగా చదవండి.
లింక్డ్ ఇన్సూరెన్స్ ప్రోడక్ట్‌లు సంప్రదాయ బీమా ప్రోడక్ట్‌ల కంటే భిన్నంగా ఉంటాయి మరియు నష్టాంశాలకు లోబడి ఉంటాయి.
లింక్డ్ ఇన్సూరెన్స్ పాలసీల్లో చెల్లించిన ప్రీమియం క్యాపిటల్ మార్కెట్‌లతో మరియు బహిరంగంగా లభిస్తున్న ఇండెక్స్‌తో ముడిపడివున్న పెట్టుబడి రిస్కులకు లోబడి ఉంటుంది. ఫండ్ పనితీరు మరియు క్యాపిటల్ మార్కెట్‌లతో మరియు బహిరంగంగా లభిస్తున్న ఇండెక్స్‌ని ప్రభావితం చేస్తున్న అంశాలపై ఆధారపడి యూనిట్‌ల ఎన్ఎవిలు పెరగవచ్చు లేదా తగ్గవచ్చు మరియు ఇన్‌ష్యూర్డ్ (అతను/ఆమె) తన నిర్ణయాలకు తానే బాధ్యత వహించవలసి ఉంటుంది.
లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అనేది జీవిత బీమా కంపెనీ పేరు మాత్రమే మరియు ప్రొటెక్షన్ ప్లస్ అనేది లింక్డ్ ఇన్సూరెన్స్ కాంట్రాక్టు పేరు మాత్రమే మరియు కాంట్రాక్టు నాణ్యతను, దాని వృద్ధి అవకాశాలను లేదా రాబడులను ఏ విధంగానూ సూచించడం లేదు.
సంబంధిత నష్టాలు మరియు వర్తించే ఛార్జీలను దయచేసి మీ బీమా ఏజెంట్ లేదా మధ్యవర్తి నుండి లేదా బీమా కంపెనీ జారీ చేసిన పాలసీ పత్రం నుండి తెలుసుకోండి.
ఈ కాంట్రాక్టు కింద అందించబడుతున్న వివిధ ఫండ్‌లు ఆయా ఫండ్‌ల పేర్లు మాత్రమే మరియు ఈ ప్లాన్‌ల నాణ్యతను, వాటి వృద్ధి అవకాశాలను మరియు రాబడులను ఏ విధంగానూ సూచించడం లేదు.




# మావోయిస్టుల లొంగుబాట్ల వెనుక..

### క్షేత్రస్థాయి కేడర్ దూరప్రాంతాలకు బదలీ

### వారికి స్థానిక భాషలు రాకపోవడం ప్రధాన కారణం

### అంతర్గత సమస్యలపై నాయకులకు నిర్లక్ష్యం

### లొంగిపోతున్న నక్సల్స్ చెబుతున్న అంశాలు అవే

**హైదరాబాద్, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలో మావోయిస్టులు లేకుండా చూసేందుకు కేంద్రం చేబట్టిన కగార్ నేపథ్యంలో పలు రాష్ట్రాల్లో భారీగా నక్సలైట్లు లొంగిపోతుండడం తెలిసిందే. ఈ లొంగుబాట్లు ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఎపిలలో జరుగుతున్నాయి. ఇదే సమయంలో ఛత్తీస్‌ఘడ్ సహా మరో రెండు రాష్ట్రాలలో ఎన్‌కౌంటర్లు కూడా చోటుచేసుకుంటున్నాయి. కాగా నక్సలైట్లు గతంతో పోలిస్తే పదుల సంఖ్యలో లొంగిపోవడం వెనుక మావోయిస్టు పార్టీ అగ్ర నాయకత్వం వ్యవహరిస్తున్న తీరు ప్రధాన కారణమని లొంగిపోయిన వారు చెబుతున్నారు. ఇదే విషయాన్ని పోలీసులు సైతం చెబుతుండడం గమనార్హం. ఇంతకు ముందు మావోయిస్టు పార్టీలో అగ్ర నాయకులతో పాటు ముఖ్య నాయకులు పలు ప్రాంతాలలో పనిచేసిన ఉదంతాలున్నాయి. ఇలాంటి నాయకులకు పలు భాషల్లో మంచి ప్రావీణ్యం వుండడం వల్ల వారు ఎక్కడ పనిచేసినా పెద్దగా ఇబ్బంది వుండేది కాదు. పార్టీ అగ్ర నాయకుడుగా చలామణి అయిన హిడ్మా, మల్లోజుల సహా పలువురికి అనేక భాషల్లో పట్టు వుండడం గమనార్హం. అయితే క్షేత్రస్థాయిలో పనిచేసే క్యాడర్‌కు బదిలీలు ఇటీవల చాలా ఇబ్బందిగా మారిందని లొంగిపోయిన నక్స లైట్లు చెబుతున్నారు. ముఖ్యంగా ఛత్తీస్‌ఘడ్‌లోని బీజాపూర్, సుకుమా, దంతేవాడ తదితర ప్రాంతాలకు చెందిన క్షేత్రస్థాయి నక్సలైట్ల (వీరంతా కింది స్థాయిలో పనిచేసే గెరిల్లా సైనికులు)కు స్థానిక భాష తప్ప ఇతర భాషలు రాకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఇదే సమయంలో ఒడిషా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లోని గిరిజన తెగకు చెందిన వారు పెద్ద సంఖ్యలో మావోయిస్టు పార్టీలో క్షేత్రస్థాయిలో సాయుధ సైనికులుగా వున్నారు. వీరికి కూ డా ఇతర ప్రాంతాల భాషలపై కనీస పట్టు లేదు. వచ్చే ఏడాది మార్చి నాటికి నక్సలైట్లను >>2

# ఒక ప్రేరణాత్మక నినాదం

>> బెంగాల్ విభజన ఉద్యమం నుంచి,1942 క్విట్ ఇండియా ఉద్యమం వరకు.. ప్రతి పోరాటంలోనూ వందేమాతరం గర్జన మార్మోగిందన్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చివరి శ్వాస విడిచే క్షణంలో కూడా ఉచ్చరించిన నినాదం వందేమాతరం అని చెప్పారు. అది ఒక పాట కాదు.. అది ఒక త్యాగస్ఫూర్తి.ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో వందేమాతరం ప్రాధాన్యాన్ని గుర్తుచేస్తూ..ఈ ఒక్క పదంలో దేశభక్తి, ఐక్యత, త్యాగం అన్నీ దాగి ఉన్నాయి అని చెప్పారని పేర్కొన్నారు. దురదృష్టవశాత్తు, కొన్ని సందర్భాల్లో ఈ పవిత్ర గీతాన్ని రాజకీయంగా వివాదాస్పదం చేసే ప్రయత్నాలు జరిగాయి. వందేమాతరం అనేది ఓ పార్టీ నినాదం కాదు.దేశ సమైక్యతను ప్రతిబింబించే స్ఫూర్తివంతమైన గేయం వందేమాతరం అని చెప్పారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన 13 నెలల తర్వాత మన గడ్డపై త్రివర్ణ పతాకం సగర్వంగా రెపరెపలాడేలా చేసిన సర్దార్ వల్లభ భాయ్ పటేల్‌కి మనం ఎప్పటికీ రుణ పడి ఉంటామన్నారు. నాటి హైదరాబాద్ సంస్థానంలో 1938లో వందేమాతర ఉద్యమం ప్రారంభమైంది.

దీనిపై నిజాం ప్రభుత్వం వెంటనే నిషేధం విధించిందని గుర్తు చేశారు..ఓవైపు వందేమాతర ఉద్యమాన్ని అణచివేస్తూనే వందేమాతర గీతం ఆలపించిన వారిని కళాశాలు, యూనివర్సిటీల నుంచి బహిష్కరించింది, వారిపై కఠినంగా వ్యవహరించిందని చెప్పారు. వందేమాతరం నినాదంతో.. నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన రామచంద్రరావు ఇంటిపేరు వందేమాతరం అయిందని చెప్పారు. ఇలా ఎందరో మహానుభావులు.. వందేమాతరం స్ఫూర్తితో నిజాంకు వ్యతిరేకంగా పోరాడారు,ఎన్నో త్యాగాలు చేశారు అని చెప్పారు..హైదరాబాద్ సంస్థానంలో విద్యార్థులతో ప్రారంభమైన.. ఈ వందేమాతర ఉద్యమంలో.. ఆ తర్వాత..విభిన్న బావ జాలాలు కలిగిన అనేక సంఘాలన్నీ.. రాజకీయ భావజాలాన్ని పక్కనపెట్టి మరీ ఐక్యపోరాటాన్ని ప్రారంభించాయన్నారు. ఇంతటి ఘనమైన వందేమాతరం చరిత్రను మనమంతా తెలుసుకోవాలి. దాని నుంచి స్ఫూర్తి పొందాలని చెప్పారు. మనమందరం వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని స్ఫూర్తిగా తీసుకుని భారతదేశ పునర్నిర్మాణంలో భాగస్వాములం కావాలని పిలుపునిచ్చారు..

# మావోయిస్టుల లొంగుబాట్ల వెనుక..

>> ఏరివేస్తామని కేంద్రం ప్రకటించడంతో మావోయిస్టు పార్టీ అగ్ర నాయకత్వం ఛత్తీస్‌ఘడ్ సహా ఇతర రాష్ట్రాలలో పెద్ద సంఖ్యలో క్షేత్రస్థాయిలో వున్న నక్సలైట్లను వున్న పళంగా తెలంగాణ, ఎపి లేదా ఇతర రాష్ట్రాలలో తలదాచుకోవాలని, అక్కడికి ఏదో రూపంలో వలసవెళ్లాలని, అక్కడ అజ్ఞాతంలో కొంతకాలం వుండాలని బలవంతం చేస్తోందని లొంగిపోయిన వారు చెబుతున్నారు. పార్టీ అగ్ర నాయకత్వం బలవంతం చేయడం వల్ల ఆయా రాష్ట్రాలలో పోలీసుల కూంబింగ్ నుంచి ఎలాగోలా తప్పించుకుని తెలంగాణ, ఎపి, మహారాష్ట్రలకు వెళుతున్న క్షేత్రస్థాయి సాయుధ నక్సలైట్లు అక్కడ భౌగోళిక పరిస్థితులు అనుకూలించక పోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు.

వీరు వస్తున్న ప్రాంతలలో నక్సలైట్లు పెద్దగా లేక పోవడం సమస్యగా మారింది. స్థానిక భాషతో పాటు హిందీ భాష కూడా రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఆఖరుకు నిత్యావసర సరుకులు కొనేందుకు, ఆయా ప్రాంతాలలో తిరిగేందుకు, తలదాచుకునేందుకు వీరు ఇబ్బంది పడుతున్నారు. వీరిని చేస్తున్న ఆయా ప్రాంతాల ప్రజలు అపరిచితులు ఆయుధాలతో తిరుగుతుండడంతో పోలీసులకు సమాచారం ఇస్తున్నారు.

ఈ క్రమంలో స్థానిక పోలీసులు గాలింపు చర్యలు చేబడుతుండడంతో నక్సలైట్లు తప్పించుకోలేక పోతున్నారు. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యు)లో ఇటీవల అరెస్టయిన నక్సలైట్లు ఇలా దొరికిపోయిన వారే. వాస్తవానికి వీరంతా భాష తెలియక, నిత్యావసర సరుకులు కొనేందుకు ఇబ్బంది పడుతూ, ఎక్కడ వుండాలో తెలియక తమకు కొద్దిగా పరిచయం వున్న మావోయిస్టు సానుభూతిపరుల సహకారంతో పోలీసులకు ఆయుధాలతో లొంగిపోయారు. మొదట 18 మంది లొంగిపోగా ఆ తరువాత ఈ సంఖ్య పెరిగి చివరకు 41కి చేరింది. మహారాష్ట్రలో లొంగిపోయిన వారిలో విషయంలోనూ ఇలాంటివే జరిగినట్లుగా తెలిసింది.

ఇదే విషయమై తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ మావోయిస్టు అగ్ర నాయకత్వం తమ క్షేద్రస్థాయి కేడర్ బదిలీల్లో వారి అభ్యంతరాలను, ఇష్టాలను పరిగణలోకి తీసుకోక పోవడం వల్ల ఇతర ప్రాంతాలకు వెళుతున్న వారు అనేక ఇబ్బందులకు లోనవుతూ చివరకు లొంగిపోతున్నారని తెలిపారు. లొంగిపోయిన నక్సలైట్లలో అనేక మంది ఇదే విషయాన్ని చెబుతున్నారు.

# హైదరాబాద్ నుంచి అయోధ్యకు ఎపి సిఎం చంద్రబాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్27:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం అయోధ్యలో పర్యటించనున్నారు. శ్రీరామ జన్మభూమిలో కొలువుదీరిన బాలరాముడిని ఆయన దర్శించుకోనున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన ముఖ్యమంత్రి కార్యాలయం అధికారిక షెడ్యూల్‌ను విడుదల చేసింది.షెడ్యూల్ ప్రకారం, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి ఉదయం 11 గంటలకు అయోధ్య చేరుకుంటారు. అనంతరం నేరుగా శ్రీరామ జన్మభూమి కాంప్లెక్స్‌కు వెళతారు. ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు, సుమారు మూడు గంటల పాటు ఆయన ఆలయ ప్రాంగణంలోనే గడపనున్నారు. ఈ సమయంలో శ్రీరాముడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దర్శనం పూర్తయిన తర్వాత, మధ్యాహ్నం 3 గంటలకు అయోధ్య నుంచి బయలుదేరి ఆయన నేరుగా విజయవాడకు చేరుకుంటారు.

# గ్లోబల్ ఇన్నోవేషన్ సమ్మిట్‌కు కెటిఆర్‌కు ఆహ్వానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్27:** దుబాయ్‌లో జరిగే అంతర్జాతీయ ఇన్నోవేషన్ సమ్మిట్‌కు మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు ఆహ్వానం లభించింది. జనవరి 9 నుంచి 11 వరకు దుబాయ్2లో ఈ గ్లోబల్ ఇన్నోవేషన్ సమ్మిట్ జరుగనుంది.

పారిశ్రామికవేత్తల ప్రోత్సాహానికి ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. నూతన ఆవిష్కరణలు, స్టార్టప్ రంగాల్లో కెటిఆర్ చేసిన కృషిని గుర్తిస్తూ ఈ ఆహ్వానం ఆయనకు అందించారు.

# వివరాలివ్వండి

>> ఆస్తులకు సంబంధించిన లెక్కలు విధిగా ఇవ్వాల్సి ఉంటుంది. అలా చేయకపోతే, శాఖాపరమైన చర్యలు తీసుకోబడతాయి. అలాగే ప్రతి ఐఏఎస్ అధికారి ప్రతి సంవత్సరం ఏప్రిల్‌లో గత ఆర్థిక సంవత్సరానికి ఆన్‌లైన్‌లో స్వీయ అంచనాను ఇవ్వాలి. ఆ విధంగా వివరాలు ఇవ్వని అధికారులపై చర్యలు తీసుకునే హక్కు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగానికి ఉంటుంది. అటువంటి ఐఏఎస్ అధికారుల వార్షిక ఎంట్రీని నిలిపివేసే అవకాశాలు ఉన్నాయి. ఇది జరిగితే వారి ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లను కూడా ప్రభావితం అవుతాయి.

# సహించం

>> తాము దేశవ్యాప్తంగా విస్తృత అందోళన నిర్వహించాలని ప్రతిజ్ఞచేసినట్లు చెప్పారు. ఎంఎన్‌రేగా స్కీంనే కేంద్ర బిందువుగాచేసుకుని ఈ ఆందోలన కొనసాగుతుందన్నారు. వచ్చే నెల ఐదవ తేదీనుంచి ఎంఎన్‌రేగా పై ప్రచారం జరుగుతుందని ఖర్గే వెల్లడించారు. ఎంఎన్‌రేగా చట్టాన్ని ఎలాంటిపరిస్థితులు ఎదురైనా పరిరక్షించుకుంటామని, ఇది ఒక పథకం మాత్రమే కాదని, రాజ్యాంగం పనిహక్కులను ప్రసాదించిందని అన్నారు. అలాగే ఎంఎన్‌రేగాలో గాంధీజీ పేరును తొలగించడంపై ప్రజాస్వామ్య బద్ధంగానే తాము ఆందోళన చేస్తామన్నారు. ఎంఎన్‌రేగా రద్దుపై ప్రజలు ఆగ్రహంతో ఉనాననరని, ఎన్డీయే సర్కారు అందుకు మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఆయనహెచ్చరించారు. లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ మాట్లాడుతూ కేంద్ర కేబినెట్ లోనిసంబంధిత మంత్రులను కూడా సంప్రదించకుండా ప్రధానిమోడీ ఎంఎన్‌రేగా చట్టాన్ని రద్దుచేసారని ఆరోపించారు. పనిహక్కు వ్యవస్థలకు ఇపుడు విఘాతం కలిగిస్తున్నారని ఈనిర్ణయాన్ని నేరుగా ప్రధానమంత్రి కార్యాలయమే తీసుకున్నదని తనకు చెప్పారని, కేబినెట్‌లో సంబంధిత మంత్రులను కూడా సంప్రదించలేదని తెలియవచ్చిందనానరు. సుపరిపాలన అనేది వన్‌మాన్‌షోగా మారిపోయిందని, నరేంద్రమోడీ ఇష్టానికి అనుగుణంగా అన్నీ ఏకపక్షంగానే అమలవుతున్నాయని విమర్శించారు. ఖర్గేజీ చెప్పినట్లుగా దేశవ్యాప్తంగా ఈచట్టం రద్దును ఉద్యమరూపంలో వ్యతిరేకిస్తామన్నారు. మొత్తం ప్రతిపక్షం ఇందుకు కలిసివస్తుందన్న ధీమా ప్రకటించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వాయనాడు ఎంపి ప్రియాంక మాట్లాడుతూ ఎలాంటిపరిస్థితులు ఎదురయినా మేం ఎంజిఎన్‌రేగా పథకాన్ని పరిరక్షించుకుంటామని ఆపథకం యధావిధిగా కొనసాగాల్సిందేనని పేర్కొన్నారు. గ్రామీణులకు పనిహక్కును రాజ్యాంగపరంగా కల్పించిన చట్టం రద్దుచేయడం ఎంతమాత్రం అంగీకరించేదిలేదన్నారు. జనవరి ఐదునుంచి సేవ్ ఎంఎన్‌రేగా ప్రచారాన్ని ప్రారంభించేందుకు పార్టీశ్రేణులు సిద్ధం కావాలని కోరారు.

## వారం - వర్జ్యం

28-12-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, శుక్లపక్షం
అష్టమి ఉ.11.56, మూల కార్తె
ఉత్తరభాద్ర ఉ.8.41, రేవతి ఉ.7.41
వర్జ్యం : రా.8.11-9.42
దు.సా.4.11-4.56
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** దూరప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. వస్తులాభం.సోదరుల కలయిక.

**వృషభం:** ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అవకాశాలు లభిస్తాయి. శత్రువులు సైతం మిత్రులుగా మారతారు.సభలలో పాల్గొంటారు.

**మిథునం:** మాటల చాతుర్యంతో ఎదుటివారిని ఆకట్టుకొనే పనులు పూర్తిచేస్తారు. వస్త్రాలు కొనుగోలు.

**కర్కాటకం:** సంతాన విషయమై ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తారు. క్రమశిక్షణను పాటించడం వలన లాభపడతారు.

**సింహం:** మీలోని ప్రతిభా పాటవాలు వెలుగుచూసే దిశగా ప్రయాణం సాగిస్తారు. సంఘసేవాకార్యక్రమాలలో పాల్గొంటారు.

**కన్య:** ఒకానొక రహస్య సమాచారం తెలుసుకుంటారు. జీవిత భగస్వామితో చర్చలు జరిపి కొన్ని ముఖ్య నిర్ణయాలు చేస్తారు.

**తుల :** విధుల నిర్వహణలో, వ్యాపార రంగాలలో అభివృద్ధిని సాధిస్తారు. ఆరాధనలు, యాత్రలు సంభవము.

**వృశ్చికం:** దూరప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి.

**ధనుస్సు:** మాటపట్టింపులతో ఎంతో కాలంగా దూరమైన సన్నిహితులను కలుసుకుంటారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

**మకరం:** ముఖ్యకార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. వస్త్రాలాభం.

**కుంభం:** సంఘంలోని పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. స్వల్పధన లాభం. వాహన సౌలభ్యం.

**మీనం:** చిన్ననాటి మిత్రుల నుండి కీలక సమాచారం తెలుసుకుంటారు. రాజకీయ పరపతి పెరుగుతుంది. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# నా చొరవ వల్లే ఉన్నత విద్యకు కేరాఫ్ అడ్రస్‌గా హైదరాబాద్

## ఎన్టీఆర్ ఎడ్యుకేషనల్స్.. చిన్న మొక్క నుంచి పెద్ద వృక్షంగా మారింది

## సంస్థ వార్షికోత్సవంలో ఎపి సిఎం చంద్రబాబు నాయుడు



హైదరాబాద్‌లో శనివారం ఎన్టీఆర్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ వార్షికోత్సవంలో ఎపి సిఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్27:** పేద పిల్లలకు అండగా ఉండాలనే ఎన్టీఆర్ ట్రస్ట్ స్థాపించామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. గండిపేటలో నిర్వహించిన ఎన్టీఆర్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ వార్షికోత్సవంలో సీఎం మాట్లాడారు. "గండిపేటకు వస్తే నాకు చాలా ఆనందంగా ఉంటుంది. ఒకప్పుడు పార్టీ ప్రధాన కార్యాలయం ఇక్కడ ఉండేది. ఒకప్పుడు రాజకీయ నేతలకు శిక్షణ ఇచ్చే కేంద్రం ఇది. ఇప్పుడు అదే స్థలంలో పిల్లలకు చదువు నేర్పుతున్నారు. రకరకాల కారణాల వల్ల చాలామంది పిల్లలు అనాథలుగా మారే వారు. ఆ పిల్లలకు పెద్ద దిక్కుగా ఉండాలనే ఈ విద్యా సంస్థలకు శ్రీకారం చుట్టాం. ఆ నాడు నాటిన చిన్న మొక్క.. ఇవాళ పెద్ద వృక్షంగా తయారైంది. ఈ విద్యా సంస్థను సమర్థంగా నిర్వహిస్తున్న ఘనత భువనేశ్వరిదేనని అభినందించారు.గ్రూప్1 పోస్టులకు ఇక్కడి నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఐఐటీలు, ఎన్ఐటీల్లో 29 మంది సీట్లు సంపాదించారు అని చెప్పారు. ఇప్పుడు పలు చోట్ల 1,641 మంది పిల్లలు చదువుతున్నారు. చిన్న పాఠశాల నుంచి ఇంటర్, డిగ్రీ కాలేజీ వరకుఈ సంస్థ ఎదిగిందని పేర్కొన్నారు. నా చొరవ వల్లే ఉన్నతవిద్యకు కేరాఫ్ అడ్రస్‌గా హైదరాబాద్ మారిందన్నారు. 'రాజకీయాల ద్వారా కాకుండా వ్యవసాయం, వ్యాపారం ద్వారా సంపాదించాలనే హెరిటేజ్ పెట్టాం. మొదట్లో హెరిటేజ్ బాధ్యతలు తీసుకునేందుకు భువనేశ్వరి ఒప్పుకోలేదు. తర్వాత హెరిటేజ్‌ను సమర్థంగా నిర్వహించే స్థాయికి ఆమె చేరారు' అని చెప్పారు. 'ఆరోజు హైటెక్ సిటీ కట్టి ఐటీని ప్రోత్సహించాను. ఈరోజు మళ్లీ డేటా సెంటర్, ఏఐ, క్వాంటమ్ వ్యాలీ,క్వాంటమ్ కంప్యూటర్స్, గ్రీన్ ఎనర్జీ, సెమీ కండక్టర్, డ్రోన్ టెక్నాలజీ. స్పేస్ టెక్నాలజీకి చిరునామాగా ఏపీని తయారు చేయాలని నెక్స్ట్ జెనరేషన్‌కు వెళ్లాం. టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నాం' చంద్రబాబు అన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఎన్టీఆర్ విద్యా సంస్థల వార్షికోత్సవాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎన్టీఆర్ ట్రస్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ప్రారంభించారు. తర్వాత యాన్యువల్ రిపోర్టులను ఎన్టీఆర్ విద్యా సంస్థలకు చెందిన స్కూల్, కాలేజీ ప్రిన్సిపాల్స్ జోజి రెడ్డి, రామారావు సమర్పించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి మాట్లాడుతూ విద్యార్థుల ఆశలకు అనుగుణంగా వారి భవిష్యత్తును రూపుదిద్దుతున్నాం. మానవ సేవే మాధవ సేవ అని ఎన్టీఆర్ నమ్మారు. దానికి అనుగుణంగానే ఎన్టీఆర్ ట్రస్ట్ పని చేస్తోందని చెప్పారు.ఎన్టీఆర్ ట్రస్ట్ నుంచి హెల్త్ కేర్ సర్వీసులు, తలసేమియా సెంటర్, ఎన్టీఆర్ సంజీవని క్లినిక్‌లు పని చేస్తున్నాయన్నారు. విద్యార్థులకు అండగా నిలిచేలా, కుటుంబాలను ఆదుకునేలా ఎన్టీఆర్ ట్రస్ట్ పని చేస్తోందన్నారు. ఇదే ఎన్టీఆర్‌కు మేం ఇచ్చే నివాళి.ఎన్టీఆర్ విద్యా సంస్థల ద్వారా చదువుకున్న వారు వివిధ ప్రాధాన్యత రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే టీచర్లు ఎన్టీఆర్ విద్యా సంస్థల్లో ఉన్నారు.

బాహ్య ప్రపంచంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది... దానికి ఇక్కడి నుంచే సంసిద్ధమవ్వండి సూచించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో.. ఆయన చూపిన దారిలో ఎన్టీఆర్ విద్యా సంస్థలను, ఎన్టీఆర్ ట్రస్టును నడుపుతున్నాం. విద్యార్థులే ఎన్టీఆర్ విద్యా సంస్థలకు అంబాసిడర్లు అని నారా భువనేశ్వరి తెలిపారు.



శనివారం న్యూఢిల్లీలో సిడబ్ల్యుసి సమావేశంలో సిఎం రేవంత్, కర్ణాటక సిఎం సిద్ధరామయ్య తదితరులు

# 5 నుంచి 'ఉపాధి హామీ' బచావో

>> ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుందని తెలిపారు. శనివారం ఢిల్లీలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే సారథ్యంలో జరిగిన పార్టీ అత్యున్నత నిర్ణాయక మండలి సమావేశం ఈ మేరకు తీర్మానించిందని స్పష్టం చేశారు. పేదవాడి ఆకలి తీర్చి, ప్రతిపౌరుడి ఉపాధికి హామీ ఇచ్చి, పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పన చేకూర్చే బహుళ ప్రయోజనాలతో నాటి యుపిఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రద్దు చేయడాన్ని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీవ్రంగా ఖండించిందని పేర్కొన్నారు. మహాత్ముడి పేరుతో తీసుకువచ్చిన ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాలని సిడబ్ల్యుసి తీర్మానించిందని వెల్లడించారు. దీని కోసం దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు,నిరసనలు వ్యక్తం చేయాలని నిర్నయించిందని వివరించారు. ఈ మేరకు సిడబ్ల్యుసి సమావేశం ఫోటోలు షేర్ చేశారు. ఈ క్రమంలోనే ఒక ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. సిఎం రేవంత్‌రెడ్డి, సోనియాగాంధీ,రాహుల్‌గాంధీలతో సరదాగా నవ్వుతూ సంభాషించారు. ఈ సందర్భంగా నేతల మధ్య స్నేహపూర్వక వాతావరణం కనిపించింది. ఇందుకు సంబంధించిన ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సమావేశానికి ముందు చోటు చేసుకున్న ఈ సరదా క్షణాలు కాంగ్రెస్ నేతల మధ్య ఐక్యతకు నిదర్శనంగా నిలిచాయని పార్టీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఇదిలా ఉండగా... ఢిల్లీ వేదికగా జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం రాహుల్‌గాంధీ మీడియాతో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకునేందుకు దేశ వ్యాప్తంగా పోరాటం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.గాంధీజీ పేరును తొలగించి జాతిపితను అవమానించారని మండిపడ్డారు.కేబినెట్‌లో పెట్టకుండా... దీనిపై కనీసం చర్చ చేయకుండా పేరు మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**చాలా కాలం తర్వాత హాజరైన హాజరైన శశిథరూర్**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, తిరువనంతపురం ఎంపీ శశి థరూర్ చాలా కాలం తర్వాత కాంగ్రెస్ పార్టీ సమావేశానికి హాజరయ్యారు. ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు.. గతంలో పలు సందర్భాల్లో ఆయన కేంద్ర ప్రభుత్వంపై, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రశంసలు కురిపించిన విషయం తెలిసిందే. దాంతో కాంగ్రెస్ హైకమాండ్‌కు, శశి థరూర్ కు మధ్య దూరం పెరిగింది. ఆయన కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీ సమావేశాలకు దూరంగా ఉన్నారు. కొద్ది రోజుల క్రితం ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఖిఓట్ చోర్ గడ్డీ ఛోడ్‌ఖి ర్యాలీకి శశి థరూర్ గైర్హాజరయ్యారు. అంతేకాకుండా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ లోక్‌సభ ఎంపీల సమావేశానికి కూడా ఆయన హాజరు కాలేదు,ఇటీవల తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌ను బీజేపీ కైవసం చేసుకోవడంపై ఆయన స్పందించిన తీరు కూడా కాంగ్రెస్ పార్టీకి ఆగ్రహం తెప్పించింది. కేరళ రాజధాని రాజకీయ రంగంలో ఒక ముఖ్యమైన మార్పును సూచించే బలమైన ప్రదర్శన అని, తిరువనంతపురంలో బీజేపీ సాధించిన చారిత్రాత్మక పనితీరును గుర్తించాలంటూ ఆయన పేర్కొన్నారు.వివిధ సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వాన్ని, మోదీని ప్రశంసించడం కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం నచ్చలేదు. దీంతో ఆయన వ్యవహార శైలిపై తొలుత మౌనంగా ఉన్న పార్టీ నాయకులు, ఆ తర్వాత మాత్రం ఆయనపై తీవ్రంగా స్పందించారు. ఆయన సిద్ధాంతాలు వేరుగా ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఎందుకు కొనసాగుతున్నారని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ అధిష్ఠానం ఆయన తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నప్పటికీ, అగ్రస్థాయి నాయకులు ఎవరూ నేరుగా ఆయనపై స్పందించలేదు. ఈ నేపథ్యంలో నేటి సీడబ్ల్యూసీ సమావేశానికి శశి థరూర్ హాజరు కావడం చర్చనీయాంశమైంది.

# విచారణ ఏమైంది?

>> కేసును పూర్తిగా నీరుగార్చారని మండిపడ్డారు. అకున్ సబర్వాల్ సేకరించిన ఆధారాలు, ఆడియో, వీడియో రికార్డులు, స్టేట్ మెంట్లను సోమేశ్ కుమార్ తదుపరి విచారణ టీంకు అప్పగించలేదని, వాటిని కోర్టుకు స్వాధీనం చేయలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా డ్రగ్స్ నిర్మూలనపై చిత్తశుద్ధి ఉంటే సీఎం ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఈగల్ టీం వెంటనే రంగంలోకి దిగి సోమేశ్ కుమార్‌ను విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

ఈగల్ టీం విచారణ తీరుపైనా ఈ సందర్భంగా బండి సంజయ్ అనుమానం వ్యక్తం చేశారు. ఈగల్ టీంకు నిజంగా లీగల్ గా అధికారాలున్నాయా? అని ప్రశ్నించారు. ఈగల్ టీంలో సమర్థులైన అధికారులు ఉన్నప్పటికీ, ఒకరిద్దరు అధికారులు మాత్రం డబ్బులకు అమ్ముడుపోయి డ్రగ్ పెడ్లర్లతో రాజీపడుతున్నారని తెలిపారు. ఈగల్ టీం దాడిలో పెడ్లర్ల నుండి డ్రగ్స్ కొనుగోలు చేసిన ఇంతవరకు ఎందుకు అరెస్ట్ చేయలేదు? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో విచ్చల విడిగా పెరుగుతున్న డ్రగ్స్ విక్రయాలపై ఉక్కుపాదం మోపాలంటే అకున్ సబర్వాల్ వంటి సమర్థులైన అధికారులకు తిరిగి డ్రగ్స్ కేసు విచారణ బాధ్యతలను అప్పగించాలని డిమాండ్ చేశారు. అట్లా కాకుండా డ్రగ్స్ కేసు విచారణ తేల్చకుండా తూతూ మంత్రంగా కేసులు నమోదు చేసినంత మాత్రాన రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలన సాధ్యం కానేకాదని స్పష్టం చేశారు.

## కల్తీనెయ్యికేసు: సిట్ విచారణకు భూమన

**తిరుపతి,డిసెంబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు కల్తీనెయ్యిసరఫరా చేసిన కేసులో శనివారం కీలక పరిణామం చోటుచేసుకుంది. గత రెండువారాలుగా స్తబ్ధుగా ఉంటున్న సిబిఐ సిట్ అధికారులు శనివారం టిటిడి మాజీఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని సిట్ కార్యాలయంకు పిలిపించుకుని సుమారు రెండున్నరగంటలపైగా పలు అంశాలపై విచారణ చేశారని తెలిసింది. 2023లో భూమన కరుణాకర్‌రెడ్డి టిటిడి ఛైర్మన్‌గా రెండవసారి బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఆయన వైవి సుబ్బారెడ్డి ఛైర్మన్‌గా కొనసాగిన బోర్డులో సభ్యుడుగా కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో 2020-23మధ్యకాలంలో కల్తీనెయ్యి సరఫరా జరగడం, ఆ వివరాలు ఏమైనా తెలుసా?కల్తీనెయ్యి సరఫరా అయ్యిందని తెలిసినా ఎందుకు అడ్డుకోలేకపోయారు?దీనివెనుక ఎవరి ప్రమేయం ఉంది,అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారనే ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారనేది తెలుస్తోంది. నెయ్యికొనుగోలు టెండర్లు, నాణ్యత పరిశీలన తదితర అంశాలపై సిట్ అధికారులు అడిగిన ప్రశ్నలకు అప్పటి అధికారులే అంతా చూసుకోవడం జరిగిందనేది సమాధానంగా తెలిసింది. అంతేగాక తన హయాంలో కల్తీనెయ్యి అనేది రాలేదని, ఆపై నెయ్యిసరఫరాలో టెండర్లు అప్పటికే ఉన్నవాటినే కొనసాగించామనేది సమాచారం ఇచ్చారని తెలిసింది. సుదీర్ఘవిచారణఅనంతరంభూమన బయటకు వచ్చారు. ఇదిలా ఉండగా ఇప్పటికే మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి ఢిల్లీ హైకోర్టు కల్తీనెయ్యి బాగోతం కేసులో కోర్టును ఆశ్రయించడం, ఆధారాలు లేని వార్తలు రాస్తే విచారణ ఎదుర్కోవాల్సి వస్తుందని న్యాయవాది చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం కీలకమైన మరో నేత భూమననను విచారణ చేయడం మాత్రం ప్రత్యేకత.

# రూ.26 లక్షలకే గచ్చిబౌలిలో ఫ్లాటు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్27:** గచ్చిబౌలిలోని వివిధ ప్రాంతాల్లో మొత్తం 111 ఫ్లాట్లు అమ్మకాలకు అందుబాటులో ఉన్నాయి. ఎల్ఐజీ వర్గాలకు చెందిన అర్హులైన దరఖాస్తుదారులకు ఉన్నచోట ఉన్నట్లుగానే అనే ప్రాతిపదికన ఈ ఫ్లాట్లను విక్రయించాలని నిర్ణయించినట్లు టీజీహెచ్‌బీ వైస్ ఛైర్మన్, హౌసింగ్ కమిషనర్ వీపీ గౌతం తెలిపారు. నిర్ణీత ధరావతు(ఐఎండీ) టోకెన్ అడ్వాన్సును చెల్లించిన దరఖాస్తుదారుల మధ్య జరిగే పారదర్శక లాటరీ పద్ధతిలో ఈ ఫ్లాట్లను కేటాయించనున్నారు. ఐటీ కారిడారైన హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ సమీపంలో ఉండటంతో గచ్చిబౌలిలో రోజు రోజుకూ భూములు ధరలు కొండెక్కుతున్నాయి. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, ఇన్ఫోసిస్ వంటి ప్రధాన కార్యాలయాలు, గ్లోబల్ కెపాసిటీ సెంటర్ల (జీసీసీ) విస్తరణతో ఉద్యోగాల సంఖ్య ఇంకా పెరుగుతోంది. దీంతో ఇక్కడి స్థలాలకు రెసిడెన్షియల్, కమర్షియల్‌గా భారీడిమాండ్ ఏర్పడింది. గచ్చిబౌలి ప్రాంతంలో అపార్ట్‌మెంట్,ఫ్లాట్లు చదరపు అడుగుకి సగటు ధర సుమారు రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు ఉంది. ప్రస్తుతం హౌసింగ్ బోర్డు లాటరీ తీయనున్న ఫ్లాట్లకు కనీస ధర కింద రూ.26.4 లక్షలుగా నిర్ణయించారు. దీంతో ఒక్కో చదరపు అడుగుల ప్లింత్ ఏరియా సుమారు రూ.6 వేలకు దిగువ ఆదాయ వర్గాల వారికి అందుబాటులో లభించనుంది. దిగువ ఆదాయ వర్గం (ఎల్ఐజీ ఫ్లాట్లు) కింద దరఖాస్తు చేసుకునే వారికి నెలవారీ ఆదాయ అర్హత నెలకు రూ.50వేలు అంటే (ఏడాదికి రూ.6 లక్షలు) వరకు మాత్రమే ఉండాలి. ఆదాయానికి సంబంధించిన ధ్రువీకరణను ఫ్లాటు కేటాయింపు తర్వాత తప్పని సరిగా సమర్పించాల్సి ఉంటుంది. ఈఎండీ, టోకెన్ అడ్వాన్స్ రూ.లక్షను రాష్ట్రంలోని ఏదైనా మీసేవ సెంటర్‌లో చెల్లించవచ్చు.ధరావతుతో ఆన్‌లైన్ ద్వారా అప్లై చేయడానికి జనవరి 3న చివరి తేదీగా నిర్ణయించారు. మీ సేవ కేంద్రంతో పాటు టీజీహెచ్‌బీ ఈఈ, ఎస్ఆర్‌నగర్ కార్యాలయంలో కూడా ఈ దరఖాస్తును సమర్పించవచ్చు. ఆయా ఫ్లాట్లకు జనవరి 6న ఉదయం 11 గంటలకు, తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు గచ్చిబౌలిలోని నిర్మిత్ కేంద్రంలో లాటరీ ప్రక్రియ జరగనుంది. ఫ్లాటు కేటాయించిన తర్వాత ఆ మొత్తాన్ని మొదటి 15 రోజుల్లో 25 శాతం, 60 రోజుల్లో 50 శాతం, 90 రోజుల్లో మిగిలిన 25శాతం ప్రాతిపదికన మూడు విడతల్లో డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఖరీదైన ప్రాంతంలో తక్కువ ధరకు ఫ్లాట్లు అందుబాటులో ఉండటంతో భారీగా స్పందన వస్తున్నట్లు హౌసింగ్ బోర్డు అధికారులు చెబుతున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) డివిజన్ సత్తుపల్లి నిట్ నం.17/TS/TO/EE/R&B/SPL/2025-26/ తేది: 22.12.2025 ప్రకారం ఖమ్మం జిల్లాలో 10 నం.ల రోడ్ల పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానిస్తున్నారు. టెండరు షెడ్యూల్‌ను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. టెండర్ల స్వీకరణకు చివరి తేది: 31.12.2025 మ.2.30 గం. వరకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) డివిజన్ : సత్తుపల్లి
DIPR.No.12680-PP/CL/Advt/1/2025-26, తేది: 27.12.2025

## డ్రగ్స్ కేసులో రకుల్‌ప్రీత్‌సింగ్ సోదరుడు అమన్‌ప్రీత్‌సింగ్ పరార్

**హైదరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త:** టాలీవుడ్‌లో మరోసారి డ్రగ్స్ కేసు కలకలం రేపింది. ఇప్పటికే పలువురు సినీతారలు మాదకద్రవ్యాల కే సులో నిందితులుగా వుండి కోర్టుల చుట్టూ తిరుగుతుండగా మరికొందరు పరారీలో వుండడం లేదా ఆత్మహత్యలకు పాల్పడడం తెలిసిందే. తాజాగా హీరోయిన్ రకుల్‌ప్రీత్ సింగ్ సోదరుడు అమన్‌ప్రీత్ సింగ్ డ్రగ్స్ కేసులో నిందితుడుగా వుండి పరారీలో వుండడం సంచలనం రేకెత్తించింది. అమన్ ప్రీత్ సింగ్ టాలీవుడ్‌లో ఒక సినిమాలో హీరోగా నటిస్తుండడం తెలిసిందే. పలు హిందీ సినిమాల్లో ఇతను నటించడం గమనార్హం. శివార్లలోని నారి ్సంగి పోలీసు స్టేషన్‌లో నమోదైన డ్రగ్స్ కేసులో ఇతను నిందితుడు. ఈ కేసులో డ్రగ్స్ అమ్మకం దారులు పట్టుబడగా వారి వద్ద మాదకద్రవ్యాలను కొన్న అమన్‌ప్రీత్ సింగ్‌ను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో అతను బెయిలుపై వున్నాడు.

కాగా తాజాగా ఈగల్ పోలీసులు నితిన్ సింఘానియా, శ్రనిక్ సింఘ్వి అనే ఇద్దరు డ్రగ్స్ స్మగ్లర్లను ఈ నెల 19వ తేదీన మాసాబ్‌ట్యాంక్ వద్ద పట్టుకున్నారు. వీరిద్దరు నగరంలోని ట్రూప్ బ జార్‌కు చెందిన వారు. వీరి వద్ద 43 గ్రాముల కొకైన్, మరికొంత ఎండిఎంఎ డ్రగ్స్‌ను జప్తు చేశారు. డ్రగ్స్ కేసులో పట్టుబడ్డ వీరిని విచారించగా అమన్‌ప్రీత్ సింగ్ పేరు వెలుగు చూసింది.

తమ వద్ద అమన్‌ప్రీత్ సింగ్‌తో పాటు మరికొందరు రెగ్యులర్‌గా కొకైన్‌తో పాటు మరికొన్ని రకాల మాదక ద్రవ్యాలను కొంటారని ఇద్దరు నిందితులు చెప్పడ ం సంచలనం రేపింది. దీంతో అ మన్‌ప్రీత్ సింగ్ కోసం ఈగల్ పోలీసులతో పాటు హైదరాబాద్ పోలీసులు గాలిస్తున్నారు. మరోవైపు సైబరాబాద్ పోలీసులు కూడా ఇతని కోసం గాలిస్తున్నారు.

# హైదరాబాద్‌లో 15 శాతం తగ్గిన నేరాలు

**పెరిగిన శిక్షల శాతం.. ఈ యేడాది పండగలు, వేడుకలు, ప్రశాంతం**

**నగరంలో శాంతి భద్రతలు భేష్**

**రాజకీయ నేతల ఆరోపణలు నిరాధారం**

**వార్షిక మీడియా సమావేశంలో సిటీ కొత్వాల్ సజ్జనార్ వెల్లడి**

**హైదరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త:** జంట నగరాలలో 2025లో నేరాలు 15 శాతం తగ్గాయని, ఇదే సమయంలో నేరగాళ్ల పట్టివేత, శిక్షల శాతం కూడా పెరిగిందని సిటీ కొత్వాల్ సజ్జన్నార్ తెలిపారు. ఈ యేడాది పండగలతో పాటు వేడుకలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సాఫీగా జరిగిందని, శాంతి భద్రతలు కూడా సవ్యంగానే వున్నాయని, నేరాలను కూడా కట్టడి చేశామని, ఈ విషయంలో రాజకీయ నేతలు చేస్తున్న విమర్శలు నిరాధారమని ఆయన కొట్టివేశారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌లో శనివారంనాడు సిటీ పోలీసు విభాగం 2025 వార్షిక నివేదికను కమిషనర్ తొలిసారిగా డిజిటల్‌గా విడుదల చేసి అనంతరం మ్యాను వల్‌గా కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిటీ పోలీసు విభా గానికి ఈ ఏడాది అన్ని విభాగాల్లో బాగా కలిసి వచ్చిందని మొత్తం మీద అన్ని రకాల నేరాలు 15 శాతం తగ్గాయని, సైబర్ నేరాలు ఎనిమిది శాతం తగ్గాయని, ప్రజల్లో నేరాలపై అవగాహన కలిగినందుకు ఇది సాధ్యపడిందని ఆయన అన్నారు. అయితే పలురకాల సైబర్ నేరాలు ఇప్పటికీ ఆందోళన కలిగించే విధంగానే వున్నాయని ఆయన తెలిపారు. ఇందుకు అనేక కారణాలు వున్నాయని, ఇందులో ప్రజలు మరింత చైతన్యం కావాలని, లేనిదా నికి ఆశపడవద్దని ఆయన కోరారు. సైబర్ నేరాలలో దోపిడికి గురయ్యే సొమ్మును రాబట్టడం అంత సులభం కాదని ఆయన తెలిపారు. సైబర్ నేర గాళ్లు ప్రపంచ వ్యాప్తంగా ఏదో ఒకచోట వుండి ఇక్కడ నేరాలకు పాల్పడుతున్నందున అనేకసార్లు వారిని పట్టుకోవడం కూడా కష్టమవుతుందని ఆయ న తెలిపారు. ఈ నేరాల నివారణకు ప్రజలు చైతన్యం కావడంతో పాటు పోలీసుల సూచనలను పాటించడం మంచిదని ఆయన తెలిపారు. సైబర్ నేరాల కట్టడికి సైబర్ సెక్యూరిటీ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు దీనిని మరింత పటిష్టం చేశామని, ఈ క్రమంలోనే అనేక మంది నేరగాళ్లను అరెస్టు చేయడంతో పాటు బాధితులు పో గొట్టుకున్న సొమ్మును చాలా వరకు జప్తు చేయగలిగామని సజ్జన్నార్ తెలిపారు. సిటీలో ఆస్తుల చోరీల కే సులు చాలా వరకు తగ్గాయని, దీంతో పాటు వీటి రికవరీ (జప్తు చేయడం) కూడా పెరిగిందని కమిషనర్ తెలిపారు. నేరగాళ్ల పట్టివేత చాలావరకు పెరిగిందని, వీరికి శిక్షలు పడడం కూడా గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పెరిగిందని, 2025లో శిక్షల శాతం రికార్డు స్థాయిలో 67గా వుందని ఆ యన తెలిపారు. పోలీసుల సమిష్టి కృషికి ఇది ఒక నిదర్శనమని ఆయన తెలిపారు. ఈ ఏడాది సిటీ పోలీసు విభాగం అనేక అంశాలలో మంచి పు రోగతిని సాధించిందని కమిషనర్ వెల్లడించారు. అన్ని పండగలు, వేడుకలతో పాటు ఉత్సవాలతో పాటు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఎలాంటి ఆటంకా లు లేకుండా సాఫీగా నిర్వహించడంలో పోలీసులు విజయం సాధించారని ఆయన తెలిపారు. శాంతి భద్రతల పరంగా కూడా సిటీ పోలీసు విభాగా నికి మెరుగ్గానే సాగిందని ఆయన అన్నారు. దేశ వ్యాప్తంగా నేరాల నివారణ, భద్రత విషయంలో హైదరాబాద్‌కు మంచి ర్యాంకు వుం దని ఆయన వె ల్లడించారు. మాదక ద్రవ్యాల విషయంలో సిటీ పోలీసు విభాగం మంచి ఫలితాలను సాధించిందని, నార్కో టిక్ బ్యూరోతో సమన్వ యంగా వుంటూ అ నేక మ ంది నేరగాళ్లను అరెస్టు చేయడంతో పాటు పెద్ద మొత్తంలో డ్రగ్స్‌ను జప్తు చేశామని కమిషనర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని మాదకద్రవా ్యల రహితంగా చూడాలన్న సర్కారు సంకల్పాన్ని నెరవేర్చేందుకు సిటీ పోలీసు విభాగం తమ వంతు కృషి చేస్తుందని ఆయన అన్నారు. హైదరాబా ద్‌లో మాదకద్రవ్యాలు అమ్మేవారు ఎంతటి వారైనా ఊచలు లెక్కపెట్టవలసిందేనని ఆయన హెచ్చరించారు. జంట నగరాలలో రోడ్డు ప్రమాదాలు ఈ ఏడాది తగ్గాయని, మృతుల సంఖ్య కూడా తక్కువగానే వుందని ఆయన తెలిపారు. వచ్చే ఏడాది నగర వ్యాప్తంగా సిసి కెమెరాల ఏర్పాటు, వాటి ని ర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆయన వెల్లడించారు. ఇప్పుడు 5.42 లక్షల సిసి కెమెరాలు వుండగా వీటి సంఖ్యను మరింత పెంచడంతో పాటు నిర్వహణ విషయంలో చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. సైబర్ నేరగాళ్లతో పాటు డ్రగ్స్ స్మగ్లర్ల భరతం పడతామని, ఇందుకోసం ని రంతరం నిఘా వుంటుందని ఆయన పేర్కొన్నారు. శాంతి భద్రతల విషయంలో రాజీ లేదని, వచ్చే ఏడాది డ్రోన్ల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తామని కమిషనర్ తెలిపారు. టెక్నాలజిని వాడి నేరాల నివారణకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా వుంచాలని, మైనర్లు డ్రైవింగ్ చేయకుండా చూడాలని ఆయన కోరారు. కాగా ఈ ఏడాది 31వ తేదీ రాత్రి సమయంలో జంట నగరాలలో నిర్వహించే నూతన స ంవత్సర వేడుకలు అన్ని వర్గాల వారు ప్రశాంతంగా జరుపుకోవాలని, ఎక్కడా అతి చేయరాదని కమిషనర్ కోరారు. అర్ధరాత్రి ఒంటి గంటకు అన్నిచోట్ల వేడుకలు ముగించాలని, ఇందుకోసం అరగంట ముందు నుంచే నిర్వాహకులు సన్నాహాలు చేయాలని ఆయన సూచించారు. ఆయా ప్రాంతా ల పోలీసులు 15 నిమిషాల ముందే వేడుకలు జరిగేచోట వుండి అంతా సాఫీగా ముగిసేలా సహకరిస్తారని ఆయన తెలిపారు. వేడుకల్లో ఎక్కడా డ్రగ్స్ వుండరాదని, ఒకవేళ వుంటే క ఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ విషయంలో నిర్వాహకుల కచ్చితంగా వ్యవహరించకుంటే వారిపైనా చర్యలు వుంటాయని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో క్రైం అండ్ సిట్ అదనపు పోలీసు కమిషనర్ శ్రీనివాస్, సిసిఎస్ జాయిం ట్ పోలీసు కమిషనర్ శ్వేత, ఆయా విభాగాల డిసిపిలు ఇతర అధికారులు పాల్గొన్నారు.







విజయవాడలో శనివారం మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

## రాష్ట్ర విభజన వద్దని చెప్పా

**పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు**

**విజయవాడ, డిసెంబరు 27, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన దురదృష్టకరమని కాంగ్రెస్ సీనియర్ నేత ,పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు.రాష్ట్ర విభజనపై సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియా సమావేశంలో మాట్లాడిన జగ్గారెడ్డి.. తాను రాష్ట్ర విభజనను వ్యతిరేకించినట్లు పేర్కొన్నారు. అప్పుడు రాష్ట్ర విభజనకు చంద్రబాబు,జగన్ కూడ అనుకూల లేఖలు ఇచ్చారని గుర్తు చేశారు. ఇక విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై మాట్లాడుతూ...సిఎం చంద్రబాబు నాయుడు, మాజీ సిఎం జగన్, పవన్‌కళ్యాణ్ ప్రతి ఒక్కరూ ప్రధాని మోడీ ఆడమన్నట్లు ఆడుతున్నారని మండిపడ్డారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని మరోసారి గుర్తు చేశారు జగ్గారెడ్డి, పార్లమెంటులో మాకు 20 మంది ఎంపీలను ఇస్తే..స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా ఆపుతామని ధీమా వ్యక్తం చేశారు. ఏపీ, టీజీ రాష్ట్రాలు కీలకంశాల్లో ఏకీభవంతో వ్యవహరించాలని, ఉభయ రాష్ట్రాలకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాబట్టుకోవాలన్నారు. ఏపీలో కాంగ్రెస్ బలీయమైన రాజకీయ శక్తిగా ఎదగనున్నదన్నారు. దేశానికి రాహుల్ ప్రధాని కావడం ఖాయమన్నారు.

# ఆ మాటలు విత్‌డ్రా చేసుకొంటున్నా..

**నేనిచ్చిన సలహాలో తప్పేమీ లేదు..**

**మహిళా కమిషన్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పా**

**నాకు బాగా కావాల్సిన వారే ఇంత కుట్ర చేస్తారనుకోలేదు**

**మహిళల పట్ల చులకనగా ఏమీ మాట్లాడబోను: నటుడు శివాజీ**

**హైదరాబాద్ (బేగంపేట) డిసెంబరు 27, ప్రభాతవార్త:** తనకు కావల్సిన వారు ఇంత కుట్ర చేస్తారని అనుకోలేదని నటుడు శివాజీ అన్నారు. దండోరా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మహిళల వస్త్రధారణపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపడంతో ఆయన ఒక వీడియో లో క్షమాపణ కూడా చెప్పారు. ఈ క్రమంలో నటుడు శివాజీ కి మహిళలపై అవమానకర వ్యాఖ్యలు చేసారంటూ తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఇటీవల నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో శనివారం ఆయన రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ నేరెళ్ల శారద ఎదుట వ్యక్తిగతంగా హాజరయ్యారు.శివాజీ మహిళల వ్యాఖ్యల అంశంలో వివరణ ఇచ్చారు. మహిళల పట్ల జాగ్రతతగా మాట్లాడాలని కమీషన్ సూచించింది.దాదాపు 3గంటల పాటు విచారించిన మహిళా కమీషన్ ఛైర్ పర్సన్ నేరెళ్ల శారద విచారణ అనంతరం ఆయన నుంచి వివరణ పత్రం తీసుకుని పంపించారు.కమీషన్ ఛైర్ పర్సన్ నేరెళ్ల శారద అడిగిన వాటికి సమాధానం చెప్పానని వెల్లడించారు.ఇకపై మహిళల పట్ల చులకనగా మాట్లాడబోనని శివాజీ తెలిపారు. విచారణ అనంతరం శివాజీ మాట్లాడుతూ నేను ఏం తప్పు చేసానని నా మీద ఇంత కోపం.మీ అమ్మా,నాన్న మీ ఇంట్లో మీకు జాగ్రత్తలు చెప్పారా. ఎవరు ఎలాంటి దుస్తులు వేసుకుంటే నాకేంటి.ఎవరి దుస్తు లు వారి ఇష్టం.ఇంతకు ముందు ఇలాంటి వ్యాఖ్యలు ఎవరూ చేయలేదా.వారి మీద కూడా ఇలాగే మాట్లాడారా. సినిమా ప్రమోషన్ కోసం అని కూడా కొందరు ప్రచారం చేస్తున్నారు.దండోరా ఈవెంట్‌లో నేను చేసిన కామెంట్స్‌కు కమిషన్ నాకు నోటీసులు ఇచ్చింది.నా వ్యాఖ్యల వల్ల బాధపడ్డ వారి తరుపున కమీషన్ ప్రశ్నలు అడిగింది.వాటికి నేను సమాధానం చెప్పా. నేను ఎవరినీ నొప్పించాలని మాట్లాడలేదు. ఇట ీవల



మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారదకు క్షమాపణ పత్రాన్ని అందజేస్తున్న నటుడు శివాజీ

చోటు చేసుకున్న సంఘటనల నేపథ్యంలో మాట్లాడేటప్పుడు తప్పులు దొర్లాయి. నాపైన కుట్ర జరుగుతుందని, ఆరోపిం చారు. తనతో పాటు సినిమా కెరియర్ ప్రారంభిం చిన వారే ఇదంతా చేస్తున్నారని తెలి పారు. వ్యాఖ్యలు చేసిన తర్వాత ఇబ్బంది పెట్టాలని కొందరు జూమ్ మీటింగ్ పెట్టుకున్నా రని చెప్పారు.తనకు బాగా కావాల్సి న వారు ఇంత కుట్ర చేస్తారని అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేసారు.శివాజీ తప్పు చేసాడు అనుకుంటే రండి మాట్లాడుకుందాం. నేను అనవసరంగా సలహాలు ఇచ్చాను.భారతదేశంలో కుటుంబ వ్యవస్థ అత్యంత గోప్యంగా ముందుకు వెళ్తుంది.ఎవరి హక్కులకు భంగం కలిగినా రక్షించే వ్యవస్థలు ఉన్నాయి.సలహాలు ఇవ్వడం మాను కోవాలని నాకు అర్థమైంది. కమిషన్ అడిగిన వాటికి సమాధానం చెప్పాను.ఇంకా వివరణ ఇవ్వాల్సి వస్తే మళ్లీ కమిషన్ ముందుకు వస్తా. వాళ్లకు నచ్చని ఆ మాటలను వెనక్కి తీసుకుంటున్నా.ఈ విషయాన్ని ఇక్కడితో వదిలేద్దాం. సినిమాలు రాకపోతే నేను రైతు బిడ్డను వ్యవసాయం చేసుకుని బతుకుతా.నాది రైతు కుటుంబం.నేను ఎవరినీ నొప్పించాలని మాట్లాడలేదు.ఎవరి బెదిరింపులకు నేను భయపడను. ఆత్మాభిమానం చంపుకొని అస్సలు బతుకను.అదే సమయంలో వ్యవస్థలను నేనుండే చిత్ర పరిశ్రమను గౌరవించకుండా విలువల్లేని బతుకు కూడా బతకడం లేదు.ప్రతి ఒక్క దానికి కాలమే సమాధానం చెబుతుంది. నాగబాబు గారు ఏమన్నారో చూడలేదు. అందరికీ నచ్చే విధంగా ఎవరూ మాట్లాడలేరు.ఈ భూమ్మీద ఎవరినీ ఎవరూ సంతృప్తి పరచలేరు. యథార్ధ వాది లోక విరోధి అని శివాజీ అన్నారు.

# సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో ఛార్జిషీట్ దాఖలు

**ఛార్జిషీట్‌లో 23 మంది నిందితులు**

**ఎ-1గా థియేటర్ యాజమాన్యం, ఎ-11గా అల్లు అర్జున్**

**హైదరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి పోలీసులు నాంపల్లి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఇందులో ఎ1గా సంధ్య థియేటర్ యాజమాన్యం, ఎ 11గా అల్లు అర్జున్ పేరును పొందుపరిచారు. మొత్తం 23 మంది పేర్లను పోలీసులు ఛార్జిషీట్‌లో నమోదు చేయగా ఇందులో ఎనిమిది మంది అల్లు అర్జున్ భద్రతను పర్యవేక్షించే బౌన్సర్లున్నారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై ఏడాది తరువాత పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేశారు. గత ఏడాది డిసెంబరు ఐదవ తేదీన అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 విడుదల కాగా అంతకు ఒకరోజు ముందు నాలుగవ తేదీన పలుచోట్ల ప్రీమియర్ షోలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా జ ంట నగరాలలో వున్న పురాతన థియేటర్ సంధ్యలో రాత్రి 9.30 గంటల సమయంలో పుష్ప 2 బెనిఫిట్ షో వేశారు. అభిమానులతో కలిసి సిని మా చూసేందుకు అల్లు అర్జున్ థియేటర్‌కు వచ్చాడు. ఈ సమయంలో అల్లు అర్జున్ అభిమానులు భారీగా తరలిరావడంతో ఒక్కసారిగా తొక్కిసలా ట జరిగింది. బెనిఫిట్ షోకు అల్లు అర్జున్‌ను రావద్దని పోలీసులు కోరగా ఆయన రావడం వివాదానికి దారితీసింది. అల్లు అర్జున్ థియేటర్‌కు వచ్చిన సమయంలో థియేటర్ వద్ద తోపులాట జరిగి, తొక్కిసలాటకు దారితీయడంతో కొందరు కిందపడి గాయపడ్డారు. వీరిలో రేవతి (36) అనే మహిళ మరణించగా ఆమె కుమారుడు ఏడేళ్ల శ్రీతేజ్ తీవ్రంగా గాయపడి ఇప్పటికీ చికిత్స పొందుతన్నాడు. దీనిపై చిక్కడపల్లి పోలీసులు సంధ్య థియేటర్ యాజమాన్యంతో పాటు అందులో పనిచేసే అధికారులు, అల్లు అర్జున్, ఆయన వ్యక్తిగత భద్రతా సిబ్బందిపై కేసు నమోదు చేశారు. థియేటర్ యా జమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన జరిగిందని, పోలీసుల సూచనలను బేఖాతరు చేయడం వల్ల ఒక మహిళ చనిపోయిందని పోలీసులు న మోదు చేసిన కేసులో వెల్లడించారు. ఈ కేసులో అల్లు అర్జున్ సహా అందరిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. సంధ్య థియేటర్ యాజమాన్యం స హా అందరిని అరెస్టు చేయడం ఎలా వున్నా అల్లు అర్జున్‌ను అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించడం అప్పట్లో సంచలనం రేపింది. ఒకరోజు జైల్లో వున్న అల్లు అర్జున్ మరుసటి రోజున బెయిలుపై విడుదలయ్యారు. దీని తరువాత తొక్కిసలాటలో తన తప్పేమిలేదని అల్లు అర్జున్ మీడియా తో మాట్లాడుతూ చెప్పగా పోలీసులు మొత్తం ఘటనపై వీడియోలు చూపుతూ, అల్లు అర్జున్ తప్పిదం వుందని వెల్లడించారు. దీని తరువాత రెండు నెలల అనంతరం సినీ పెద్దలు ఈ కేసుకు సంబంధించి దిగివచ్చి తొక్కిసలాట ఘటనలో మరణించిన మహిళ కుటుంబానికి నష్ట పరిహారం ఇవ్వడం తో పాటు ఆమె కుమారుడికి వైద్యం చేయించేందుకు ముందుకు రావడంతో వివాదం కొంత సద్దుమణిగింది. ఈ కేసులో పదుల సంఖ్యలో సాక్షుల ను విచారించిన పోలీసులు ఏడాది తరువాత శనివారం నాడు నాంపల్లి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. మొత్తం 23 మందిపై ఛార్జిషీట్ దాఖలు చేయగా ఇందులో ఎనిమిది మంది అల్లు అర్జున్ బౌన్సర్లు వున్నారు. కాగా ఈ కేసుకు సంబంధించి త్వరలో సాక్షుల విచారణ మొదలుకానుంది.


### సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై విచారణ పూర్తయ్యింది: సజ్జనార్


**హైదరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన ఏడాది క్రితం నాటి సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై చిక్కడపల్లి పోలీసులు కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసిన వెంటనే దీనిపై సిటీ కొత్వాల్ సజ్జన్నార్ ఎక్స్ వేదికగా కీలక పోస్ట్ చేశారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై విచారణ పూర్తయిందని ఆయన ఈ పోస్టులో తెలిపారు.

# అంతరిక్షంలోకి చైనా ఎలుకలు!

**వెళ్లొచ్చాక తొమ్మిది పిల్లలను ప్రసవించిన ఎలుక**

**బీజింగ్, డిసెంబరు 27:** చైనా అంతరిక్ష పరిశోధనలో ఒక ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. చైనా స్పేస్ స్టేషన్‌కు వెళ్లివచ్చిన నాలుగు ఎలుకల్లో ఒకటి, భూమి మీదకు తిరిగొచ్చాక ఆరోగ్యవంతమైన పిల్లలకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (సిఎఎస్) శనివారం ప్రకటించింది. వివరాల్లోకి వెళితే రెండు మగ, రెండు ఆడ ఎలుకలను గత అక్టోబర్ 31న షెంజౌ21 వ్యోమనౌక ద్వారా చైనా స్పేస్ స్టేషన్‌కు పంపారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశంలో వాటిని ఉంచి, నవంబర్ 14న తిరిగి భూమికి తీసుకొచ్చారు. భూమికి చేరిన తర్వాత వాటిలో ఒక ఆడ ఎలుక గర్భం దాల్చి ఈ నెల 10న తొమ్మిది పిల్లలను ప్రసవించింది. వాటిలో ఆరు పిల్లలు ఆరోగ్యంగా జీవించి ఉన్నాయి. తల్లి ఎలుక పిల్లలకు పాలిస్తోందని, అవి చురుకుగా ఉన్నాయని పరిశోధకులు తెలిపారు. స్వల్పకాలిక అంతరిక్ష ప్రయాణం ఎలుకల పునరుత్పత్తి సామర్థంపై ఎలాంటి ప్రభావం చూపలేదని ఈ ప్రయోగం రుజువు చేసింది. అంతరిక్ష వాతావరణం క్షీరదాల ప్రారంభ అభివృద్ధి దశలను ఎలా ప్రభావితం చేస్తుందో తెలుసుకోవడానికి ఈ ప్రయోగం ద్వారా అమూల్యమైన నమూనాలు లభించా యని సీ ఏ ఎ స్ పరిశోధకురాలు వాంగ్ హాంగ్‌మీ తెలిపారు. క్షీరదాలపై చైనా అంతరిక్షంలో శాస్త్రీయ ప్రయోగాలు చేయడం ఇదే మొదటి సారి. మనుషులతో జన్యు పరమైన పోలి కలు, చిన్న పరిమాణం, వేగవం తమైన పునరుత్పత్తి చక్రం వంటి కారణాల వల్ల ఈ ప్రయోగానికి ఎలుకలను ఎంచు కున్నారు. స్పేస్ స్టేషన్‌లో ఎలుకల కోసం భూమిపై ఉన్నట్లే పగలు, రాత్రి సమయాలను అనుసరించి లైటింగ్ వ్యవస్థ, ప్రత్యేకమైన ఆహారం, వ్యర్థాలను తొలగించేందుకు ఏర్పాట్లు చేశారు. గురుత్వాకర్షణ లేని వాతావరణం జీవుల ప్రవర్తనపై ఎలాంటి ప్రభావం చూపుతుందో తెలుసుకోవడం ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశం. గతంలో చైనా జీబ్రా ఫిష్, ఫ్రూట్ ఫ్లైస్ వంటి జీవులపై అంతరిక్షంలో ప్రయోగాలు నిర్వహించింది.





తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతోపాటు, దేశ వ్యాప్తంగా రబీ సీజను ముమ్మరంగా సాగుతోంది. ప్రస్తుత యాసంగి సీజనులో తెలంగాణ వ్యాప్తంగా 68.67 లక్షలఎకరాల్లో వివిధ పంటలను సాగు చేయనున్నారు. ఈ సీజనులో వరి 51.48 లక్షల ఎకరాల్లో వేస్తారని అంచనా. ఇందుకుగాను కేంద్రం 20.10 లక్షల టన్నుల ఎరువులు రాష్ట్రానికి కేటాయించింది. ఇందులో 10.25లక్షల టన్నుల యూరియా, 1.45 లక్షల టన్నుల డిఎపి, 7 లక్షల టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 65 వేల టన్నుల ఎమ్ఒపి, 60వేల టన్నుల ఎస్ఎస్పి ఎరువులు ఉన్నాయి. ఇక సకాలంలో పంటలకు సరిపడ ఎరువులను సరఫరా చేయడం కేంద్రానికి భారంగా మారింది. పంటఅధికంగా దిగుబడి రావాలని ఎకరానికి రెండు బస్తాలు వినియోగించాల్సి ఉంటే నాలుగు బస్తాలు చల్లుతున్నారు. దీంతో వ్యవసాయ శాఖ భావించి నేరుగా బస్తాలు పంపిణీ చేయకుండా యాప్ ద్వారా బస్తాలు బుకింగ్ చేసుకుంటే ఇస్తామనే విధానం తీసుకొచ్చింది. అదే విధంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ ఒప్పందాల్లో భాగంగా దేశవ్యాప్తంగా రానున్న నాలుగైదు ఏళ్లలో యూరియా వాడకం తగ్గిస్తామని ఒప్పందం చేసుకుంది. దీంతో ఆయా రాష్ట్రాలు దశలవారీగా యూరియా వినియోగం తగ్గేలా ప్రయత్నాలు మొదలు పెట్టాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణలోని ఆదిలాబాద్, జనగామ, మహబూబ్‌నగర్, నల్లగొండ, పెద్దపల్లి జిల్లాల్లో ప్రయోగాత్మకంగా వ్యవసాయ శాఖ యాప్ విధానాన్ని అమలు చేస్తోంది. అయితే నిరక్షరాస్యులు, స్మార్ట్ ఫోన్ లేనివారు, అవగాహన లేని పలువురు రైతులు యూరియా యాప్ తెలియక తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారు. యూరియా కోసం కొందరు స్మార్ట్ ఫోన్ కొంటున్నా, దాన్ని వినియోగించే సాంకేతిక పరిజ్ఞానం రెతులకు ఉండటం లేదు. ఒటిపి విధానంతో ఎక్కడ అక్రమాలు జరుగుతాయనేది సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు.

# రబీలోనూ యూరియా కష్టాలు!

**సిహెచ్ వి వి రఘుబాబు**

ప్రస్తుత రబీ (యాసంగి) పంటలు సాగు చేస్తున్న రైతులకు మళ్లీ యూరియా కష్టాలు మొదలయ్యాయి. కేంద్రం సకాలంలో, సరిపడా సరఫరా చేయకపోవడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికా లోపం, డిమాండ్ ఉన్న జిల్లాలకు కాకుండా, అవసరం లేని జిల్లాలకు సరఫరా చేయడం, అవసరం లేని రాష్ట్రాలకు కేటాయించిన యూరియా తదితర ఎరువుల విషయంలో కేంద్రంపై వత్తిడి తెచ్చి తెలంగాణకు తెప్పించుకోవడంలో కార్యాచరణ లేకపోవడం వంటి కారణాలతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. దీనికి తోడు రాష్ట్రానికి వచ్చిన తర్వాత జిల్లాల అవసరాలను బట్టి పంపించే బాధ్యత వ్యవసాయ శాఖపైఉంది. అలా కాకుండా మంత్రులు, ఎమ్మెల్యేలు బలాన్ని బట్టి తరలిస్తున్నారు. ఖరీఫ్ (వానాకాలం) పంటలు సాగు చేసిన రైతులకు యూరియా దొరకక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు యాసంగిలోనూ అవే పరిస్థితులు పునరావృతం అవుతున్నాయి. ఈ రబీ సీజన్‌లో 10.25 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా కేటాయింపులు చేయాలని కేంద్రాన్ని ఇండెంట్ ఇచ్చింది. ఇప్పటివరకు 5 లక్షల మెట్రిక్ టన్నులు కూడా సరఫరా కాలేదు. రాష్ట్రానికి కేటాయించిన 10.40 లక్షల టన్నుల యూరియాలో 6 లక్షల టన్నులను అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌లో నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున సరఫరా చేయాల్సిందిగా కేంద్రాన్ని రాష్ట్ర సర్కార్ కోరింది. కాని కేంద్రం మాత్రం కేటాయింపులకు అనుగుణంగా సరఫరా చేయడం లేదు. ఇటీవల వరకూ1.88 లక్షల టన్నుల యూరియా సరఫరా అయింది. అయితే యూరియా విషయంలో కేంద్రంపై వత్తిడి తేవడంలో రాష్ట్ర ప్రభుత్వం తగినంత శ్రద్ధ చూపడం లేదనే అభిప్రాయం రైతుల్లో ఉంది. ఇదే సమయంలో యూరియా వినియోగం రాష్ట్రంలో వ్యవసాయేతర వాటికి కూడా మళ్లిస్తున్నారు. ప్రధానంగా పారిశ్రామిక అవసరాలు డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్ (డిఇఎఫ్)ప్లాయ్‌వుడ్, పార్టికల్ బోర్డ్ వంటి వాటి తయారీలో యూరియా ముడి పదార్థంగా వాడడంతో దీనికి డిమాండ్ పెరుగుతోంది. అలాగే నల్లబజారు, అధిక ధరలు కూడా ఒక కారణం. సబ్సిడీ ధరల కంటే ఎక్కువకు అమ్మడానికి కొందరు డీలర్లు, సిండికేట్లు యూరియాను అక్రమంగా నిల్వ చేసి, పక్క రాష్ట్రాలకు లేదా పరిశ్రమలకు మళ్లిస్తున్నారు. దీనివల్ల రాష్ట్రంలో పంటలు పండిస్తున్న రైతులకు కొరత ఏర్పడుతుంది. దేశంలోని మిగిలిన రాష్ట్రాల్లో యూరియా వినియోగం అంతంత మాత్రంగానే ఉంటుంది. దక్షిణాది రాష్ట్రాలను పరిగణనలోకి తీసుకుంటే యూరియా వినియోగంలో తెలంగాణ రెండో స్థానంలో ఉంది. ఖరీఫ్‌లో యూరియా, డిఎపి,



ఎంఒపి, కాంప్లెక్స్, ఎస్ఎస్‌పిని అత్యధికంగా కర్ణాటక 26.75 లక్షల టన్నులు వినియోగిస్తుండగా, అందులో ఒక్కయూరియా 11.17 లక్షల టన్నులు ఉంది. కర్ణాటక తర్వాత రెండో స్థానంలో ఉన్న తెలంగాణలో ఒక సీజన్‌లో మొత్తం 23.75 లక్షల టన్నుల ఎరువులు వినియోగిస్తుండగా, అందులో 9.80లక్షల టన్నులు యూరియా ఉంది. అదే కేరళలో వినియోగించే యూరియా కేవలం 52 వేల టన్నులు మాత్రమే. ఇక ఆంధ్రప్రదేశ్‌లో 6.22 లక్షల టన్నులు, తమిళనాడులో 4.37లక్షల టన్నులు, పాండిచ్చేరిలో 6 వేల టన్నుల యూరియా వినియోగిస్తున్నారు. ఇలా దేశంలో సౌత్ జోన్‌లో 32.15 లక్షల టన్నులు, వెస్ట్‌లో 61.71 లక్షల టన్నులు, నార్త్‌లో 67.13 లక్షల టన్నులు, ఈస్ట్‌లో 22.42 లక్షల టన్నులు, నార్త్‌ఈస్ట్ జోన్‌లో 1.98 లక్షల టన్నుల యూరియా వినియోగం జరుగుతోంది. ఎరువుల పరంగా ఎంత కావాలనే దానిపై రాష్ట్రాల నుంచి ఇండెంట్ కేంద్రానికి వెళ్తుంది. దాని ప్రకారం కేంద్రం ప్రణాళిక రూపొందించి రాష్ట్రాలకు ఎరువులు సరఫరా చేస్తుంది. కొన్నిరాష్ట్రాల్లో యూరియా వినియోగం అంతంత మాత్రంగా ఉన్నా, వాటికి కేటాయింపులు జరపడం సర్వసాధారణం. కేంద్రం యూరియా కేటాయించిన సమయంలో తెలంగాణలో కొరత ఏర్పడినప్పుడు మిగులు రాష్ట్రాల నుండి మళ్లించేలా రాష్ట్ర సర్కార్ ప్రయత్నించాల్సి ఉంది. ఇందుకు వ్యవసాయ మంత్రితో సహా, ఆశాఖ అధికారులు కేంద్రంపై వత్తిడితేవాల్సి ఉండగా, ఆ దిశగా ప్రయత్నాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కేంద్రానికి యూరియా కోసం లేఖలు రాయడం తప్ప వత్తిడి తేవడంలో తగినంత శ్రద్ధ చూపడం లేదు. గత రాష్ట్రప్రభుత్వ హయంలో మిగులు రాష్ట్రాల్లోని యూరియా తెలంగాణకు సరఫరా అయ్యేలా కేంద్రంపై పెద్ద ఎత్తున ఒత్తిడి తెచ్చిన సంఘటనలు ఉన్నాయి. అప్పటి వ్యవసాయ మంత్రి సైతం ఢిల్లీ మకాం వేసి యూరియా రాష్ట్రానికి సరఫరా చేసేలా ప్రయత్నాలు చేసి సఫలీకృతులయ్యారు. కాని ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. కాగా యాసంగి రైతులకు యూరియా ఇబ్బందులు ఉండవని రాష్ట్ర వ్యవసాయ శాఖ చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందు కు భిన్నంగా ఉన్నాయి. యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవాలని ప్రభుత్వం ప్రచారం చేసినా అది అందుబాటు లోకి రాకపోవడంతో చాలా చోట్ల మళ్లీ పాత పద్ధతి ద్వారానే సొసైటీల ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్నారు. దీంతో యాసంగి సాగు చేసిన రైతులు సొసైటీల వద్దకు వెళ్లినా నిల్వలు లేకపో వడంతో పొరుగునే ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి బ్లాక్ మార్కెట్ లో కొనుగోలు చేయాల్సి న దుస్థితి ఏర్పడింది. అయితే ఇక్కడి రైతుల అవసరాన్ని గమనించిన అక్కడి వ్యాపారులు ధర పెంచి మరీ విక్రయిస్తున్నారు. అదనంగా రూ.500 వెచ్చించి కొనుగోలు చేస్తుండడంతో రైతులపై ఆర్థిక పడుతోంది. మరోపక్క రాష్ట్రంలో యూరియా కోసం రైతులు ఆందోళన బాట పడుతున్నారు. రైతు దినోత్సవం రోజున కూడా రైతులు యూరియా కోసం రోడ్డెక్కాల్సి న పరిస్థితి నెలకొన్నది. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలోని రైతు వేదిక వద్ద రైతులు యూరియా కోసం అధికారులతో గొడవకు దిగారు. వరంగల్ జిల్లా నెక్కొండలోని సొసైటీ వద్ద రైతులు బారులు తీరారు. క్యూలో తోపులాట జరిగింది. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో సొసైటీ వద్ద యాప్ నమోదు ఇబ్బందిగా మారడంతోఆధార్‌పై పంపిణీ చేశారు. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరులోని సగం మందికే పంపిణీ చేశారు. వరంగల్ జిల్లా సంగెం మండలం మొండ్రాయి రైతులువేదిక వద్ద రైతులు కూపన్ల కోసంఎదురుచూశారు. నిర్మల్ జిల్లా కడెం మండల కేంద్రంలోని గ్రోమోర్ కేంద్రం ఎదుట ప్రధాన రహదారిపై రైతులు ధర్నా చేపట్టారు. సిరిసిల్ల జిల్లా వీర్నపల్లిలోని పీఏసీఎస్ వద్ద రైతులు బారులు తీరారు. యూరియా లోడ్ వచ్చిందన్న విషయం తెలియడంతో చుట్టు పక్కల గ్రామాలకు చెందిన రైతులు వందలాదిగా ఉదయమే తరలివచ్చారు. 900బస్తాలు రాగా 350మందికి రెండు నుంచి ఐదు బస్తాల వరకు అందజేశారు. చాలామందికి అందకపోవడంతో అసహనం వ్యక్తంచేశారు. ఈ నెల 25న యూరియా పంపిణీలో జాప్యంపై రైతులు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆందోళన చేపట్టడంతో ఉద్రిక్తత నెలకొంది. మహబూబాబాద్–తొర్రూర్ ప్రధాన రహదారిని దిగ్బంధించి ట్రాఫిక్ పూర్తిగా స్థంభించింది. రాత్రి నుండి సహకార సంఘం వద్ద గుమిగూడి, యూరియా కోసం ఎదురు చూస్తున్నారు. పంపిణీపై స్పష్టత లేకపోవడంతో, వారు కార్యాలయం వెలుపల చలితో గడిపారు. తమవంతు గుర్తుగా తమ పాదరక్షలను క్యూలో ఉంచి, రాత్రంతా మంటలు వేసుకుని చలి తీవ్రతనుండి కాపాడుకునే ప్రయత్నం చేశారు. కామారెడ్డి జిల్లా కాచాపూర్‌లో యూరియా కొరత ఏర్పడింది. సొసైటీ గోదాంకు 444బస్తాల యూరియా వచ్చిందన్న సమాచారంతో రైతులు వేకువజాము నుంచే చెప్పులను క్యూలో పెట్టి నిల్చున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర వ్యవసాయ శాఖ యూరియా తదితర ఎరువులను కేటాయింపులకు మించి సాధించడంలో కేంద్రంపై పెద్ద ఎత్తున వత్తిడి తేవాల్సి ఉంది. ●

---

దృశ్యం
మహారాష్ట్ర

ఎన్నికలు వచ్చినపుడే పార్టీల అసలు స్వరూపాలు బయట పడతాయి. పార్టీల అసలు రంగు లేమిటో కూడా అప్పుడే తెలుస్తాయి. మహారాష్ట్రలో ఇప్పుడు కనిపిస్తున్న దృశ్యం అటువంటిదే. తాజాగా జరిగిన మునిసిపల్ కౌన్సిల్, నగర పంచాయతీ ఎన్నికల్లో అధికార మహాయుతి కూటమి విజయ కేతనం ఎగుర వేసింది. అదే సమయంలో విపక్ష మహావికాస్ అఘాడి ( ఎమ్వీఎ)కి చావు తప్పి కన్ను లొట్ట పోయినట్లయింది. మహాయుతి కూటమిలో బిజెపి ఎక్కువ ఆనందోత్సాహాల్లో తేలియాడుతోంది. ఇక తమను ఎదిరించే వారే లేరనీ, మిత్ర పక్షాలను ఓ పట్టు పట్టాలనీ భావించింది. మహాయుతిలో మరో రెండు ప్రధాన పక్షాలున్నాయి. మాజీ ముఖ్యమంత్రి షిండే నాయకత్వం లోని శివసేన, డిప్యూటీ సీఎం అజిత్ పవార్ నాయకత్వం లోని ఎన్సీపి. 2024లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి ఘన విజయం సాధించడంతో ఆ కూటమికి పట్ట పగ్గాలు లేకపోయాయి. అంతకు ముందు సిఎంగా ఉన్న షిండే డి.సిఎంగా ఉన్న ఫడ్నవిస్ స్థానాలు తారుమారై ఎన్నికల అనంతరం ఫడ్నవీస్ సిఎం అయ్యారు. వ్యూహచతురుడైన ఫడ్నవీస్ సారథ్యంలో ఇప్పుడు స్థానిక ఎన్నికలు కూడా విజయ ఢంకా మోగించాయి. అయితే సమస్యలు అక్కడి నుంచే మొదలయ్యాయి. అంతకు ముందు సిఎంగా అధికారం చెలాయించిన షిండే అసెంబ్లీ ఎన్నికల తర్వాత కలుగులో ఎలుకలా ఉండిపోవలసి వచ్చింది. తనకు మళ్లీ సిఎం సీటే కావాలని పట్టుపట్టినా నెరవేరకపోవడంతో మళ్లీ అవకాశం కోసం ఆయన ఎదురు చూస్తున్నారు. కూటమిలోని మరో మిత్రపక్షమైన అజిత్ ఎన్సీపి కూడా పెద్ద డిమాండ్లే చేసినా వాటికి భారీగానే కోతలు పడ్డాయి. తన కుమారునిపై గల అవినీతి ఆరోపణల కారణంగా అజిత్ బిజెపి చెప్పినట్లు వినవలసి వచ్చింది. కానీ షిండేతో పాటు అజిత్ లో కూడా ఇటీవల అసంతృప్తి సెగలు రగులుతున్నాయి. తాజాగా జరిగిన ఎన్నికల్లో మొత్తం 288 సీట్లలో బిజెపికి అత్యధికంగా 132, షిండే శివసేనకు 57, అజిత్ ఎన్సీపీకి 41 లభించాయి. అంటే మహాయుతికి మొత్తం అత్యధికంగా 235 సీట్లు

## 'బాహుబలి' ఎవరో!

**ఎ.వి.వి ప్రసాద్**

దక్కాయి. అదే ఎన్నికల్లో ఎమ్వీఎలోని ఉద్ధవ్ శివసేనకు 20 సీట్లు మాత్రమే రాగా, కాంగ్రెస్ కు 16, పవార్ ఎన్సీపీకి 10 సీట్లు మాత్రం లభించాయి. అంటే మహారాష్ట్రలో కూడా ప్రతి పక్షమన్నది సోదిలోకి లేకుండా పోయింది. తాజాగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మహాయుతి కూటమి మూడింట రెండు వంతుల మెజారిటీని కైవసం చేసుకుంది. బిజెపి సొంతంగా 207 సీట్లలో నెగ్గిందని సిఎం ఫడ్నవీస్ ప్రకటించారు. అధికార కూటమిలోషిండే శివసేన 53, అజిత్ ఎన్సీపి 37 చోట్ల గెలిచా యి. విపక్ష ఎమ్వీఎ 44 స్థానాలకు మాత్రమే పరిమితమైంది. అటు అసెంబ్లీ, ఇటు స్థానిక ఎన్నికల్లో అడకత్తెరలో పోక చెక్కలా నలిగింది కాంగ్రెస్ ఒక్కటే.



ఫడ్నవీస్

ఒకప్పుడు రాష్ట్రంలో చక్రం తిప్పిన కాంగ్రెస్ కు ఇప్పుడు వేళ్లమీద లెక్కించే స్థానాలు మాత్రమే రావడం 'ఇండియా' కూటమి లో ఆ పార్టీ స్థానమేమిటో తెలియజేస్తోంది. 2017లో జరిగిన స్థానిక ఎన్నికల కంటే బిజెపి పరిస్థితి రాష్ట్రంలో అనేక రెట్లు మెరుగుపడినట్లు అర్థమవుతుంది. అయితే జనవరి 15న జరగనున్న మునిసిపల్ కార్పొరేషన్ల ఎన్నికలే ఇప్పుడు మహాయుతికి కూడా సవాల్‌గా మారాయి. స్థానిక ఎన్నికల్లో తమ పరిస్థితి మెరుగుపడడంతో బృహన్ముంబయి కార్పొరేషన్ లోని 227 సీట్లలో బిజెపి స్వయంగా పోటీ చేయాలని నిర్ణయించడం కూటమిలోని మిత్ర పక్షాలలో కుంపట్లు రగిల్చింది. ముంబయి కార్పొరేషన్‌లో 50 సీట్లు మాత్రమే షిండే శివసేనకు ఇవ్వాలని బిజెపి నిర్ణయించడంతో షిండే సీట్ల పోరుబాటపట్టారు. ఒకదశలో తాము విడిగా అన్ని సీట్లకు పోటీ చేస్తామనే దశకు వచ్చారు. వివాదం ఊసర వెల్లి కాకముందే బిజెపి అధిష్ఠానం కలుగజేసు కొని షిండేకు ఇవ్వదలచిన సీట్లను 50 నుంచి 78కి పెంచింది. మరో శివసేన పక్షానికి నాయ కత్వం వహిస్తున్న ఉద్ధవ్ థాకరే సోదరుడైన రాజ్ థాకరేతో చేతులు కలపడంతో మహాయుతిలో కూడా అది 'కదలిక' తెచ్చింది. షిండే వెళ్లి ఉద్ధవ్‌తో చేతులు కలిపితే పరిస్థితి మళ్లీ తారు మారవుతుంది. రాష్ట్రప్రభుత్వంలో మార్పు లేకపోయి నా ముంబయి, పుణే వంటి పెద్ద కార్పొరేషన్‌లలో మహాయుతి జాతకం మారి పోతుంది. అలా జరగకూడదని భావించారేమో! చివరికి 78 సీట్లు షిండే శివసేనకు ఇవ్వడానికి బిజెపి అంగీకరించింది. ఒప్పందంలో భాగంగా మైనారిటీలు ఎక్కువగా ఉన్న సీట్లలో పోటీ చేయడానికి అజిత్ ఎన్సీపి అంగీకరించడంతో ఫడ్నవీస్ ప్రస్తుతానికి గట్టెక్కనట్లే కనిపిస్తున్నారు. అయితే షిండే, అజిత్ నుంచి మహాయుతికి ముందు ముందు ముప్పు తప్పకపోవచ్చు. ముంబయి సహా రాష్ట్రంలోని 29 కార్పొరేషన్లకు జనవరి 15న జరిగే ఎన్నికలు అన్ని పార్టీలకు కూడా చాలా కీలకం. తన నాయకత్వంలోని శివసేన కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం సాధించే లక్ష్యంతో ఉద్ధవ్ థాకరే కూడా ముందుకు కదులుతున్నారు. గతవారం రాజ్ థాకరేతో చేతులు కలపడం దానిలో భాగమే. దాదాపు 20 సంవత్సరాల తరువాత ఈ 'అపూర్వ సహోదరులు' ఇద్దరూ చేతులు కలపడంతో మహాయుతిలో కూడా వ్యూహాలు పదునెక్కాయి. స్థానిక ఎన్నికలను కూడా అసెంబ్లీ స్థాయిలో పార్టీలు ప్రతిష్టాత్మకంగా భావించడంతో ఊహించలేనంత ప్రాధాన్యం ఏర్పడుతోంది. ప్రచారం కూడా అసెంబ్లీ ఎన్నికలను మించి జరుగుతోంది. కొన్ని పార్టీలు ఓటర్లకు విదేశీయానం హామీని కూడా ఇస్తున్నాయి. అయితే చివరికి ఏం జరుగుతుందన్నది చూడాలి. తీవ్రమైన పోటీ ఉన్న ముంబయిలో అసలు 'బాహుబలి ' ఎవరో సంక్రాంతి తర్వాత తేలుతుంది. ●

---

దృశ్యం
బంగ్లాదేశ్

హింసతో అట్టుడుకుతున్న బంగ్లాదేశ్‌లో కేర్‌టేకర్ ప్రభుత్వం ఎట్టకేలకు ఎన్నికలను ప్రకటించడంతో ఇప్పుడు ఎన్నికలు స్వేచ్ఛగా జరుగుతాయా అన్న ప్రశ్న పక్కనపెడితే బంగ్లాదేశ్ ప్రజలకు ఆశాకిరణంగా ఒకే ఒక్క నాయకుడు కనిపిస్తున్నాడు. అదే మాజీ ప్రధాని బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ అధినేత్రి మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడు తారిఖ్ రహమాన్. 17 ఏళ్లపాటు లండన్‌లోనే ఆశ్రయం పొందిన రెహమాన్ ఎట్టకేలకు స్వదేశానికి తిరిగి వచ్చాడు. అందరూ ఊహించినట్లుగానే అపూర్వస్వాగతం లభించింది. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటుకు తన వద్దప్రణాళికలున్నాయని, బంగ్లాదేశ్ ఎవరికీ మోకరిల్లదని, బంగ్లా బంగ్లాదేశ్‌గానే వర్ధిల్లుతుందని చెపుతున్నారు. బంగ్లాదేశ్ ప్రజలకు క్రౌన్ ప్రిన్స్‌గా పిలువబడే తారిక్ రహమాన్ మాజీ అధ్యక్షుడు జియావుర్ రెహమాన్ పెద్దకుమారుడు. బిఎన్పీలో సీనియర్ వైస్‌చైర్మన్ సీనియర్ జాయింట్ సెక్రటరీ వంటి పదవులు నిర్వహించిన తారిఖ్ ఇప్పుడు తల్లి ఖలీదా తీవ్ర అనారోగ్యంతో సతమతం అవుతుండటంతో పార్టీ బాధ్యతలు అన్నీ ఆయనే చూసుకుంటున్నారు. బంగ్లా విముక్తి యుద్ధంలో తారిక్‌ను ఆయన తల్లి ఖలీదా, ఇతర మొత్తం కుటుంబ సభ్యులందరితోను అరెస్టుచేసారు. యుద్ధఖైదీల్లో అతిపిన్న వయస్కుడిగా ఆనాడు తారిక్ పేరు పొందారు. బిఎన్‌పి జనరల్ సభ్యుడుగా కింది స్థాయిక కార్మి కులు, మద్దతుదారులను సమీకరించి హెచ్ఎం ఎర్షాద్ ప్రభుత్వాన్ని కూల్చడంలో కీలకంగా కొన సాగారు. 1991లో ఖలీదా బంగ్లాదేశ్‌కు మొదటి మహిళా ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు తారిక్ దేశవ్యాప్త ప్రచారం నిర్వహించి పార్టీని మరింత చైతన్యపరిచాడు. అవామీలీగ్ ర్యాలీలో గ్రనేడ్ దాడి జరిగిన సంఘటనలో తారిఖ్ పేరు తెరపైకి వచ్చింది. తదనంతర పరిణామాల్లో సైనిక మద్దతుతో ఏర్పడిన ప్రభుత్వంలో అవినీతి వ్యతిరేక చర్యల్లో భాగంగా తారిఖ్ రెహమాన్ అరెస్టు అయి హింసకు కూడా గురయ్యారు. గ్రనేడ్ దాడి సంఘటనలో తారిక్‌తోపాటు 18 మందికి జీవిత ఖైదు పడింది. రెహమాన్ భారీ అవినీతిలో వందల మిలియన్ల డాలర్లు సంపాదించడాన్ని

## బంగ్లాదేశ్ భవిష్యత్తు 'ఆశాకిరణం'

**గన్ని మోహాన్**

అమెరికా రాయబార కార్యాలయ కేబుల్స్ ప్రస్తావిస్తూ ఆరోపించింది. అక్రమ సంపద కూడబెట్టాడని 2023లో రెహమాన్‌కు తొమ్మిదేళ్ల జైలుశిక్ష పడింది. ఇక గత ఏడాది విద్యార్థి ఉద్యమంతో హసీనా ప్రభుత్వం పదవీచ్యుతి పొందడం తారిక్ రహమాన్ అదృష్టం మారిపోయింది. మొత్తం 84 కేసుల నుంచి ఆయన నిర్దోషిగా విడుదలయ్యారు. వీటిలో రాజద్రోహానికి సంబంధించిన కేసులు కూడా ఉన్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న జాతీయ ఎన్నికలు జరగనున్నాయి. దేశంలో కోల్పోయిన ప్రాభవాన్ని తిరిగి సాధించేందుకు ఆయన అహరహం శ్రమిస్తున్నారు. బిఎన్‌పి వద్ద స్పష్టమైన ప్రణాళికలున్నాయని, దేశం మళ్లీ అభివృద్ధి పథంలో ముందుకు సాగడమే తన లక్ష్యమని తారిక్ తన తొలిప్రసంగంలో చెప్పుకొచ్చారు.




తారిక్‌రహమాన్

అయితే పొరుగుననే ఉన్న భారత్‌తో ఉన్న సంబంధాలపై ఆయన ఎలాంటి విధాన ప్రకటన చేయలేదు. అయితే ప్రస్తుతం ఉన్న సమస్యలను చక్కదిద్దడం అంత సులువేమీ కాదు. రెండుదశాబ్దాలు పార్టీకి, దేశానికి దూరంగా ఉన్నా బిఎన్పీ మద్దతుదారులు ఆయనకు రెడ్‌కార్పెట్ స్వాగతం పలికారు. హసీనా హయాంలో బిఎన్పీ కేడర్ మొత్తం అణిచివేతకు గురవడంతో కేడర్‌లో నిరాశానిస్పృహలు ఎక్కువ అలుముకున్నాయి. బిఎన్‌పి మిత్రపక్షంగా కొనసాగిన ఇస్లామిస్ట్ పార్టీ జమాత్ ఎ ఇస్లామి ప్రభావం కూడా పెరిగింది. ఢాకా వర్సిటీ ఎన్నికల్లో ఆపార్టీ విజయం సాధించడంతో రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయి హసీనా ప్రభుత్వానికి గడ్డుసమస్యలు ఎదురయ్యాయి. అవామీలీగ్‌పై ప్రస్తుత యూనస్ ప్రభుత్వం నిషేధం ప్రకటించడం, ఇస్లామిస్టు పార్టీ ఒకటి రావడం వల్ల ముస్లిమేతరులు ఇప్పుడు బిఎన్‌పి వైపు మొగ్గు చూపుతారన్నవిశ్వాసం పెరుగుతోంది. అందువల్లనే పార్టీ ఓటు బ్యాంకుతోపాటు మైనార్టీ ఓటుబ్యాంకుతో బీఎన్పీ ఖచ్చితంగా ప్రభుత్వం ఏర్పాటు చేయగలుగుతుందన్న ధీమాతో ఉన్నారు. గడచిన రెండు దశాబ్దాలుగా లండన్ నుంచే ప్రకటనలు ఇవ్వడం, ప్రభుత్వ వ్యతిరేక విమర్శలు చేయడం వంటివి చేస్తూ వచ్చిన తారిక్ ఇప్పుడు ప్రజల మధ్యకు వచ్చారు. వీధుల్లో సాధారణ ప్రజలతో మాట్లాడటం, మసీదుల్లో ప్రార్థనలు చేయడం, హిందూ దేవాలయాలను సందర్శించడం బహిరంగసభల్లో ప్రసంగించడం ఇవన్నీ ఒకఎత్తు. అయితే ఇవన్నీ ప్రజల్లో ఆశలను మాత్రం రేకెత్తిస్తున్నాయి. భవిష్యత్తు ఎన్నికల్లో బిఎన్పీనే గెలిపించాలన్న ధృఢ సంకల్పం మెజార్టీ ప్రజల్లో వ్యక్తం అవుతోంది. ఎందుకంటే ప్రస్తుత యూనస్ కేర్‌టేకర్ ప్రభుత్వంపై సర్వత్రా అసంతృప్తి పేరుకునిపోయింది. ప్రజల్లో విశ్వాసం పొందలేకపోయిందనే చెప్పాలి. యూనస్ ప్రభుత్వంపై అలుముకుంటున్న నిరసనను ఇప్పుడు తారిక్ తనకు సానుకూలంగా మలుచుకోవడంతోనే అసలు విజయం ఉంది. పైగా ఇప్పుడున్న ప్రభుత్వానికి చైనా, పాకిస్థాన్‌లతోపాటు అమెరికా మద్దతు కూడా ఉన్నట్లు బలంగా ప్రచారం జరుగుతోంది. దీనికితోడు తరచూ పాకిస్థాన్‌తోనే సంప్రదింపులు జరుపుతున్నారని, ఒకరకంగా యూనస్ ప్రభుత్వాన్ని పాకిస్థాన్ తెరవెనుక నడుపుతోందన్న ప్రచారం కూడా ఉంది. వీటన్నింటికంటే భయాందోళనల్లో మగ్గుతున్న అవామిలీగ్ కేడర్ బిఎన్పీకి మద్దతిస్తుందా లేక స్వతంత్ర అభ్యర్థులుగా వస్తారా అన్నది తెలియాల్సి ఉంది. హింసతో ముస్లిమేతరులపై దాడులు పెచ్చుమీరిన బంగ్లాదేశ్‌లో ఇప్పుడు సజీవదహనాలే అస్త్రంగా మలుచుకుని ఆందోళనకారులు పేట్రేగిపోతున్నారు. ఈక్రమంలో ఇప్పుడు బంగ్లా ప్రజలకు ఏకైక ఆశాకిరణం తారిక్ రహమాన్ ఒక్కరే కనిస్తున్నారు. బంగ్లా భవిష్యత్తు కిరణం తారిక్ రహమానే అవుతారేమో చూడాలి. ●

---

# ధ్వన్యనుకరణ సమ్రాట్ పద్మశ్రీ డా.నేరెళ్ళ



డా.ఎ.రాజు

శ్రీవివేకానందుడు చికాగోలో ఇచ్చిన ఉపన్యాసంతో ప్రపంచం ఆశ్చర్యపోయి భారతదేశపు సంస్కృతిని మెచ్చుకుంది. శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రతిభను మెచ్చుకుని ప్రపంచంలోని గొప్ప బహుమతి నోబుల్ ప్రైజ్‌ని ఆ మహానుభావుడికిచ్చింది ప్రపంచం. అదే కోవలో ఐక్యరాజ్య సమితిలో భారత దేశం తరపున మిమిక్రీ ప్రోగ్రామ్ ఇచ్చిన ఏకైక ప్రతిభామూర్తి ధ్వన్యనుకరణ సామ్రాట్ కీ॥శే పద్మశ్రీ డా.నేరెళ్ళ వేణుమాధవ్‌గారు. పురాణకాలం నుంచి భారతదేశంలో మిమిక్రీ 'ధ్వన్యనుకరణ కళ ఉంది. సాక్ష్యం కావాలా? రామాయణం చదవండి. సీతమ్మ కోరిక తీర్చడం కోసం మాయలేడి వెంటబడి శ్రీరామచంద్రుడు తరుముతున్నప్పుడు మాయలేడి రూపంలో ఉన్న మారీచుడు బాణంతగిలి హా లక్ష్మణా! హా సీతా! అంటూ శ్రీరామచంద్రుడు ఆర్తనాదం చేసినట్లుగా రామాయణంలో వాల్మీకి మహర్షి వ్రాసారు. అంటే ఆ (త్రేతా యుగం) కాలంలో కూడా మిమిక్రీ ధ్వన్యనుకరణ కళ ఉంది. అంతటి ప్రాచీనమైన కళకు సొగసులందించి భారతీయ కళకు విశ్వవ్యాప్తమైన కీర్తిని కల్పించింది పద్మశ్రీ డా.నేరెళ్ళ వేణుమాధవ్. పాతాళభైరవి సినిమాలో మాంత్రికుడు ఎస్.వి.రంగా రావు చేతితో ఇలా అనగానే అలా అనేక వస్తువులు పుడతాయి మనం అందరం చూసాం. అది అబద్ధం, నిజంగా జరగదు. కానీ మనిషి గొంతులోంచి వచ్చే శబ్దంతో రకరకాల ధ్వనులు పలికించవచ్చు. కనిపించని శబ్దం నుంచి వినిపించే అద్భుత నాదాలు కోకిల రాగం, సింహగర్జన, కారు హారన్, రైలు కూత, గాలివాన, పిడుగు పడుట, గుఱ్ఱపు డెక్కల శబ్దాలు ఇంకా ఎన్నో ఎన్నెనో పుట్టించొచ్చు. పుట్టుకతోనే ప్రతి శిశువుకు మిమిక్రీ కళవచ్చు. ఆశ్చర్యపోకండి! తెలుగు రాష్ట్రాల్లో పుట్టిన పిల్లలు తెలుగు భాషని, తమిళనాడు పిల్లలు తమిళం, కర్ణాటక పిల్లలు కన్నడ, ఉత్తర భారతం పిల్లలు హిందీ ఎలా నేర్చుకుంటున్నారు? ఎందుకు నేర్చుకుంటున్నారు? తల్లిదండ్రులను అనుకరించడం వల్లనే. మళ్ళీ తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణ, రాయల సీమ, కోస్తాంధ్ర ప్రాంతాల యాసలు వేరు. అసలు భాష నేర్వక ముందు ఆదిమానవులు వేటకు వెళ్ళినప్పుడు జంతు వులను పట్టుకోవడం కోసం వాటి కూతలను, అరుపులను అనుకరించేవారని చరిత్ర పరిశోధకులు సిద్ధాంతీకరించారు. ఈ అనుకరణ మిమిక్రీ కళకు మూల సూత్రం. ఇతిహాసాలు అనుకరణ రామాయణ మహాభారతాల్లో అనుకరణకు సంబంధించిన ఘట్టలు ఉన్నాయి. ధ్వన్యనుకరణ కళను మిమిక్రీ అనే ప్రక్రియతో బహుళ ప్రాచుర్యం పొందింది. మిమిక్రీ అనే పదానికి ఆయా నిఘంటువుల ప్రకారం అనుకరించు, వెక్కిరించు, హాస్యము అని అర్థం. ఎగతాళి, పరి హాసము, గేలి, అపహాస్యము, ఒకటి చూచి ఆ ప్రకారం చేయు, పోలినట్లు చేయు, అనుకరించి నవ్వించు అనేవి పర్యాయ పదాలు. కాలానుగుణంగా ప్రజల అభిరుచులు మారుతుంటాయి. ఆ అభిరుచులకు అనుగుణంగా కళలో కొత్తకొత్త మార్పులు చోటుచేసుకుంటాయి. మిమిక్రీ కళ కూడా ఇందుకు భిన్నమయింది కాదు. ప్రతి కళ ముఖ్యోద్దేశం ఆనందం కలిగించడం. ధ్వన్యనుకరణ (మిమిక్రీ) కళలో అది మరింత అధికంగా కన్పిస్తుంది. ఈ కళను గ్రామస్థాయి వేదికల నుంచి అంతర్జాతీయ వేదికల స్థాయికి చేర్చింది మాత్రం ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మిమిక్రీ సామ్రాట్, ఆధునిక మిమిక్రీ కళ పితామహుడు పద్మశ్రీ డా.నేరెళ్ళ వేణుమాధవ్. ఈ కళను రంగస్థల కళగా తీర్చిదిద్ది గ్రామాల్లో పట్టణాల్లో విరివిగా ప్రదర్శన ఇవ్వడమేగాక ఈ కళకు గ్లామర్ కల్పించినది కూడా ఆయనే. డా॥ నేరెళ్ళ వేణుమాధవ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వరంగల్ జిల్లా, మట్టేవాడలో 28 డిసెంబరు 1932లో శ్రీ నేరెళ్ళ శ్రీహరి, శ్రీమతి నేరెళ్ళ శ్రీలక్ష్మీ దంపతులకు జన్మించారు. తండ్రి ప్రముఖ వ్యాపారవేత్త. వారి ఇంటికి ఈ రోజుల్లో ఎందరో ప్రముఖులు, సాహితీవేత్తలు వచ్చేవారు. వారి ప్రభావంనేరెళ్ళ వేణుమాధవ్‌పై పడింది. వేణుమాధవ్ ఎనిమిదవ యేట లక్ష్మయ్య పంతులు వద్ద అక్షరాభ్యాసం చేశారు. నాన్నగారి వద్ద ఇంగ్లీషు, ఉర్దూ నేర్చు కున్నారు. కొంతకాలం ప్రైవేటుగా చదివి గవర్నమెంటు స్కూల్లో చేరారు.



నేడు డా॥ నేరెళ్ళ వేణుమాధవ్ జయంతి

ఆ కాలంలో వచ్చిన చిత్తూరు నాగయ్యగారి గృహలక్ష్మి, వందేమాతరం, దేవత, స్వర్గసీమ, పోతన, వేమన సినిమాలు చూసి నాగయ్యగారి మీద అభిమానం పెంచుకున్నారు. ఇవేకాకుండా వేమూరి గగ్గయ్య, మాధవపెద్ది వెంక ట్రామయ్యగార్లు నటించిన సినిమాలు చూసి, ఇంటికిరాగానే ఆ సినిమాల్లోని పాటలను, పద్యాలను యథాతథంగా అనుకరించి చూపేవారు. ఏవీవీ (ఆంధ్ర విద్యాభివర్ధిని) హై స్కూల్లో చదువుతున్నప్పుడు హరి రాధాకృష్ణ మూర్తిగారి శిష్యరికంలో చిలకమర్తి లక్ష్మీనరసింహం ప్రహసనాల్లో నటించడం ద్వారా రంగస్థల జీవితానికి శ్రీకారం చుట్టారు. 1951లో మెట్రిక్యులేషన్ పూర్తిచేసి వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్సు కాలేజీలో చేరారు. నాటి ప్రిన్సిపాల్ బారు వెంకట రామనర్సు గారు వేణు మాధవ్‌కి ఆ రోజుల్లో అరవై రూపాయల స్కాలర్‌షిప్ (బర్సరీ) మంజూరు చేశారు. దానితో వీరు ముప్పయి ఇంగ్లీషు సినిమాల్ని తనవీరా చూసి వాటిల్లోని ఆర్టిస్టుల గొంతులు, ముఖ్యమైన సన్ని వేశాలు బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ నోట్స్‌తో సహావినిపిస్తే, రామనర్సు పరమానందభరితులై యూ విల్ బికం ఎ గ్రేట్ ఆర్టిస్ట్ ఇన్ ద వరల్డ్ అని మనసారా ఆశీర్వదించారు. ఆ దీవెనలే వీరిని విశ్వవిఖ్యాత ధ్వన్యనుకరణ సామ్రాట్‌గా ఎదిగేలా చేసాయి. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులుగా పనిచేస్తునే ప్రైవేట్‌గా బి.ఏ., బీ.కాం., బి.హెడ్. పాసయ్యారు. తర్వాత ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగరీత్యా ఎదిగినప్పటికీనీ మిమిక్రీ కళ పట్ల ఉన్న మక్కువతో ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తిగా కళాజీవితానికే అంకితమయ్యారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలో డా॥ నేరెళ్ళ వేణు మాధవ్ ఎం.ఎల్.సీ.గా 1972 నుంచి 1978 వరకు పదవీబాధ్యతలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల్లో అనేక పదవులను నిర్వహించారు. వీరికి ఆంధ్ర విశ్వవిద్యాలయం 1977లో కళాప్రపూర్ణ, జె.ఎన్.టి.విశ్వవిద్యాలయం 1987లో, కాకతీయ విశ్వవిద్యాలయం 1992లో గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేసాయి. దేశవ్యాప్తంగా అనేక సంస్థలలో ఉన్నత పదవుల్లో ఉన్నారు. అలాగే లెక్కలేనన్ని బిరుదులు, సన్మానాలతో డా॥నేరెళ్ళ వేణుమాధవ్ జాతీయ, అంతర్జాతీయంగా ప్రేక్షకులు నీరాజనాలు పట్టారు. మిమిక్రీ కళకు డా. వేణు మాధవ్ ఎనలేని సేవచేశారు. 1971వ సంవత్సరంలో ఐక్య రాజ్యసమితిలో ప్రప్రథమంగా మిమిక్రీ ప్రదర్శన ఇచ్చినఏకైక భారతీయ కళాకారులు డా॥ నేరెళ్ళ వేణు మాదవ్. ఆయన విశిష్టతను గుర్తించిన భారత ప్రభుత్వం 2001 సంవత్సరంలో పద్మశ్రీ పురస్కారంతో సన్మానించింది. మిమిక్రీ కళకు పితామహులు, ఆద్యుడు కళాప్రపూర్ణ పద్మశ్రీ డాక్టర్ నేరెళ్ళ వేణుమాధవ్. ఎందుకంటే ఆనాడు అంటే 20వ శతాబ్దం తొలిదశకం నుంచి ఆరు ఏడు దశాబ్దాల వరకూ ప్రచార సాధనాల ఉధృతి అంతగాలేదు. టివి ఛానళ్ళు, అంతర్జాలం (ఇంటర్నెట్) ప్రభావం ఇంకా విస్తరించలేదు. అందువల్ల ఆ కాలం ప్రజలకు సినిమాలు, నాటికలు, నాటకాలు, జాన పదకళలు, ఇతర రంగస్థల కళలే ముఖ్య వినోద సాధనాలుగా ఉండేవి. దాంతోబాటు కొత్తగా విక సించిన మిమిక్రీ కళ పట్ల వారికి విపరీతమైన మక్కువ ఏర్పడింది. దానికితోడు మిమిక్రీ కళాకారుల సంఖ్య పరిమితంగా ఉండడం, ఉన్న కళాకారుల అంశాల్లో ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా వైవిధ్య భరితంగా ఉండడంకూడా మిమిక్రీ కళ బహుళ ప్రజాదరణ పొందడానికి కారణమైంది. తాను రాణించిన మిమిక్రీ రంగంలో ఇతర ఔత్సాహిక మిమిక్రీ కళాకారులకు ఉపయోగపడే విధంగా అలాగే ఈ కళలో రాణించాలంటే ఇది పుట్టుకతోనే మిమిక్రీ కళ అబ్బుతుందనే అపోహ పోగొట్టడానికి డా.నేరెళ్ళ వేణుమాధవ్ కృషితో హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో(ప్రస్తుతం సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం) డా.కె.వి.రమణాచారి (ప్రస్తుతం రిటైర్డ్ ఐఎఎస్) ప్రోత్సాహంతో మిమిక్రీలో డిప్లొమా ఇన్ మిమిక్రీ కోర్సుకు సిలబస్‌ను రూపొందించి 1999వ (25సంవత్సరాల క్రితం) సంవత్సరంలో ప్రవేశపెట్టారు. నేడు పద్మశ్రీ డా. కీ॥శే నేరెళ్ళ వేణుమాధవ్ గారి జయంతి సందర్భంగా వారు కలలుగన్న మిమిక్రీ కోర్సు మరో 25సంవత్సరాలు వారి ఆశీస్సులతో నిరాటంగా సాగుతుందని తెలియజేస్తూవారిచే ప్రారంభించిన డిప్లొమా ఇన్ మిమిక్రీ కోర్సు సిల్వర్‌జూబ్లీని డా.నేరెళ్ళవేణు మాధవ్‌గారికి అంకితం ఇవ్వడమే నిజమైన ఘన నివాళి. ●



కొత్తసంవత్సర వేడుకలవేళ ఢిల్లీలో ఆపరేషన్ అఘాత్..

# పాక్‌లో భారీగా మేధో వలసలు

## ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాలిక ముప్పు తప్పదంటున్న నిపుణులు

**ఇస్లామాబాద్, డిసెంబరు 27:** దాయాది దేశం పాకిస్తాన్ అతిపెద్ద మేధో వలసను ఎదుర్కొంటోంది. దేశంలో కుదేలవుతున్న ఆర్థిక పరిస్థితులు,రాజకీయ అస్థిరత, భవిష్యత్తుపై నమ్మకం కోల్పోవడం వల్ల చదువుకున్న యువత భారీ సంఖ్యలో దేశాన్ని విడిచిపెడుతోంది. రెండేళ్లలోనే వేల సంఖ్యలో డాక్టర్లు, ఇంజినీర్లు, అకౌంటెంట్లు పాకిస్తాన్‌ను వదిలి విదేశాలకు వెళ్లిపోయారు. గత 24 నెలల్లో పాకిస్తాన్ నుంచి సుమారు 5వేల మంది డాక్టర్లు, 11 వేల మంది ఇంజినీర్లు, 13 వేల మంది అకౌంటెంట్లు ఇతర దేశాలకు వలస వెళ్లారు. ఇది కేవలం గణాంకాల పరమైన నష్టం మాత్రమే కాదు దేశ భవిష్యత్తును నడిపించాల్సిన మేధస్సు బయటకు వెళ్లిపోతున్న దారుణ స్థితికి ప్రతీక. ఈ వలసతో ముఖ్యంగా ఆరోగ్య, ఇంజినీరింగ్, ఫైనాన్స్ వంటి కీలక రంగాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఈ పరిస్థితిపై పాకిస్తాన్ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌పై విమర్శల వర్షం కురుస్తోంది. ఇటీవల ఆయన ఈ భారీ వలసలను బ్రెయిన్ డ్రెయిన్ కాదు, బ్రెయిన్ గైన్ అంటూ సమర్థించేందుకు ప్రయత్నించారు. చదువుకున్న యువత విదేశాల్లో అవకాశాలు లేక బయటకు వెళ్లిపోతుంటే, దాన్ని లాభంగా చెప్పడం ప్రజలను మరింత ఆగ్రహానికి గురి చేసింది. మాజీ సెనేటర్ ముస్తఫా నవాజ్ ఖోఖర్ మాట్లాడుతూ రాజకీయ వ్యవస్థను సరిచేయకపోతే ఆర్థిక వ్యవస్థ నిలదొక్కుకోదని ఆయన హెచ్చరించారు. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఫ్రీలాన్సింగ్ హబ్‌గా గుర్తింపు పొందిన పాకిస్తాన్ తరచూ జరిగే ఇంటర్నెట్ షట్‌డౌన్ల వల్ల ఏకంగా 1.62 బిలియన్ డాలర్ల నష్టాన్ని చవిచూసిందని తెలిపారు. దీనివల్ల దాదాపు 23.7 లక్షల ఫ్రీలాన్సింగ్ ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయని ఆయన పేర్కొన్నారు. పాకిస్తాన్ బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ అండ్ ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ విడుదల చేసిన తాజా డేటా ఈ పరిస్థితిని మరింత ఆందోళనకరంగా చూపిస్తోంది. 2024లో 7,27,381 మంది విదేశీ ఉద్యోగాల కోసం నమోదు చేసుకోగా ఈ ఏడాది నవంబర్ నాటికే 6,87,246 మంది ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఒకప్పుడు గల్ఫ్ దేశాలకు కూలీ పనుల కోసం వెళ్లే వారు ఎక్కువగా ఉండేవారు. డిగ్రీలు, వృత్తి నైపుణ్యాలు ఉన్న వైట్ కాలర్ ఉద్యోగులు కూడా పెద్ద సంఖ్యలో దేశాన్ని వదిలి వెళ్లిపోతున్నారు. డాక్టర్లతో పాటు నర్సుల వలస కూడా ప్రమాదకర స్థాయికి చేరింది. 2011 నుంచి 2024 మధ్య కాలంలో నర్సుల వలస ఏకంగా 2,144 శాతం పెరిగినట్లు నివేదికలు వెలువడుతున్నాయి. ఈ ఏడాది కూడా అదే ధోరణి కొనసాగుతోంది.చదువుకున్న వర్గం దేశం విడిచిపెడుతుండటంతో షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ ఏడాది ఇప్పటివరకు 66,154 మంది ప్రయాణికులను వివిధ కారణాలతో విమానాశ్రయాల్లోనే నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఈ వలసలు దేశ ఆర్థిక వ్యవస్థ, ఆరోగ్యసేవలు, సాంకేతిక పురోగతిపై దీర్ఘకాల ప్రభావం చూపించే ప్రమాదం ఉంది. పరిస్థితిని సరిదిద్దాలంటే రాజకీయ స్థిరత్వం, ఆర్థిక సంస్కరణలు, యువతకు అవకాశాలు కల్పించడం అత్యవసరం. లేదంటే దేశం తన అత్యంత విలువైన సంపద అయిన మానవ వనరులను పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.





## ఉపాధి హామీ రద్దుచేసి పేదల కడుపుకొట్టిన మోడీ

### మల్లిఖార్జున్ ఖర్గే

**న్యూఢిల్లీ,డిసెంబరు 27:** కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి పేదల కడుపు కొట్టిందని ఏఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గే ఆరోపించారు. దీనిపై దేశవ్యాప్త ప్రజా ఉద్యమానికి కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో శనివారం జరిగిన సీడబ్ల్యూసీ సమావేశానికి సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ సీనియర్ నేత శశిథరూర్ సహా పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం సంక్షోభంలో ఉందని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఏ)ను రద్దు చేసి పేదల కడుపు కొట్టారని ఆరోపించారు. ఈ ప్రభుత్వానికి పేదల కంటే కార్పొరేట్ సంస్థలకే ప్రాధాన్యత ఇస్తుందని విమర్శించారు. ఎంజీఎన్ఆర్ఈజీఏను ఆయన వ్యవసాయ చట్టాలతో పోల్చారు. నాడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకున్నట్లు, ఉపాధి హామీ చట్టం రద్దుకు వ్యతిరేకంగా కూడా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, పౌరుల హక్కులకు తీవ్రమైన ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ కుటుంబాలకు ఉపాధి భద్రత కల్పించడానికి నాటి యూపీఏ ప్రభుత్వం ముందుచూపుతో గ్రామీణ ఉపాధి పథకాన్ని తీసుకువచ్చిందని గుర్తు చేశారు.



## ఉపాధి హామీ పథకం పేదల పని వాక్కు

### కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ, డిసెంబరు 27:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి దాని స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావడంపై రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. దీనిని పేద ప్రజలపై జరిగిన దాడిగా పేర్కొన్నారు. ఎంజి నరేగా కేవలం ఒక పథకం మాత్రమే కాదు పేద ప్రజల పని హక్కు అని పేర్కొన్నారు. సంబంధిత మంత్రులను సంప్రదించకుండా, ప్రధాని నరేంద్రమోడీ సొంతంగా ఈ నిర్ణయం తీసుకున్నారని దేశంలో పాలన వన్ మ్యాన్ షోగా మారిపోయిందని దీనికి ఇదే ఉదాహరణ అని ఆరోపించారు. మోడీ ఏది కోరుకుంటే దేశంలో అదే అమలవుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఇటువంటి నియంతృత్వ చర్యలకు వ్యతిరేకంగా పోరాడడానికి ముందుకు రావాలని ప్రతిపక్ష నేతలకు పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి పొందిన ఈ పథకాన్ని ఎలా మారుస్తారని ప్రశ్నించారు. ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగాలు ఇవ్వకుండా యువత భవిష్యత్‌ను నాశనంచేసిన మోడీ ప్రభుత్వం ఇప్పుడు గ్రామీణప్రజలకు ఉపాధి భరోసా దెబ్బ వేస్తోందని మండిపడ్డారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలకు ఆర్థిక భరోసాని ఇస్తూ అన్నం పెట్టిన పథకాన్ని ఆపితే వారు యెక్కడ బతుకుతారని హెచ్చరించారు. దేశంలోని వ్యవస్థలపై కేంద్రం తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలపై ప్రజలు తరఫున కాంగ్రెస్ పోరాడుతూనే ఉంటుందన్నారు. ఈ పథకం రద్దుకు వ్యతిరేకంగా జనవరి 5 నుంచి 'ఎంజీనరేగా బచావో అభియాన్' పేరుతో దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని రాహుల్ ప్రకటించారు.

## మ్యాచ్ ప్రారంభంలోనే అసిస్టెంట్ కోచ్ ఆకస్మిక మృతి

**ఢాకా, డిసెంబరు 27:** బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఢాకా క్యాపిటల్స్ జట్టు అసిస్టెంట్ కోచ్ మహబూబ్ అలీ జకీ (59) హఠాన్మరణం చెందాడు. ఇవాళ సిల్హెట్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో రాజ్‌షాహీ వారియర్స్‌తో మ్యాచ్ ప్రారంభానికి కొద్ది నిమిషాల ముందు ఈ దురదృష్టకర ఘటన జరిగింది. మ్యాచ్‌కు ముందు జట్టు ప్రాక్టీస్ చేస్తుండగా, జకీ మైదానంలో అస్వస్థతకు గురయ్యారు. అప్రమత్తమైన జట్టు సిబ్బంది, వైద్యులు అతడికి సీపీఆర్ చేసి, అంబులెన్స్‌లో సమీపంలోని అల్ హరమైన్ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే మహబూబ్ అలీ జకీ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనతో మైదానంలో ఉన్నవారంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. జకీకి ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని, అతడి ఆకస్మిక మరణం తమను తీవ్రంగా కలచివేసిందని జట్టు అధికారులు తెలిపారు.



జకీ మృతికి సంతాపంగా మ్యాచ్‌కు ముందు ఆటగాళ్లు, అధికారులు ఒక నిమిషం మౌనం పాటించారు. అనంతరం మ్యాచ్ యథావిధిగా కొనసాగింది. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఈ ఘటనపై తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. దేశ క్రికెట్‌కు, ముఖ్యంగా ఫాస్ట్ బౌలర్ల అభివృద్ధికి జకీ చేసిన సేవలు మరువలేనివని కొనియాడింది. ఒకప్పుడు ఫాస్ట్ బౌలర్‌గా రాణించిన జకీ, కొమిల్లా జిల్లాకు, దేశంలో ప్రముఖ క్లబ్ అయిన అబాహనీ లిమిటెడ్‌కు ప్రాతినిధ్యం వహించారు.

## థాయిలాండ్ కాంబోడియాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం

**చాంతబురి(థాయ్‌లాండ్), డిసెంబరు 27:** థాయిలాండ్, కంబోడియా దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. రెండు దేశాలకు చెందిన రక్షణ మంత్రులు శనివారం ఈ ఒప్పందంపై సంయుక్త ప్రకటన చేశారు. కంబోడియా రక్షణ మంత్రి టీ సేహా, థాయిలాండ్ మంత్రి నట్టపోన్ నర్కపనిట్ కాల్పుల విరమణ ఒప్పందంపై సంతకాలు చేశారు. థాయ్‌లోని చాంతబురి ప్రావిన్సులో ఇద్దరు మంత్రుల మీటింగ్ జరిగింది. సైనిక బలగాల కదలికలపై రెండుదేశాలు తక్షణ ఆంక్షలు విధించాయి. బోర్డర్ వద్ద ఉన్న సాధారణ పౌరులు స్వంత ఇండ్లకు చేరుకునే అవకాశం కల్పించారు. గత కొన్నాళ్ల నుంచి థాయ్, కంబోడియా బోర్డర్ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. బోర్డర్ కాల్పుల్లో సుమారు 41 మంది మరణించారు.

## 285 మంది అరెస్టు, మరో 500 మంది అదుపులోకి

**న్యూఢిల్లీ, డిసెంబరు 27:** కొత్త సంవత్సర వేడుకలు సమీపిస్తున్న వేళ, దేశ రాజధాని ఢిల్లీలో పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. శాంతిభద్రతలను పర్యవేక్షించేందుకు, నేరాలను అరికట్టేందుకు సౌత్‌ఈస్ట్ జిల్లా పోలీసులు 'ఆపరేషన్ ఆఘాత్ 3.0' పేరుతో శుక్రవారం రాత్రి మెరుపు దాడులు నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా వందల మందిని అరెస్ట్ చేయడంతో పాటు, పలువురిని ముందుజాగ్రత్త చర్యగా అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్ వివరాలను సౌత్‌ఈస్ట్ డీసీపీ హేమంత్ తివారీ శనివారం మీడియాకు వెల్లడించారు. ఎన్డీపీఎస్ కఠిన ప్రకారం, డీసీపీ మాట్లాడుతూ ఎక్సైజ్ చట్టం, ఎన్డీపీఎస్ చట్టం, గ్యాంబ్లింగ్ చట్టం కింద 285 మంది నిందితులను అరెస్ట్ చేశాం. ముందు జాగ్రత్త చర్యగా 504 మందిని అదుపులోకి తీసుకున్నాం. వీరితో పాటు, నేర చరిత్ర ఉన్న 116 మందిని కూడా పట్టుకున్నామని తెలిపారు. ఆపరేషన్‌లో స్వాధీనం చేసుకున్న వస్తువుల వివరాలను కూడా డీసీపీ తివారీ వివరించారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా 10 మంది ప్రాపర్టీ అఫెండర్లను, ఐదుగురు ఆటోలిఫ్టర్లను అరెస్టు చేశాం. వారి నుంచి 21 నాటు తుపాకులు, 20 బుల్లెట్లు, 27 కత్తులను స్వాధీనం చేసుకున్నాం. మొత్తం 12,258 క్వార్టర్ల అక్రమ మద్యం, 6.01 కిలోల గంజాయిని సీజ్ చేశాం. జూదగాళ్ల నుంచి రూ.2,30,990 నగదు, 310 మొబైల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నాం. 231 ద్విచక్ర వాహనాలు, ఒక ఫోర్‌వీలర్‌ను స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు. న్యూ ఇయర్ వేడుకల సమయంలో ప్రజలకు భద్రత కల్పించేందుకు, నేర కార్యకలాపాలను ముందుగానే నిరోధించేందుకు ఈ ఆపరేషన్ చేపట్టినట్లు పోలీసు అధికారులు స్పష్టం చేశారు. జిల్లాలోని నేర ప్రభావిత ప్రాంతాల్లో స్థానిక నిఘా వర్గాల సమాచారంతో రాత్రంతా ఏకకాలంలో దాడులు, వాహన తనిఖీలు నిర్వహించారు. రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి ఆపరేషన్లు కొనసాగుతాయని, ప్రజా భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని సీనియర్‌పోలీస్ అధికారులు తెలిపారు.

## పహల్గామ్‌కు పోటెత్తిన సందర్శకులు



**పహల్గాంవ్(జమ్ముకశ్మీర్), డిసెంబరు27:** జమ్మూ కశ్మీర్‌లోని సుందరమైన పహల్గామ్‌కు పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. కొత్త సంవత్సర వేడుకలను జరుపుకోవడానికి శనివారం నుంచే నుంచి పెద్ద సంఖ్యలో సందర్శకులు ఇక్కడికి చేరుకుంటున్నారు. ఉగ్రదాడి జరిగిన తర్వాత పర్యాటకుల పూర్తిగా నిలిచిపోయిన పహల్గామ్ మళ్లీ కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా కళకళలాడుతోంది.గత ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు మరణించడంతో కశ్మీర్‌లో పర్యాటక రంగం తీవ్రంగా దెబ్బతింది. వేలాది మంది పర్యాటకులు తమ పర్యటనలను రద్దు చేసుకున్నారు. అయితే, ఇప్పుడు పరిస్థితి మెరుగుపడటంతో నగర జీవితానికి దూరంగా ప్రశాంతంగా గడపాలనుకునే వారు పహల్గామ్‌ను ఎంచుకుంటున్నారు. భద్రతా ఏర్పాట్లపై పర్యాటకులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. హర్యానాకు చెందిన ఓ పర్యాటకురాలు మాట్లాడుతూ, నేను నా భర్తతో కలిసి మొదటిసారి కశ్మీర్‌కు వచ్చాను. ఇది నిజంగా చాలా అందంగా ఉంది. ఇక్కడి భద్రతా ఏర్పాట్లు చాలా బాగున్నాయి. మరో పర్యాటకుడు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కొత్తసంవత్సర వేడుకల కోసం కశ్మీర్ విద్యార్థులబృందం కూడా పహల్గామ్‌కు చేరుకుంది. ఇప్పుడు పరిస్థితులు చాలా మెరుగు పడ్డాయి.ఇంతకుముందు శ్రీనగర్ వెళ్లాను, ఇప్పుడు పహల్గామ్‌కు వచ్చాను. ఇంకా మంచు కురవనప్పటికీ రాబోయే రెండు మూడు రోజుల్లో కురుస్తుందని ఆశిస్తున్నాం. స్థానిక ప్రజలు చాలా సహాయంచేస్తున్నారు" అని ఓ విద్యార్థి చెప్పాడు.

## 20 సూత్రాల శాంతిప్రణాళికపై రెఫరెండమ్‌కు జెలెన్‌స్కీ పిలుపు

**కీవ్, డిసెంబరు 27:** ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్‌స్కీ ఒక సాహసోపేతమైన ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. తన 20సూత్రాల శాంతి ప్రణాళిక పై దేశవ్యాప్తంగా ప్రజాభిప్రాయ సేకరణ (రెఫరెండం) నిర్వహించడానికి తాను సిద్ధమని, అయితే దీనికి రష్యా కనీసం 60 రోజుల పాటు కాల్పుల విరమణకు అంగీకరించాలని షరతు విధించారు. అమెరికా మీడియా సంస్థ యాక్సియోస్‌కి ఇచ్చిన ఫోన్ ఇంటర్వ్యూలో జెలెన్‌స్కీ ఈ విషయాలను వెల్లడించారు. శాంతి ఒప్పందంలో భాగంగా ప్రాంతీయ సరిహద్దులు లేదా భూభాగాలకు సంబంధించిన నిర్ణయాలు సంక్లిష్టంగా మారితే, దానిపై తుది నిర్ణయాన్ని ఉక్రెయిన్ ప్రజలకే వదిలేస్తానని జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. ఇది చాలా కష్టమైన



నిర్ణయం. అందుకే మొత్తం 20 పాయింట్ల ప్రణాళికను ప్రజల ముందు ఉంచడం సరైన మార్గమని నేను భావిస్తున్నాను. కానీ, బాంబు దాడులు జరుగుతున్నప్పుడు ప్రజలు ఓటు వేయలేరు. అందుకే ఎన్నికల నిర్వహణ, భద్రత, ఇతర సాంకేతిక కారణాల దృష్ట్యా 60 రోజుల విరామం అత్యవసరమని ఆయన వివరించారు. ఆదివారం ఫ్లోరిడాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరగనున్న భేటీపై జెలెన్‌స్కీ భారీ ఆశలు పెట్టుకున్నారు. ఈ భేటీలో యుద్ధం ముగింపునకు ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్ వస్తుందని ఆయన భావిస్తున్నారు. ప్రస్తుతం అమెరికా ఉక్రెయిన్ మధ్య ఐదు కీలక పత్రాలపై ఒప్పందం కుదిరిందని, ఇందులో భద్రతా హామీల కాలపరిమితిని 15 ఏళ్ల నుంచి మరింత పెంచాలని తాను కోరుతున్నట్లు జెలెన్‌స్కీ తెలిపారు. మరోవైపు రష్యా కూడా ప్రజాభిప్రాయ సేకరణ కోసంకాల్పులవిరమణ అవసరమని గుర్తిస్తున్నప్పటికీ, 60రోజుల గడువు చాలాఎక్కువని భావిస్తున్నట్లు సమాచారం. గడువును తగ్గించాలని రష్యా కోరుతుండగా, క్షేత్రస్థాయిలో ఏర్పాట్లకు అంత సమయం సరిపోదని ఉక్రెయిన్ వాదిస్తోంది. ఈ ప్రతిపాదనలపై నేడు ట్రంప్, జెలెన్‌స్కీ, యూరోపియన్ నేతల మధ్య కాన్ఫరెన్స్ కాల్ జరిగే అవకాశం ఉంది.

## బంగ్లా పేసర్‌ను ఐపిఎల్‌లో ఆడిస్తే పిచ్‌లు తవ్వేస్తాం..

### ఉజ్జయినిలో హిందూ మతపెద్దల హెచ్చరికలు

**ఉజ్జయిని, డిసెంబరు 27:** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల ప్రభావం ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్‌)పై పడింది. బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను ఐపీఎల్‌లో ఆడనిస్తే, మ్యాచ్‌లు జరిగే స్టేడియంలోకి దూసుకెళ్లి పిచ్‌లను ధ్వంసం చేస్తామని ఉజ్జయినికి చెందిన పలువురు మత పెద్దలు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. బంగ్లాదేశ్‌లో ఇద్దరు హిందువులను దైవదూషణ ఆరోపణలతో దారుణంగా హత్య చేసిన ఘటనల నేపథ్యంలో భారత్‌లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే ఉజ్జయినిలోని రిన్‌ముక్తేశ్వర్ మహాదేవ్ ఆలయ ప్రధాన పూజారి మహావీర్ నాథ్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులను వేధిస్తున్నా, అక్కడి ఆటగాళ్లను భారత్‌లో ఆడనివ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. అవసరమైతే తమ నాగ సాధువులు స్టేడియంలపై దాడి చేసి మ్యాచ్‌లను అడ్డుకుంటారని స్పష్టం చేశారు. ఇతర పీఠాధిపతులు కూడా ఇదే విధమైన హెచ్చరికలు చేశారు. ఇటీవల జరిగిన ఐపీఎల్ వేలంలో ముస్తాఫిజుర్ రెహమాన్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) రూ.9.20 కోట్లకు కొనుగోలు చేసింది. బంగ్లాదేశ్ నుంచి వేలంలో అమ్ముడైన ఏకైక ఆటగాడు అతడే కావడం గమనార్హం. ఈ పరిణామంపై సోషల్ మీడియాలో కేకేఆర్‌ను బాయ్‌కాట్ చేయాలంటూ ప్రచారం ఊపందుకుంది.



ఈ నెల18న బంగ్లాదేశ్‌లోని మైమెన్‌సింగ్ జిల్లాలో దీపు చంద్రదాస్ అనే హిందూ యువకుడిని, 24న రాజ్‌బరి జిల్లాలో అమృత్ మొండల్ అనే మరో హిందూ వ్యక్తిని మూకదాడుల్లో హత్య చేశారు. ఈ దాడులను ఖండించిన బాగేశ్వర్ ధామ్ పీఠాధిపతి ధీరేంద్ర శా తదితరులు ఉన్నారు.

## బంగ్లాలో ఉద్రిక్తతలు..రాక్‌స్టార్ కాన్సర్ట్‌పై మూక దాడి



**ఢాకా, డిసెంబరు 26:** బంగ్లాదేశ్‌లో ప్రముఖ రాక్‌స్టార్ కాన్సర్ట్‌పై మూక దాడి జరిగింది. షో ప్రారంభానికి ముందే కొంతమంది ఆందోళనకారులు వేదిక వద్దకు దూసుకువచ్చారు. ఉద్రిక్తతల నేపథ్యంలో నిర్వాహకులు షోను రద్దు చేశారు. ఈ దాడిలో 20 మంది గాయపడినట్లు తెలుస్తోంది. ఫరీదాపూర్‌లో ఓ పాఠశాల 185వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా బంగ్లాదేశ్‌కు చెందిన ప్రముఖ గాయకుడు జేమ్స్ కాన్సర్ట్‌ను ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులతో సహా వేలాది మంది ఇందులో పాల్గొనేందుకు వచ్చారు. అయితే ఈ కాన్సర్ట్ ప్రారంభానికి ముందు ఉన్నట్టుండి ఆందోళనకారులు వేదిక వద్దకు దూసుకొచ్చారు. భద్రతా సిబ్బంది వారిని ఆపేందుకు ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాలేదు. కాన్సర్ట్‌కు వచ్చిన వారిపైకి ఆందోళనకారులు రాళ్లు, ఇటుకలతో దాడి చేశారు. దీంతో పలువురు పాఠశాల విద్యార్థులు గాయపడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అక్కడికి చేరుకొని నిరసనకారులను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. భద్రతా కారణాల రీత్యా కాన్సర్ట్‌ను రద్దు చేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఆందోళనకారుల దాడి నుంచి గాయకుడు జేమ్స్ త్రుటిలో తప్పించుకున్నారు. ఉద్రిక్తతలు మొదలవగానే భద్రతా సిబ్బంది ఆయనను అక్కడి నుంచి తరలించారు. జేమ్స్, ఆయన సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.


## అత్యధికంగా భారతీయులను బహిష్కరించిన సౌదీ అరేబియా

**న్యూఢిల్లీ, డిసెంబరు 27:** ఇటీవల అమెరికా నుంచి పెద్దఎత్తున భారతీయుల బహిష్కరణలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. అయితే ఈ ఏడాది అత్యధికంగా భారతీయులను స్వదేశానికి డిపోర్ట్ చేసింది సౌదీ అరేబియా! ఈ మేరకు కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ రాజ్యసభకు సమర్పించిన నివేదికలో ఈ విషయం వెల్లడైంది. ఈ డేటాను ఇటీవల అందించగా ఈ సమాచారం తాజాగా బయటకొచ్చింది. 2025లో దాదాపు 24,600 మంది భారతీయులను 81 దేశాలు స్వదేశానికి పంపించాయి. **నివేదికలో కీలక వివరాలు ఇవే:** ఈ ఏడాది సౌదీఅరేబియా నుంచి 11వేల మందికిపైగా భారతీ యులను వెనక్కి పంపించింది. అమెరికా 3, 800 మందిని భారత్‌కు డిపోర్టుచేసింది. వీరిలో ప్రైవేటు ఉద్యోగులు,విద్యార్థులు కూడా ఉన్నారు. మయన్మార్ 1,591, మలేషియా 1,483, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ 1,469 మంది భారతీయులను స్వదేశానికి పంపించాయి. సైబర్ ముఠాల్లో చిక్కుకున్న కేసులకు సంబంధించి మయన్మార్ అనేక మందిని భారత్‌కు పంపించింది. వీరిలో ఎక్కువమంది తెలుగువారు ఉన్నట్లు సమాచారం. వీసా కాలపరిమితి తీరడం లేదా అనుమతుల్లేకుండా ఉద్యోగాలు చేయడం వంటి కారణాలతో గల్ఫ్ దేశాలు ఎక్కువమంది భారతీయులను డిపోర్ట్ చేశాయి. ఈ బహిష్కరణల్లో విద్యార్థులే ఎక్కువ మంది ఉన్నారు. ఈ ఏడాది యుకే 170మంది, ఆస్ట్రేలియా 114 మంది, రష్యా 82 మంది, అమెరికా 45మంది భారతీయ విద్యార్థులను స్వదేశానికి పంపించాయి. అమెరికా గత ఐదేళ్లలో ఈసారే అత్యధిక బహిష్కరణలు చోటుచేసుకున్నాయి. ఎక్కువగా వాషింగ్టన్ డీసీ నుంచి 3,414 మంది భారతీ యులను డిపోర్ట్ చేసింది. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమ వలసలపై కఠిన చర్యల నేపథ్యంలో భారతీయులను సంకెళ్లతో స్వదేశానికి పంపించిన సంగతి తెలిసిందే. ప్రత్యేక సైనిక విమానాల్లో డిపోర్ట్ చేశారు. ఆ సమయంలో వలసదారుల చేతులు, కాళ్లను బంధించి తరలించడంపై తీవ్ర వివాదం రాజుకుంది.



## సంక్షిప్తంగా..

### పన్వేల్ ఫామ్‌హౌస్‌లో సల్మాన్ జన్మదిన వేడుకలు



**ముంబయి, డిసెంబరు 27:** బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్ 60వ జన్మదినం ఈ సందర్భంగా తన పన్వేల్ ఫామ్‌హౌస్‌లో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకకు సినీ, క్రీడా రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై సందడి చేశారు. సల్మాన్ తల్లిదండ్రులు సలీం ఖాన్, సల్మాన్‌ఖాన్ వేదిక ప్రాంగణం వద్ద కనిపించారు. సోదరులు అర్బాజ్ ఖాన్ తన భార్య షురాఖాన్,వారి నవజాత శిశువుతో కలిసి హాజరుకాగా, సోహైల్‌ఖాన్ కూడా పాల్గొన్నారు. సోదరీమణులు అర్పితా ఖాన్‌శర్మ, అల్విరాఖాన్ అగ్నిహోత్రి తమ కుటుంబాలతో కలిసి ఈ వేడుకలో పాలుపంచుకున్నారు. ఈ పార్టీకి నటులు సంజయ్ దత్, ఆదిత్య రాయ్ కపూర్, క్రికెటర్ ఎంఎస్ ధోనీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

### వెచ్చదనానికి మంటరాజేసి నిద్రించిన కుటుంబం..నలుగురు మృతి



**పాట్నా, డిసెంబరు 27:** చలికాలం నేపథ్యంలో గదిలో వెచ్చదనం కోసం మంట రాజేసి ఒక కుటుంబం నిద్రించింది. విషవాయువు వెలువడటంతో ఒక వృద్ధురాలు,ముగ్గురు పిల్లలు మరణించారు.మరో నలుగురుపరిస్థితి విషమంగా ఉన్నది. బీహార్‌లోని చాప్రాజిల్లాలో ఈ సంఘటన జరిగింది.చాప్రాకు చెందిన ఒక కుటుంబం గురువారం రాత్రి వేళ గదిలో వెచ్చదనంకోసం బొగ్గుల కుంపటి వెలిగించారు. తలు పులు, కిటికీలు మూసేశారు. ఎనిమిది మంది కుటుంబ సభ్యులు ఆ గదిలో నిద్రించారు. కాగా, బొగ్గుల కుంపటి మంటతో ఆగదిలో ఆక్సిజన్ స్థాయిలు పడిపోయాయి. విషపూరిత కార్బన్ మోనాక్సైడ్ పేరుకుపోయింది. దీంతో ఆ గదిలో ఎనిమిదిమంది స్పృహకోల్పోయారు. శుక్రవారం తెల్లవారు జామున కింది అంతస్తులో నివసించే బంధువులు పైకెళ్లి చూశారు.ఆగదిలో ఉన్న వారిపరిస్థితి చూసి ఆందోళన చెందారు.

### ట్రయల్ రన్‌లోనే కుప్పకూలిన రోప్‌వే..



**పాట్నా, డిసెంబరు 27:** బీహార్‌లో కొత్తగా నిర్మించిన రోప్‌వే ట్రయల్ రన్‌లోనే కుప్పకూలిపోయింది. అక్కడున్న కార్మికులు ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. ఈప్రమాదంతో రోప్‌వే నిర్మాణ నాణ్యతపై ఆరోపణలు వెల్లువెత్తాయి. బీహార్‌లోని రోహ్‌తస్ జిల్లాలో కొత్తగా రోప్‌వే నిర్మించారు. రోహ్‌తస్ బ్లాక్ నుంచి రోహ్‌తస్ గఢ్‌కోట, రోహితేశ్వర్ ధామ్ వరకు రోప్‌వే ఏర్పాటు చేశారు. నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. దీంతో రోప్‌వే ప్రారంభించే ముందు ట్రయల్ రన్ నిర్వహించారు. అయితే ఒక కేబుల్ చిక్కుకుపోవడంతో ఆరోప్‌వే కూలిపోయింది. ట్రయల్ రనేకోసం వినియోగించిన నాలుగు ట్రాలీలు చాలాఎత్తునుంచి కిందపడి ధ్వంసమయ్యాయి.అయితే అందులో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదు అక్కడ పని చేస్తున్న కార్మికులు కూడా ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు.

### సొంతకుటుంబాన్నే బెదిరించిన భారత్ యువకుడి అరెస్టు



**టెక్సాస్, డిసెంబరు 27:** అమెరికాలో భారతసంతతికి చెందిన 22ఏళ్ల విద్యార్థిని పోలీసులు అరెస్ట్ చేశారు. సొంత కుటుంబ సభ్యులనే బెదిరించడంతో పాటు ఇంటికి నిప్పు పెట్టడానికి ప్రయత్నించాడన్న తీవ్ర ఆరోపణలపై అతడిని అదుపులోకి తీసుకున్నారు. టెక్సాస్ రాష్ట్రంలోని ఫ్రిస్కో నగరంలో ఈఘటన చోటుచేసుకుంది. యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో చదువుతున్న మనోజ్ సాయిలెల్ల సోమవారం అరెస్ట్ అయ్యాడు. కొన్ని రోజులుగా మనోజ్ మానసిక ఆందోళనతో ఉన్నాడని,తమను బెదిరిస్తున్నాడని అతని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతకుముందు అతను తాము నివసిస్తున్న ఇంటికి నిప్పు పెట్టడానికి కూడా ప్రయత్నించాడని వారు ఆరోపించారు.

### కర్ణాటకలో 400కిపైగా ముస్లిం ఇళ్లు కూల్చివేత



**బెంగళూరు, డిసెంబరు 27:** కర్ణాటకలో 200కిపైగా ఇళ్లను అధికారులు కూల్చివేయడంతో సుమారు 400 ముస్లిం కుటుంబాల ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఉత్తరాది రాష్ట్రాల బుల్డోజర్ చర్యను ఇక్కడ అమలు చేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఈనెల 22న తెల్లవారుజామున 4 గంటల సమయంలో బెంగళూరు శివారు కోగిలు గ్రామంలోని ఫకీర్ కాలనీ, వాసిం లేఅవుట్‌లోని సుమారు 200కు పైగా ఇళ్లను అధికారులు కూల్చివేశారు. బెంగళూరు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ నిర్వహించిన ఈ డ్రైవ్‌లో నాలుగు జేసీబీలు వినియోగించారు. 150 మందికి పైగా పోలీసు సిబ్బంది మోహరించారు. ఉర్దూ ప్రభుత్వ స్కూల్‌కు ఆనుకుని ఉన్న సరస్సు ప్రాంతంలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్నారని కర్ణాటక ప్రభుత్వం ఆరోపించింది. ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది.

# దేశంలో నకిలీ గాంధీల మాటలు ఎవరూ నమ్మరు

## బిజెపి ఎంపి రఘునందన్‌రావు



శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎంపి రఘునందన్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 27:** దేశంలో నకిలీ గాంధీల మాటలు ఎవరు నమ్మే పరిస్థితిలో లేరని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. గాంధీ పేరు లేకుంటే నకిలీ గాంధీలకు మనుగడ ఉండదని భయపడుతున్నారని విమర్శించారు. మహాత్మాగాంధీపై సోనియాగాంధీ కుటుంబానికి చిత్తశుద్ధి ఉంటే వారి హయంలో గాంధీ పేరుతో ప్రవేశ పెట్టిన పథకాల శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 150 పథకాల్లో రెండు, మూడు పథకాలు మాత్రమే కాంగ్రెస్ గాంధీ పేరు పెట్టిందని ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగే హింసపై కాంగ్రెస్ కనీసం ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రఘునందన్ రావు మీడియాతో మాట్లాడారు. 'తండ్రి ఈవీఎంలు ప్రవేశపెడితే కొడుకు దాన్ని వ్యతిరేకిస్తాడు. మీరు గెలిస్తే ఈవీఎంలు పని చేస్తున్నట్లా.. మేము గెలిస్తే పని చేయనట్లా?. ఇదెక్కడి సంస్కృతి ? రాహుల్ గాంధీకి తండ్రి అంటే గౌరవం, విశ్వాసం లేదు అని రఘునందన్‌రావు పేర్కొన్నారు.. ముక్కలైన కాంగ్రెస్.. దేశాన్ని ముక్కలుగా చేయాలని చూస్తోందన్నారు. 'గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు, కంప్యూటర్ ఆపరేటర్లకు తప్ప రాష్ట్ర ప్రభుత్వం ఇంకెవరికి పైసలు ఇవ్వదు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నుంచి పంచాయతీలకు రూపాయి అందడం లేదు. లోకల్ అడ్మినిస్ట్రేషన్ అనే పదానికి అర్థం లేకుండా కాంగ్రెస్ చేసింది' అని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చింది. మల్లికార్జున ఖర్గే ముందు.. మీ సొంత రాష్ట్రంలో పంచాయతీ చూసుకోండి. అక్కడ రేపు ఎన్నికలు వస్తే ఏమవుతుందో అది చూసుకోండ్డి అని రఘునందన్ రావు విమర్శించారు.
బావ, బామ్మర్దులతో అవ్వట్లేదని కేసీఆర్‌ను బయటకు తెచ్చారు. కేసీఆర్ బయటకు వచ్చిన తెలంగాణ రాజకీయంలో ఎలాంటి ప్రభావం ఉండదు. డబ్బులు ఉన్నాయి కాబట్టి సభలు పెడుతున్నారు. డబ్బులు పెట్టిన జూబ్లీహిల్స్, కంటోన్మెంట్‌లో ఏమి జరిగిందో అదే అవుతాది తప్ప ఒరిగేదేమీ లేదు. ఇంట్లో పంచాయితీతో బీఆర్ఎస్ ప్రమాదంలో పడింది. అందుకే కేసీఆర్‌ను బయటకు తెచ్చారు. 'ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాతో చెప్పిన మాటలు నిజం. మా నాయకుడు మాతో మాట్లాడితే దానికి బ్రేకింగ్‌లు, ట్రోలింగ్‌లు ఎందుకు..?. మోదీ తమను ఒక్కసారి మజ్లిస్‌తో కంపేర్ చేయడం అనేది వాస్తవం. మా లీడర్ల ఇంట్లో మేము భోజనానికి వెళ్తే తప్పు ?. ఎంపీ అరవింద్ కొత్త ఇల్లు కట్టారని.. భోజనానికి పిలిచారు. అలా ఏదైనా వేడుక ఉంటే అందరం కలుస్తాం' అని రఘునందన్ రావు స్పష్టం చేశారు.

# సుదూరంగా టెట్ పరీక్షా కేంద్రాల కేటాయింపు

## ఇబ్బంది పడుతున్న అభ్యర్థులు: టిఎస్‌యుటిఎఫ్

**హైదరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వచ్చే జనవరి 3 నుండి 20 వరకు జరగనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష( టెట్) కేంద్రాలను సుదూరంగా కేటాయించారని టిఎస్ యుటిఎఫ్ మండిపడింది. టెట్ పరీక్షలు రాయాల నుకునే వారు సుమారు 2 నుండి 3 వందల కిలోమీటర్ల దూరంలో పరీక్షా కేంద్రాలకు హాజరు కావాల్సి వస్తోందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ ఆందోళన వ్యక్తం చేశారు. అభ్యర్థులకు నిర్మల్ నుండి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం నుండి హైదరాబాద్, హైదరాబాద్ నుండి ఖమ్మం కేటాయించారని అన్నారు. టెట్ అధికారులు ఏ ప్రాతిపదికన పరీక్షా కేంద్రాలు కెటాయించారో తెలియటం లేదని, కానీ అభ్యర్థులు మాత్రం ఇబ్బంది పడుతున్నారని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సర్వీసులో ఉన్న సీనియర్ టీచర్లు రెండేళ్ళలో టెట్ పాస్ కావలసి ఉన్నందున ఈ సారి పెద్ద సంఖ్యలో ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు పరీక్ష రాయడానికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ మౌలిక నిబంధనలు 9(6) సబ్ క్లాజ్ బి(3) ప్రకారం శాఖాపరమైన పరీక్షలకు హాజరయ్యే ఉద్యోగులకు పరీక్షతోపాటు ప్రయాణ కాలాన్ని ఆన్ డ్యూటీగా పరిగణిస్తారని.. కనుక టెట్ రాసే ఉపాధ్యాయులకు కూడా పరీక్ష, ప్రయాణ సమయాన్ని ఆన్ డ్యూటీగా మంజూరు చేయాలని, ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ తెలిపారు.

# జిఒ 252ను సవరించాలి

## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 252ను సవరించాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 252 జీవో ద్వారా జర్నలిస్టులను వర్గీకరించాలని భావించిందని, రిపోర్టర్లకు అక్రెడిటేషన్, డెస్క్ జర్నలిస్టులకు మీడియా కార్డులు ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. దీంతో సాధారణ జర్నలిస్టులు, డెస్క్ జర్నలిస్టులతోపాటు చిన్న, మధ్యతరహా పత్రికలు అక్రెడిటేషన్లను కోల్పోతుండటంతో వందలాది మంది వర్కింగ్ జర్నలిస్టులు నష్టపోతున్నారని అన్నారు. వెంటనే జీవోను సవరించి, అర్హులైన వారం దరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని, చిన్న మధ్యతరహా పత్రికలను ఆదుకోవాలని జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు కనీస భద్రత, సంక్షేమం లేదని, ఆరోగ్య బీమా అమలు కావడంలేదన్నారు. హెల్త్ కార్డులపై కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్స అందడంలేదన్నారు. మరణించిన జర్నలిస్టు కుటుంబాలకు పరిహారం ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపులో, విధి నిర్వహణలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరి కట్టడంలో తీవ్ర జాప్యం చేస్తుందని.. ఈ నేపథ్యంలో వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో జర్నలిస్టుల సంక్షేమంపై కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చినప్పటికీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించిందని, తక్షణమే జర్నలిస్ట్ సంఘాలతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని జాన్ వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# వైద్య, ఆరోగ్య శాఖలోని సుదీర్ఘ సమస్యలను పరిష్కరించాలి

## టివివిపిలో పనిచేస్తున్న వైద్యులకు రెగ్యులర్‌గా వేతనాలు ఇవ్వాలి

## ప్రభుత్వ వైద్యుల సంఘం డిమాండ్

**హైదరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్య శాఖలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం(టిజిజిడిఎ) డిమాండ్ చేసింది. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న వైద్యులకు రెగ్యులర్‌గా వేతనాలు అందేలా చూడాలని, శాఖలో కెరీర్ అడ్వాన్స్ స్కీమ్(సీఏఎస్) అమలు చేయాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టరన నరహరి, సెక్రటరీ జనరల్ డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్, రాష్ట్ర కోశాధికారి డాక్టర్ ఎంకె రౌఫ్ డిమాండ్ చేశారు. టిజిజిడిఏ ప్రతినిధులు శనివారం కోఠిలోని డిహెచ్ కార్యాలయం దగ్గర మీడియాతో మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖలోని ప్రధాన డిమాండ్ల గురించి మాట్లాడుతూ తెలంగాణ వైద్య విధాన పరిషత్(టివివిపి)లో పనిచేస్తున్న వారిలో ఈ రోజు(శనివారం) వరకు కూడా కొంతమంది ఉద్యోగులకు జీతాలు అందలేదన్నారు. ఇందుకు టివివిపి కమిషనర్, ఫైనాన్స్ విభాగం వ్యవహరిస్తున్న తీరే కారణమన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం టివివిపిని డిఎస్‌హెచ్‌గా మార్పు చేయడమేనన్నారు. అందుకోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏఎస్‌సిఐ కమిటీ ఇప్పటికే ఆర్థిక, న్యాయపరమైన అడ్డంకులు ఏవీ లేవని స్పష్టంగా పేర్కొంటూ సానుకూల నివేదికను సమర్పించిందని...అయినప్పటికి ఇప్పటి వరకు ఎటువంటి పురోగతి లేదన్నారు. సోమవారం నుంచి జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో టివివిపి-డిఎస్‌హెచ్ బిల్లును తప్పనిసరిగా ప్రవేశపెట్టాలని టిజిజిడిఏ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిఎస్‌హెచ్ సంబంధిత రీడిప్లాయ్‌మెంట్, టివివిపి ప్రమోషన్లు పూర్తిగా నిలిచిపోయాయని.. వాటన్నింటినీ తక్షణమే పరిష్కరించాలన్నారు. టివివిపి కమిషనర్ చురుకుగా స్పందించి సమస్యల పరిష్కారానికి ముందడుగు వేయాలన్నారు. పెరిఫెరల్ మెడికల్ కాలేజ్ అలవెన్స్ కొత్తగా ఏర్పాటు చేసిన అన్ని మెడికల్ కాలేజీల్లో పెరిఫెరల్ మెడికల్ కాలేజ్ అలవెన్స్‌ను వెంటనే మంజూరు చేయాలన్నారు. తద్వారా అధ్యాపకులు చేరేందుకు ప్రోత్సాహం లభిస్తుంది. వైద్య, ఆరోగ్య శాఖలో కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సిఏఎస్)ను కఠినంగా అమలు చేయాలని, .ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ సీఏఎస్ ప్రమోషన్ ఆర్డర్లు వెంటనే జారీ చేయాలన్నారు. నిమ్స్ పే స్కేల్స్‌ను అమలు చేయాలన్నారు. జీవో 142ను సవరించాలన్నారు.

డిపిహెచ్‌ఎఫ్‌డబ్ల్యూ విభాగంలో జీవో 142 సవరణను వెంటనే అమలు చేయాలని ఇది చాలా కాలం క్రితమే వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి అంగీకరించారని గుర్తు చేశారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లకు (ఏవో)లకు అత్యధిక అధికారాలు అప్పగించడం నిలిపివేయాలని, ఇది వైద్య వర్గాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందని టిజిజిడిఏ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. తాము ప్రభుత్వం దృష్టికి తీసు కొచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించకపోతే.. భవిష్యత్ కార్యాచరణను ప్రకటించక తప్పదని టిజిజిడిఏ అధ్యక్షులు డాక్టర్ నరహరి, సెక్రటరీ జనరల్ డాక్టర్ లాలు ప్రసాద్ రాథోడ్ హెచ్చరించారు.

# నిమ్స్‌లో యూరాలజీ విభాగంలో సబ్‌స్పెషాలిటీ క్లినిక్‌లు


నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), డిసెంబరు 27, ప్రభాతవార్త:** నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)లో మూడు సబ్ స్పెషాలిటీ క్లినిక్‌లను ప్రారంభించనున్నట్లు నిమ్స్ డైరెక్టర్ ప్రొ.నగరి బీరప్ప తెలిపారు. యూరాలజీ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగంలో యూరోఆంకాలజీ, రీనల్ ట్రాన్స్ ప్లాంటేషన్, పీడియాట్రిక్ యూరాలజీ అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ క్లినిక్‌లు యూరాలజీ విభాగాధిపతి డా. రాహుల్ దేవర్ ఆధ్వర్యంలో జనవరి 1వ తేదీ నుండి ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పెషాలిటీ బ్లాక్ 6వ అంతస్తులోని యూరాలజీ విభాగంలో అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సేవల ద్వారా మూత్ర సంబంధిత క్యాన్సర్ వ్యాధులు, కిడ్నీమార్పిడి చికిత్సలు, పిల్లల యూరాలజీ సమస్యలకు అధునాతన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయని, ప్రజలకు నాణ్యమైన, వైద్యసేవలు మరింత సులభంగా అందుతాయని డాక్టర్ బీరప్ప తెలిపారు.

# రైతులకు రూ.100 కోట్ల మైక్రో సబ్సిడీ పెండింగ్

**హైదరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మైక్రో ఇరిగేషన్ పథకానికి సంబంధించి రైతులకు సబ్సిడీ పెండింగ్‌లో పడింది. దాదాపు 100 కోట్ల రూపాయల మేర బకాయిలు ఉన్నట్లు సమాచారం. మైక్రో ఇరిగేషన్ పథకం కింద ఎకరం డ్రిప్ ఏర్పాటుకు 60 వేల రూపాయలు, స్ప్రింక్లర్‌లకు రూ. 50 వేల రూపాయల చొప్పున సబ్సిడీ కింద రైతులకు అందాల్సి ఉంటుంది. ఈ విధంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు నాలుగేళ్లుగా 20వేల ఎకరాలకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు తెలియవచ్చింది. కాగా 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో ప్రతి జిల్లా నుంచి వేలాది మంది రైతులు డ్రిప్, స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసుకున్నారు. వీటి సబ్సిడీ కోసం ఉద్యాన శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. ఇక 2025-26 సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా 45వేల వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. పాత బిల్లులు రాకపోవడంతో కొత్త యూనిట్ల మంజూరు ఇవ్వడానికి ఉద్యాన శాఖ అధికారులు వెనుకాడుతున్నారు.

# అసెంబ్లీలో ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలి

## రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతలు

**హైదరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త :** స్థానిక సంస్థలు, విద్యా ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి అమలు చేయడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై అసెంబ్లీలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని అఖిల పక్షపార్టీలు, బీసీ కుల సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీల బిసి నాయకులు బిసి రిజర్వేషన్ల కోసం పోరాటానికి కలిసి రావాలని పిలుపునిచ్చింది. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అధ్యక్షతన శనివారం నగ రంలో అఖిల పక్ష బీసీ సంఘాలు, కుల సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నేతలతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, శాసన మండలి ప్రతిపక్ష ఎస్.మధుసూదనాచారి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, రిటైర్డు ఐఎఎస్ అధికారి, బీసీ నేతలు చిరంజీవులు, గుజ్జ కృష్ణ, అనంతుల రామూర్తిగౌడ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనకై అసెంబ్లీ సమావేశాలను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీలు రాష్ట్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. పార్టీలకతీతంగా అన్ని రాజకీయ పార్టీల్లో ఉన్న బీసీ నేతలు బీసీ రిజర్వేషన్ల సాధనకై ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చి సర్పంచ్ ఎన్నికల్లో పూర్తిగా తగ్గించి బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణం పాఠం చెప్పాలని అన్నారు.



ఎర్ర సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో గుజ్జ కృష్ణ, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపి ఆర్.కృష్ణయ్య, మండలి ప్రతిపక్ష నాయకుడు ఎస్.మధుసూదనాచారి, చిరంజీవులు తదితరులు

బీసీ రిజర్వేషన్ల సాధనకై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులగణన లెక్కలు బయటపెట్టాలని అన్నారు. జడ్పిటీసీ, ఎంపిటీసి ఎన్నికలు 42 శాతం బీసీ రిజర్వేన్లతోనే జరపాలని అన్నారు. బీసీ రిజ ర్వేషన్లు లేకుండా ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ జేఏసీ వైస్ చైర్మన్ విజిఆర్ నారగోని, బిసి విద్యార్థి విభాగం అధ్యక్షుడు అనంతుల రామూర్తిగౌడ్, విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ, అయిలి వెంకన్న, కోలా జనార్ధన్, నాగుల శ్రీనివాస్, దప్పు స్వామి, బీసీ సంఘాలు, ప్రజా సంఘాలు, మహిళా, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి యువకుడు ఆత్మహత్య


రవీందర్ (ఫైల్)

**హైదరాబాద్ (జీడిమెట్ల), డిసెంబరు 27, ప్రభాతవార్త:** ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రవీందర్ (24) తాను ఆన్‌లైన్ గేమ్స్‌లో పెట్టుబడి పెట్టి మోస పోయానని వీడియో రికార్డ్ ద్వారా తెలియజేశారు. తన చావుకు ఎవరు బాధ్యులు కాదని, సూరారం లోని తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకి పాల్పడ్డాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గ్రామాలు, పట్టణాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

## కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారు

## రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబాబాద్ ప్రతినిధి,ప్రభాతవార్త:** గ్రామాలు, పట్టణాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ రామచందర్‌నాయక్, ఎమ్మెల్యే మురళినాయక్, ఎంపి పోరిక బలరాంనాయక్, ఖమ్మం ఎంపి రఘురాంరెడ్డి, కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్, ఎస్పి సుధీర్ రాంనాథ్‌కేకన్ లతో కలిసి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన నూకల రాంచంద్రారెడ్డి స్మారక కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం అన్నారు. నూకల రామచంద్రారెడ్డి విద్యార్థి దశ నుండి అనేక పోరాటాలు చేసి అంచెలంచెలుగా ఎదిగి ఉన్నతస్థాయికి ఎదిగారన్నారు. వారి రాజకీయ ప్రస్తానంలో రాజకీయాలంటే ఇలా కూడా చేయెచ్చనేది ఈ రోజు వేదిక మీద ఉన్న ప్రముఖులందరూ గుర్తుచేసుకోవడం చాలా గొప్ప విషయమన్నారు. చట్టం భవిష్యత్ తరాలకు ఉపయోగపడాలని రెవెన్యూ చట్టంలో అనేక సంస్కరణలు తీసుకరావడమే కాకుండా గిరిజన ప్రాంతమైన ఈప్రాంతలో లంబాడి సోదరులకు ఉపయోగపడే చట్టాలతో పాటు లంబాడిలను ఎస్టీజాబితాలో కావాలని ఆనాటి కెబినెట్‌లో కొట్లాడి ఒప్పించాడని కొనియాడారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి, సహచర మంత్రులతో సంప్రదించి నూకల రాంచంద్రారెడ్డి పేరు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా గుర్తుండిపోయేలా చేస్తానని అన్నారు. వారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అనంతరం ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మురళినాయక్, దివంగత నూకల రాంచంద్రారెడ్డి మనువరాలు రాధికరెడ్డి, మాజీ ఎంపి వినోద్‌కుమార్, మాజీ ఎంపి సీతారాంనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఖమ్మం ఎంపి రఘురాంరెడ్డి, ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, భరత్ చందర్‌రెడ్డి, మాజీ ఎంపి సురేందర్‌రెడ్డి, ఇల్లందు ఎమ్మెల్యే కనకయ్యలు రాంచంద్రారెడ్డి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డివో గణేష్, మున్సిపల్ కమిషనర్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సంస్థ అభివృద్ధికి రూ.100 కోట్లు

## గిరిజన సహకార సంస్థ చైర్మన్ తిరుపతి

**హైదరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త:** గిరిజన సహకార సంస్థ (జీసీసీ) అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ గిరిజన కో ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (జీసీఎఫ్‌డీసీ) చైర్మన్ కోట్నాక్ తిరుపతి తెలిపారు. ఇందుకుగాను రూ.100 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతూ గిరిజన సహకార సంస్థకు చెందిన కొందరు అధికారులు, ఉద్యోగుల అవినీతి ఆరోపణలపై విచారణ జరుగుతోందని, అవి రుజువైతే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
గిరిజనుల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల్లో భాగంగా అటవీ ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పడం, గిరి బ్రాండ్ ఉత్పత్తుల మార్కెటింగ్‌తో పాటు, శిథిలావస్థలో ఉన్న డీఆర్ డిపోలకు కొత్త భవనాలు నిర్మిస్తామన్నారు. ఇప్పటికే ఉన్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను అప్‌గ్రేడ్ చేసి వ్యాపారాన్ని మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు.
గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన గిరిజన సహకార సంస్థ ప్రస్తుత ప్రభుత్వ హయంలో ఆర్థికావృద్ధిలో పురోగతి సాధించినట్లు వివరించారు.
గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రూప్ 4 నియామకాల ద్వారా 65 మందిని సంస్థకు కేటాయించి సిబ్బంది కొరతను తీర్చినట్లు పేర్కొన్నారు.
ఉద్యోగులకు రావాల్సిన డీఏలు, ఐఆర్‌లను మంజూరు చేయడమే కాకుండా, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు కల్పించి, సిబ్బందికి నూరు శాతం వేతనాలు అందించినట్లు తెలిపారు.

# టెట్ హాల్‌టికెట్లు విడుదల

## 2,37,754 దరఖాస్తులు

## జనవరి 3 నుంచి 20 వరకు పరీక్షలు

## ఫిబ్రవరి రెండో వారంలో ఫలితాలు

**హైదరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరగనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) పరీక్షల హాల్ టికెట్లను విడుదల చేశారు. అభ్యర్థులు శనివారం నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. మొదటి రోజు 15 శాతానికిపైగా అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నట్టు తెలుస్తోంది. టెట్-2026 కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2,37,754 దరఖాస్తులు వచ్చాయి. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు కూడా టెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. టెట్ పరీక్షలను జనవరి 3 నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. అందులో భాగంగా జనవరి 3, 4, 5, 6, 8, 9, 11 తేదిల్లో మేజర్ పరీక్షలు జరగనుండగా జనవరి 19, 20 తేదిల్లో మైనర్ పరీక్షలు జరగనున్నాయి.
పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వహించనున్నారు. ఉదయం సెషన్ 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ పరీక్షలను 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తారు. ఉదయం పరీక్షలకి 8.45 గంటలకు గేట్లను మూసేయనుండగా.. మధ్యాహ్నం సెషన్‌లో 1.45 గంటలకు క్లోజ్ చేయనున్నారు. పరీక్షల ఫలితాలను ఫిబ్రవరి రెండో వారంలో విడుదల చేయనున్నారు. టెట్ పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2,37,754 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల నుంచి 71,670 దరఖాస్తులు వచ్చాయి. టెట్ దరఖాస్తుల్లో ఇప్పటికే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారి నుంచి 71,670 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వ స్కూల్స్‌లో పనిచేస్తున్న వారు 49,236 మంది టెట్-2026 పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్నారు. పేపర్-1కి 85,538 దరఖాస్తులు రాగా, పేపర్-2కి 1,52,216 దరఖాస్తులు వచ్చాయి.

# ఖనిజేతరాల ద్వారా ఎనర్జీ 500 గిగావాట్ల లక్ష్యం

## కొత్త విద్యుత్ ప్రాజెక్టులకు అందలం

## 18 యేళ్లపాటు ట్రాన్స్‌మిషన్ చార్జీల మాఫీ

## రుణాల మాఫీ, రాయితీలపై మార్గదర్శకాలు

**హైదరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త:** దేశంలో ఖనిజేతర ఎనర్జీ ఆధారిత వనరుల ద్వారా 500 గిగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన యూనిట్లను ఏర్పాటు చేసేందుకు కేంద్రం ప్రణాళికను రూపొందించింది. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అధికారవర్గాల వివరాల ప్రకారం కొత్త జల విద్యుత్ ప్రాజెక్టుల కోసం 18 ఏళ్ల పాటు వీలింగ్ విద్యుత్‌పై అంతరాష్ట్ర ట్రాన్స్‌మిషన్ చార్జీలను మాఫీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే సోలార్, విండ్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులకు రుణాల మాఫీ అందుబాటులో ఉంది. ఈ ప్రణాళికలో భాగంగా వచ్చే 2030 సంవత్సరం నాటికి ఖనిజేతర ఎనర్జీ ఆధారిత వనరుల నుండి 500 గిగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉండాలని అందులో స్పష్టం చేసింది. పునరుత్పాదక ఇంధన వనరుల నుండి విద్యుత్ అవసరాన్ని సాధించేందుకు కొత్త జల విద్యుత్ ప్రాజెక్టుల నుండి ఉత్పత్తి అయ్యే విద్యుత్ ప్రసారంపై ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టం (ఐఎస్‌టిఎస్) చార్జీలను రద్దు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు సైతం జారీ చేసింది. అంతంత మాత్రంగా ఉండే సౌర, పవన విద్యుత్‌ను ఏకీకృతం చేయడానికి జల విద్యుత్‌ప్రాజెక్టులు అవసరమని తెలిపింది. అయిత సౌర, పవన్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులకు అందించిన అంతరాష్ట్ర ప్రసార చార్జీల మినహాయింపును జల విద్యుత్ ప్రాజక్టులకు విస్తరించ లేదు. ఈ వ్యత్యాసాన్ని తొలగించడానికి, హైడ్రో ప్రాజెక్టులకు లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్‌ను అందించడానికి ఇక నుండి కొత్త జల విద్యుత్ ప్రాజెక్టులకు ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టం (ఐఎస్‌టిఎస్) చార్జీల మినహాయింపును సైతం పొడిగించాలని విద్యుత్ మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో చేపట్టే విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల నిర్మాణం పనులు మంజూరు చేయడంతోపాటు, వాటికి సంబంధించి 2025 జూన్ 30వ తేదీ నాటికి లేదా అంతకు ముందు వరకూ విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పిపిఎ) కుదుర్చుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. అయితే 2025 జూన్ 30వ తేదీ తర్వాత నిర్మాణ పనులు మంజూరు చేయబడిన విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లకు పిపిఎ విషయంలో సంబంధిత ప్లాంట్ల నుండి విద్యుత్ ప్రసారం కోసం ఐఎస్‌టిఎస్ చార్జీలు వివిధ దశలలో ఉన్న వాటికి నిర్ణీత విధంగా వసూలు చేయబడతాయని స్పష్టంగా పేర్కొంది. కాగా పనులు మంజూరు చేయబడిన, పిపిఎలు 2025 జూన్ 30కు జూలై 1వ తేదీకి మధ్య సంతకం చేయబడిన జల విద్యుత్ ప్రాజెక్టుల కోసం 25 శాతం వరకూ ఐఎస్‌టిఎస్ చార్జీలు వసూలు చేయబడతాయి. అదే విధంగా 2026 జూలై 1 నుండి 2027 జూలై 1వ తేదీ మధ్య కాలంలో విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల నిర్మాణ పనులు మంజూరు చేయబడి, విద్యుత్ సరఫరాకై పిపిఎ సంతకాలు చేయబడిన ప్రాజెక్టులకు 50 శాతం, 2028 జూన్ 30వ తేదీ వరకూ అయితే 75 శాతం చొప్పున ఐఎస్‌టిఎస్ చార్జీలు అమ లు చేయనున్నట్లు వెల్ల డించింది. ఇక 2028 జూలై 1వ తేదీ నుండి హైడ్రో విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులకు 100 శాతం ఐఎస్‌టిఎస్ చార్జీలు వర్తిస్తాయని ప్రణాళికలో పేర్కొన్నట్లు విద్యుత్ మంత్రిత్వ శాఖ అధికారులు తెలియచేశారు.

# ధనం మొత్తం ఢిల్లీకి.. అప్పులన్నీ తెలంగాణకు

## కెసిఆర్ బయటకు రాగానే కాంగ్రెస్ నేతల్లో వణుకు

### బిఆర్ఎస్ సర్పంచ్‌లను సన్మానించిన కెటిఆర్

**మహబూబాబాద్ ప్రతినిధి,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ ధనాన్ని మొత్తం ఢిల్లీకి తీసుకెల్లి అప్పులు మాత్రం తెలంగాణపై మోపుతున్నారని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంనరతి, ఎమ్మెల్యే కె.తారకరామారావు అన్నారు. శనివారం మహబూబాబాద్‌లోని పిఎస్ఆర్ గార్డెన్‌లో జిల్లా పార్టీ అధ్యక్షురాలు కవిత అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై బిఆర్ఎస్‌పార్టీ నూతన సర్పంచ్, ఉపసర్పంచ్‌లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచకపడ్డారు. తాను మాట్లాడినట్లు నేను మాట్లాడలేనని సంస్కారం అడ్డొస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాదించిన నాయకుడు, రాష్ట్రానికి ప్రజల చేత ఎన్నుకోబడిన ముఖ్యమంత్రి కేసీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. నీకు ఒక్క భాష వస్తే నేను మూడు భాషలల్లో తిట్టగలనని నాకు మా తల్లిదండ్రులు సంస్కాంరాన్ని నేర్పించారన్నారు. రేవంత్ తాను ముఖ్యమంత్రి అని మరిచిపోయారని తన భాషను మార్చుకోవాలని హితవుపలికారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామాలు దుర్బరంగా తయారైయ్యాయని, పంచాయతీ ట్రాక్టర్‌లలో పెట్రోలు పోయడానికి కూడా గతిలేదని గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాంగ్రెస్ సర్పంచ్‌ల కంటే బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్‌లు అభివృద్ధి చేసి చూపించాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో తిరిగి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలన్నదే రాష్ట్ర ప్రజల ఆకాంక్ష అని అన్నారు. రాబోయే ఎంపిటిసి, జెడ్పిటిసి, మున్సిపాలిటి ఎన్నికల్లో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తమ తడాకా చూపించాలని పిలుపునిచ్చారు. పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అనేక స్థానాలను కైవసం చేస్తున్నారని రాష్ట్ర వ్యాప్తంగా 45శాతం మేరకు బిఆర్ఎస్ విజయం సాదించిందన్నారు. ప్రజల్లో మార్పు వచ్చిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ప్రజల్లో తిరుగూటు ప్రారంభమైందన్నారు. బిఆర్ఎస్ హాయంలో రైతుబందు 73వేల కోట్ల నగదు 70లక్షల ఖాతాల్లో జమ అయ్యాయని నేడు అట్టి పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ హయాంలో రైతుబంధు వస్తదో రాదోనని రైతులు ఎదురుచూడాల్సి వస్తుందన్నారు. మహబూబాబాద్, డోర్నకల్ ప్రజలు గత ఎన్నికల్లో పోతే మా ఒక్క సీటు పోతుందని అధికారంలో మాత్రం కేసీఆర్ ఉంటాడని అనుకున్నారని అందరూ అదేరీతిలో ఆలోచించడం వలన కేసీఆర్ ముఖ్యమంత్రి ఎలా అవుతాడని అర్ధంకాలేదా అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ హాయంలో 3400తండాలను గ్రామపంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గిరిజనుల రిజర్వేషన్‌ను 6నుండి 10శాతానికి పెంచామని గుర్తుచేశారు. 420హామిలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రజల అరచేతిలో వైకుంఠం చూపించి గద్దెనెక్కారని అన్నారు. బిఆర్ఎస్ సర్పంచ్‌లు ఎలాంటి ప్రలోభాలకు తలొంచ్చద్దని మీకు వచ్చే నిధులు నేరుగా కేంద్రం నుండి మీ పంచాయతీ ఖాతాల్లో జమ అవుతాయని సూచించారు. మానుకోట మాజీ మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి తండ్రి శేషారెడ్డి ఇటీవల మరణించగా వారి ఇంటికి వెళ్లి ఆయన తండ్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి పరామర్శించారు. అనంతరం మాజీ మంత్రి నూకల రాంచందర్‌రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచందర్, మాజీ మంత్రులు దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



సర్పంచ్‌ను సన్మానిస్తున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

# నిజామాబాద్‌లో దోపిడీ దొంగల బీభత్సం..

### 2 ఏటీఎంల్లో సుమారు రూ.35 లక్షలు లూటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, డిసెంబరు 27:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో దోపిడి దొంగలు రెచ్చిపోయారు. ముఖాలకు మాస్కులు ధరించి, చేతులకు గ్లౌజులు పెట్టుకొని ఏటీఎంలు లూటీ చేశారు. శనివారం తెల్లవారుజామున కారులో వచ్చిన దుండగులు.. గ్యాస్ కట్టర్ల సహాయంతో ఏటీఎంలను కట్ చేసి అందులోని నగదు దోచుకుపోయారు. నిజామాబాద్ టౌన్ 4 పోలీస్ స్టేషన్ పరిధిలోని పాంగ్రా బ్రాంచ్‌కు సంబంధించిన డెవలప్‌మెంట్ క్రెడిట్ బ్యాంక్ ఏటీఎంలోకి ప్రవేశించిన దుండగులు గ్యాస్ కట్టర్ సహాయంతో మెషిన్‌ను కట్ చేసి సుమారు రూ.25 లక్షలు దోచుకున్నారు. అలాగే నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వర్ని చౌరస్తా వద్ద గల ఎస్‌బీఐ ఏటీఎంలోనూ చోరీకి పాల్పడ్డారు. ముందుగా ఏటీఎం సెంటర్‌లో ఉన్న సీసీ కెమెరాలపై స్ప్రే చేసి రికార్డు కాకుండా జాగ్రత్త పడ్డ దుండగులు,దాదాపు రూ.10 లక్షల వరకు దోచుకుపోయినట్లు తెలిసింది. ఈ రెండు ఘటనా స్థలాలను కామారెడ్డి ఎస్పీ, ఇంచార్జి సీపీ ఎం.రాజేశ్ చంద్ర పరిశీలించారు. చోరీ జరిగిన తీరును పరిశీలించిన అనంతరం.. రెండు బ్యాంకుల మేనేజర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దోపిడీ జరిగిన ఏటీఎం లోపలి, పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీని సేకరించి, విశ్లేషించాలని ఇంచార్జి సీపీ ఆదేశించారు. అలాగే క్లూస్ టీమ్, సాంకేతిక నిపుణులు, స్థానిక పోలీసు బృందాలతో దర్యాప్తు చేస్తున్నారు. ఏటీఎంల దోపిడీతో అప్రమత్తమైన పోలీస్ యంత్రాంగం నిఘా కట్టుదిట్టం చేశారు. జిల్లాలోకి వచ్చే, పోయే పాయింట్లలో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు.





# జెన్‌జీ మున్సిపల్ చైర్‌పర్సన్..

### చరిత్ర సృష్టించిన దియా!

**తిరువనంతపురం, డిసెంబరు 27:** కేరళలో ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో పాలా మున్సిపాలిటీలోని 15వ వార్డు నుంచి 21 ఏళ్ల దియా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, విజయం సాధించారు. ఆమె తండ్రి అంకుల్ కూడా ఈ ఎన్నికల్లో గెలుపొందారు. అయితే ఫలితాల తర్వాత ఏ ఒక్క పార్టీకి పూర్తిస్థాయి మెజారిటీ లభించలేదు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎల్‌డిఎఫ్‌కు 12 సీట్లు, కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్‌కు 10 స్థానాలు దక్కాయి. స్వతంత్రులు నలుగురు గెలవగా అందులో ముగ్గురు దియా కుటుంబానికి చెందిన వారే. మరొకరు కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి మాయా రాహుల్. దాంతో 26 మంది సభ్యులు ఉన్న పాలక మండలిలో స్వతంత్రులే కింగ్ మేకర్స్ అయ్యారు. కొన్ని రోజుల చర్చల తర్వాత దియా కుటుంబం కాంగ్రెస్‌కు మద్దతు పలికింది. వీరితో పాటు రెబల్ అభ్యర్థి హస్తం వైపే మొగ్గు చూపింది. దాంతో దియాను చైర్‌పర్సన్ పదవి, మాయాను వైస్ చైర్‌పర్సన్ పదవి వరించాయి.

ఈ పదవి దక్కడంపై దియా మీడియాతో మాట్లాడుతూ హర్షం వ్యక్తం చేశారు. దీర్ఘకాలిక ప్రణాళికతో మున్సిపాలిటీలో ప్రాథమిక సదుపాయాలు అందేలా చూస్తాను. నా తండ్రి విజయం సాధించడం ఇది అయిదోసారి. ప్రజల కోసం ఆయన చేస్తోన్న సేవను చిన్ననాటి నుంచి చూస్తున్నాను. అదే నాకు స్ఫూర్తి అని చెప్పారు దియా. మద్రాస్ క్రిస్టియన్ కాలేజ్ నుంచి ఆర్థికశాస్త్రంలో పట్టా పొందారు. ఒక ప్రజానేతగా విధులు నిర్వరిస్తూనే ఉన్నత విద్యను అభ్యసిస్తానని చెప్పి, చదువుపై తనకున్న అభిరుచిని వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే గతంలో కూడా స్థానిక సంస్థల విషయంలో కేరళ వార్తల్లో నిలిచింది. 2020లో తిరునంతపురం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా ఆర్యా రాజేంద్రన్ నియమితులయ్యారు. అప్పుడు ఆమె వయసు 21 యేళ్లే. పిన్న వయసులోనే మేయర్‌గా ఎన్నికై యావత్ దేశం దృష్టిని ఆకర్షించారు.

# అద్వానీ కాళ్ల దగ్గర కూర్చున్న వ్యక్తి నేడు ప్రధాని కాగలిగారు!

### బిజెపి, ఆర్ఎస్ఎస్‌లను ప్రశంసిస్తూనే దిగ్విజయ్ సెటైర్లు

**న్యూఢిల్లీ, డిసెంబరు 27:** కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు దిగ్విజయ్ సింగ్ బీజేపీ, ఆరెస్సెస్‌లను ప్రశంసిస్తూ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపడంతో ఆయన వెంటనే యూటర్న్ తీసుకున్నారు. తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని, తాను కేవలం వారి సంస్థాగత బలాన్ని మాత్రమే మెచ్చుకున్నానని వివరణ ఇచ్చారు. అంతకుముందు ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీతో కలిసి ఉన్న 1996 నాటి ఫొటోను దిగ్విజయ్ సింగ్ ఎక్స్‌లో పంచుకున్నారు. “ఆరెస్సెస్ స్వయంసేవకులు, జనసంఘ్ కార్యకర్తలు ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి స్థాయికి ఎదగడం వారి సంస్థాగత శక్తికి నిదర్శనం అద్వానీ కాళ్ల వద్ద కూర్చున్న నేత ఇవాళ ప్రధానిగా ఉన్నారని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. క్షేత్రస్థాయి కార్యకర్తలను అగ్ర నాయకత్వ స్థానాలకు ప్రోత్సహించడాన్ని ఆయన పరోక్షంగా ప్రశంసించారు. అయితే, ఈ పోస్టుపై తీవ్ర విమర్శలు రావడంతో ఆయన మీడియా ముందు స్పందించారు. నేను సంస్థాగత నిర్మాణాన్ని సమర్థిస్తాను. కానీ, ఆర్ఎస్ఎస్, ప్రధాని మోదీలకు వ్యతిరేకిని. నేను వారి సంస్థాగత బలాన్ని మాత్రమే పొగిడాను. బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాలను ఎల్లప్పుడూ వ్యతిరేకిస్తూనే ఉన్నానని స్పష్టం చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం జరుగుతున్న సమయంలోనే దిగ్విజయ్ ఈ ట్వీట్ చేయడం గమనార్హం. తన పోస్టుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలను ట్యాగ్ చేయడంతో ఇది పార్టీ నాయకత్వానికి పంపిన అంతర్గత సందేశమా అనే ఊహాగానాలకు తెర లేపింది. ఈ వివాదంపై కాంగ్రెస్ ఎంపీ కుమారి సెల్జా స్పందిస్తూఎవరూ ఎవరినీ పొగడలేదని, తప్పుడు ప్రచారం చేయవద్దని అన్నారు. మరోవైపు బీజేపీ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ ఈ అంశంపై రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌లో నియంతృత్వ పోకడలు ఉన్నాయంటూ దిగ్విజయ్ చేసిన వ్యాఖ్యలపై రాహుల్ ధైర్యంగా స్పందిస్తారా అని ప్రశ్నించారు.



ఆరెస్సెస్‌లో సాధారణ కార్యకర్తగా పనిచేసి, అద్వానీ వంటి నాయకుడి పాదాల వద్ద నేలపై కూర్చున్న నరేంద్ర మోదీ ఆ తర్వాత ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా ఎదిగారని కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టారు. గుజరాత్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో అద్వానీ కుర్చీలో కూర్చుని ఉండగా, నరేంద్ర మోదీ ఆయన కాళ్ల వద్ద కూర్చున్నప్పటి ఒకప్పటి ఫొటోను ఆయన పంచుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధాని నరేంద్ర మోదీని ప్రశంసిస్తుండటం కాంగ్రెస్ పార్టీకి ఆగ్రహం తెప్పిస్తోంది. ఇప్పుడు థరూర్ బాటలో దిగ్విజయ్ సింగ్ బీజేపీ, ఆరెస్సెస్‌పై ప్రశంసలు కురిపించడం గమనార్హం. నేను ఇటీవల ఒక ఫొటోను చూశాను. అది చాలా ఆసక్తికరంగా ఉంది. ఆరెస్సెస్‌లో సామాన్య కార్యకర్తలా, నాయకుల పాదాల వద్ద నేలపై కూర్చున్న వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానమంత్రిగా ఎలా ఎదిగారో చూడండి. ఇది ఆ సంస్థ శక్తి అని ఆయన పేర్కొన్నారు. ఈ పోస్టుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ట్యాగ్ చేశారు.




# ప్రభుత్వ ఖర్చుతో బాగేశ్వర్‌బాబా పర్యటనలు!

**నయారాయ్‌పూర్, డిసెంబరు 27:** బాగేశ్వర్‌బాబాగా విస్తృత ప్రచారం పొందిన ధీరేంద్ర కృష్ణశాస్త్రి ఛత్తీస్‌గఢ్‌పర్యటన రాష్ట్ర రాజకీయాలను కుదిపేసింది. ప్యటనలో బాగేశ్వర్‌బాబా ప్రభుత్వ విమానంలోప్రయాణించడాన్ని విపక్షాలు విమర్శలతో దాడిచేసాయి. ఛత్తీస్‌గఢ్‌కు వచ్చిన ఆయన్ను ఆహ్వానించే క్రమం లో ఒక పోలీసు అధికారి బాబా కాళ్లకు నమస్కరిస్తున్న విడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బాగేశ్వర్‌బాబా విమానాశ్రయంలో దిగిన వెంటనే అక్కడ ఉన్న ఒక పోలీస్ అధికారి షూ, టోపీ తీసి బాబా కాళ్లతకు నమస్కరించినట్లుకనిపించింది. పోలీస్ అధికారి ఈ విధంగా మతప్రబోధకుడి కాల్లకు నమస్కరించడం సరైన చర్య కాదని ప్రతిపక్ష కాంగ్రెస్‌నేతలు విమర్శలు గుప్పించారు. ఎలాంటి అధికారిక, రాజ్యాం గపరమైన పదవిలేని బాగేశ్వర్‌బాబా ప్రయాణానికి ప్రభుత్వ విమానాలు ఎలా వినియోగిస్తారని ప్రశ్నిస్తున్నారు. ప్రజలనుంచి పన్నులరూపంలో వచ్చిసొమ్ము రాష్ట్రప్రభుత్వం అనవసర ఖర్చులుచేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేసారు. పోలీస్ అదికారిపై వస్తున్న విమర్శలకు రాయ్‌పూర్ సీనియర్ పోలీస్ సూపరింటెండెంట్ ఉలాల్‌ఉమేద్‌సింగ్ స్పందించారు. ఘటన సమయంలో పోలీసు అధికారి పూర్తి యూనిఫాంలో లేరని అప్పటికే ఆతడు టోపీ, షూ తీసివేసినందున సర్వీసు నిబంధనలను ఉల్లంఘించినట్లు భావించలేమన్నారు.

# తైవాన్‌లో మరోసారి తీవ్రస్థాయి భూకంపం

### రిక్టర్ స్కేలుపై 7.1 తీవ్రత నమోదు

**బ్యాంకాక్, డిసెంబరు 27:** తైవాన్ లో మరోసారి భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్ పై 7.1 తీవ్రత నమోదైంది. ఈ విషయాన్ని సెంట్రల్ వెదర్ బ్యూరో వెల్లడించింది. స్థానిక కాలమానం ప్రకారం నార్త్ ఈస్ట్ తీర ప్రాంతం అయిన ఇలాన్ లో ఈ భూకంపం సంభవించినట్లు పేర్కొంది. ఇలాన్ కౌంటీ హాల్ కు తూర్పున 32.3 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రీకృతం అయినట్టు సెంట్రల్ వెదర్ బ్యూరో పేర్కొంది. అలాగే భూకంపం ధాటికి ఐలాండ్ దేశంలోని పలు ప్రాంతాల్లో ప్రకంపనలు నమోదయ్యాయి. తైవాన్ లో మరోసారి భారీ భూకంపం సంభవించింది. మూడు రోజుల క్రితం ఆగ్నేయ తీరప్రాంత కౌంటీ అయిన టైటుంగ్ లో భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి తైవాన్ లో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్ పై 7.1 తీవ్రత నమోదైనట్లు సెంట్రల్ వెదర్ బ్యూరో వెల్లడించింది. ఈ మేరకు తైవాన్ కు చెందిన ఫైర్ ఏజెన్సీ ఎక్స్ వేదికగా సేఫ్టీ గైడ్ లైన్స్ ప్రకటించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. భూకంప తీవ్రత ఉన్న ప్రాంతంలోని ప్రజల్ని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. అలాగే స్థానికులు ప్రమాదకరమైన వస్తువుల దగ్గర ఉండకూడదని షూస్, టార్చ్ బెడ్స్ దగ్గరే పెట్టుకోవాలని సూచిస్తున్నారు. ఇక తైవాన్ ద్వీపం సిస్మిక్ జోన్ ప్రాంతంలో ఉంది. టెక్టోనిక్ ప్లేట్స్ వల్ల ఈ ప్రాంతంలో భూకంపాలు ఎక్కువగా సంభవిస్తుంటాయి. 2016 లో దక్షిణ తైవాన్ లో భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. ఈ భూకంపంలో 100 మందికి పైగా మృతి చెందారు. అంతకుముందు 1999 లో 7.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. 2 వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. అలాగే మూడు రోజుల క్రితం కూడా తైవాన్ లో భూకంపం సంభవించింది. రిక్టారు స్కేలుపై భూకంపం తీవ్రత 6.1గా నమోదైంది.





# కెనడాలో భారత్ మహిళల కోసం ‘వన్‌స్టాప్ సెంటర్ ఫర్ ఉమన్’

**టొరంటో, డిసెంబరు 22:** కెనడాలోని భారతీయ మహిళలకు సెక్యూరిటీ, భరోసా కల్పించే దిశగా టొరంటోలోని భారత కాన్సులేట్ జనరల్ ఒక గొప్ప అడుగు వేసింది. ఆపదలో ఉన్న భారతీయ మహిళలకు అండగా నిలిచేందుకు వన్ స్టాప్ సెంటర్ ఫర్ వుమెన్ (ఓఎస్‌సీడబ్ల్యూ)ను ప్రారంభించింది. కెనడాలో నివసిస్తున్న భారతీయ మహిళలు ఎదుర్కొనే గృహ హింస, కుటుంబ వివాదాలు, వేధింపులు, చట్టపరమైన సవాళ్లను పరిష్కరించడమే లక్ష్యంగా ఈ వన్ స్టాప్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవల టొరంటోలో ఒక భారతీయ మహిళ హత్యకు గురైన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ సేవలను మరింత వేగవంతం చేసింది. బాధిత మహిళలకు చాలా సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. మానసిక ఒత్తిడిలో ఉన్న మహిళలకు తక్షణమే కౌన్సిలింగ్ ఇస్తారు. వారికి నైతికంగా మద్దతు ఇస్తారు. కెనడా స్థానిక చట్టాలకు లోబడి న్యాయ సలహాలు, సహాయం చేస్తారు. స్వచ్ఛంద సంస్థల (ఎన్జీఓల) సమన్వయంతో కెనడాలో ఉన్న భారతీయులకు సామాజిక మద్దతును కల్పిస్తారు. భారత ప్రభుత్వ నిబంధనల ప్రకారం కెనడాలో అత్యంత అవసరమైన వారికి నియమిత పద్ధతిలో ఆర్థిక తోడ్పాటును అందిస్తారు. ఈ వన్ స్టాప్ సెంటర్ ఫర్ వుమెన్ పూర్తిగా ఒక మహిళా అడ్మినిస్ట్రేటర్ పర్యవేక్షణలో పనిచేస్తుంది. దీనివల్ల బాధిత మహిళలు తమ సమస్యలను ఎలాంటి సంకోచం లేకుండా షేర్ చేసుకునే అవకాశం కల్పిస్తారు. అత్యవసర సమయాల్లో సంప్రదించడానికి 24 గంటలపాటు పనిచేసే హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ సెంటర్ సేవలు కేవలం భారతదేశ పాస్‌పోర్టు కలిగిన మహిళలకు మాత్రమే వర్తిస్తాయి. కెనడాలో ఉన్న భారతీయ మహిళలు ఎవరైనా ఆపదలో ఉంటే ఫోన్, మెయిల్ ద్వారా టొరంటోలోని భారత కాన్సులేట్‌ను సంప్రదించవచ్చు. ఇందుకోసం +1 (437) 552 3309 హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేశారు. ఈమెయిల్ ఐడీఓఎస్‌సిడాట్ టొరంటో ఎంఇఎడాట్ జిఒవి డాట్ ఇన్‌ను కేటాయించారు.



# అమెరికాను వణికిస్తున్న ‘డెవిన్’ మంచు తుపాను

### వందలాదిగా విమాన సర్వీసులు రద్దు

**వాషింగ్టన్, డిసెంబరు 27:** అమెరికా ఈశాన్యరాష్ట్రాలను ప్రస్తుతం డెవిన్ మంచుతుపాను వణికిస్తోంది. హాలిడే సీజన్ నడుస్తున్నవేళ ఈ తుపానుకు జడిసి క్రిస్మస్, న్యూఇయర్ వేడుకలకు వచ్చే సందర్శకులు రావడం మానుకున్నారు. తుపాను బీభత్సానికి విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు సెలవులు ఇచ్చేసారు. అసలే శీతాకాలం దీనికితోడు విపరీతంగా మంచు పడుతోంది. ఈ తుపానుకు జడిసి ప్రజలు హాలిడేను ఎంజాయ్ చేసేందుకు ఇతర ప్రాంతాలకు తరలివెళ్తున్నాయి. ఈ సెలవుల వేళ వింటర్ స్టార్మ్ బీభత్సం సృష్టిస్తున్నాయి. అమెరికాలోని ఈశాన్య రాష్ట్రాలను డెవిన్‌అనే భారీ మంచు తుపాను అతలాకుతలం చేస్తోంది. క్రిస్మస్ పండుగ ముగిసిన వెంటనే విరుచుకుపడటంతో ప్రయాణ వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. ఈ తుపాను కారణంగా దాదాపు 1,800కిపైగా విమానాలు రద్దయ్యాయి. 10 వేల విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ప్రకారం శుక్రవారం రాత్రి సమయానికి దేశవ్యాప్తంగా 1,802 విమానాలు రద్దుకాగా, 22,349 ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో న్యూయార్క్‌లోని జాన్ ఎఫ్.కెన్నెడీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, లాగ్వార్డియా విమానాశ్రయం, డెట్రాయిట్ మెట్రోపాలిటన్ వేన్ కౌంటీ విమానాశ్రయం సహా ఈశాన్య, మిడ్‌వెస్ట్‌లోని విమానాశ్రయాల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జెట్‌బ్లూ ఎయిర్‌లైన్స్ ఒక్కటే తన షెడ్యూల్‌లో 22 శాతం అంటే సుమారు 225కు పైగా విమానాలను రద్దు చేసింది. ఇతర ప్రధాన విమానయాన సంస్థలు కూడా వందలాది సర్వీసులను నిలిపివేశాయి. డెల్టా ఎయిర్‌లైన్స్ 186 విమానాలను, రిపబ్లిక్ ఎయిర్‌వేస్ 155 విమానాలను, అమెరికన్ ఎయిర్‌లైన్స్ 96, యునైటెడ్ ఎయిర్‌లైన్స్ 82 విమానాలను రద్దు చేసింది. తుపాను ప్రభావం న్యూయార్క్ నగరంతో పాటు లాంగ్ ఐలాండ్, కనెక్టికట్, పెన్సిల్వేనియా, ఉత్తర న్యూజెర్సీ ప్రాంతాలపై అధికంగా ఉంది. జాతీయ వాతావరణ విభాగం సుమారు 2.3 కోట్ల మందికి వింటర్ స్టార్మ్ హెచ్చరికలు జారీ చేసింది. న్యూయార్క్ నగరంలో 4 నుంచి 8 అంగుళాల మంచు కురుస్తుందని, ఇతర ప్రాంతాల్లో అడుగు వరకు హిమపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈశాన్య ప్రాంతంలో చాలా వరకు మంచు, తుపాను హెచ్చరికలు జారీ చేసింది.

# సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలను పునరుద్ధరించాలి

### సంస్థ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చిన మాజీమంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 27:** తక్షణమే మెడికల్ బోర్డు పెట్టి మానవతా దృక్పథంతో డిపెండెంట్ ఉద్యోగాలను పునరుద్ధరించాలని బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల సమస్యలపై డైరెక్టర్ గౌతమ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తక్షణమే మెడికల్ బోర్డు పెట్టి సింగరేణి కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వండి లేదంటే వారందరితో ప్రజా భవన్ ముట్టడి చేస్తాం మని హెచ్చరించారు. డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలను సింగరేణి డైరెక్టర్‌కు దృష్టికి తీసుకెళ్లామని, గతంలో చంద్రబాబు డిపెండెంట్ ఉద్యోగాలను రద్దు చేస్తే ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చాక డిపెండెంట్ ఉద్యోగాలను కెసిఆర్ పునరుద్ధరించారని పేర్కొన్నారు. 40 వేల సింగరేణి ఉద్యోగుల్లో 20 వేల మంది డిపెండెంట్ ఉద్యోగులే.. వారిని నియమించి ఉద్యోగులను, సంస్థను కాపాడింది కెసిఆర్ అని చెప్పారు. నెలకు రెండు సార్లు మెడికల్ బోర్డు, అలియాస్ పేర్లను కన్సిడర్ చేస్తాం అంటూ హామీలను ఇచ్చి రెండేళ్లలో రెండు సార్లు మెడికల్ బోర్డు పెట్టారు, కార్మికులపై పగపట్టినట్టు రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. కాళ్ళు లేని వారిని, కండ్లు కనిపించని వారిని, గుండెకు బైపాస్ సర్జరీ అయినా వారిని కూడా ఉద్యోగం చెయ్యాలని ఇబ్బంది పెడుతున్నారు ఇది ప్రజా ప్రభుత్వం కాదు.. కార్మిక కంటక ప్రభుత్వం, కార్మికులను గోసపెట్టుకునే ప్రభుత్వం, మానవత్వం లేని ప్రభుత్వం అని విమర్శలు చేశారు. తక్షణమే మెడికల్ బోర్డు పెట్టి మానవతా దృక్పథంతో డిపెండెంట్ ఉద్యోగాలను పునరుద్ధరించాలని ప్రభుత్వన్నీ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. రేవంత్ రెడ్డి హయాంలో సింగరేణిని ప్రైవేట్ పరం చేసే కుట్ర జరుగుతుంది. కరంట్‌కు బొగ్గును తీసుకోని బిల్లులు చెల్లించడం లేదు. సింగరేణి అప్పుల పాలయ్యే పరిస్థితి ఉందన్నారు. జీతాలకు డబ్బులు లేక ఓడి తీసుకుని జీతాలు ఇచ్చే పరిస్థితి. రేవంత్ వచ్చాక రూ.50,000 కోట్ల అప్పుల్లో సింగరేణి ఉందన్నారు. ఆర్థిక మంత్రిగా ఉండి సింగరేణి గొంతు కోయడం తగునా భట్టి విక్రమార్క, నీ సోకుల కోసం ఫుట్ బాల్ ఆడటం కోసం సింగరేణి సొమ్ము కోట్ల రూపాయలను ఎలా ఖర్చు చేస్తారు. నీ అయ్య సొమ్మా అది రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. రేపు బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఫుట్ బాల్ మ్యాచ్ కోసం వాడిన రూ.కోట్ల పై ఎంక్వయిరీ వేసి కారకులను బొక్కలో వేయిస్తాం హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో లో సింగరేణికి ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలనీ డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఏడవ గ్యారంటీ ప్రజాస్వామ్యం అన్నారు. ప్రశ్నిస్తే అరెస్ట్ చేస్తున్నారు. ఉక్కు పాదంతో అణిచివేస్తున్నారు.. వారికి ధర్నా చేసే హక్కు లేదా, దరఖాస్తు ఇచ్చే హక్కు లేదా? ఇదేనా మీరు ఇస్తానన్న ఏడవ గ్యారంటీ. జర్నలిస్టులకు కేసీఆర్ 26,000 అక్రిడేషన్ కార్డులు ఇచ్చారు. రిపోర్టింగ్ జర్నలిస్టులకు, డెస్క్ జర్నలిస్టులకు అనే తేడా లేకుండా అక్రిడేషన్ కార్డులు ఇచ్చారు. మేము అధికారంలోకి వస్తే ఇండ్లు ఇస్తాం, ఇంటి స్థలాలను ఇస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి అక్రిడేషన్ కార్డులను 10 వేలకు తగ్గించడం దుర్మార్గం. బిఆర్ఎస్ పార్టీ పక్షాన దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. సోషల్ మీడియా, యూట్యూబ్ జర్నలిస్టులను టెర్రరిస్టులుగా పోల్చడం దారుణం. జర్నలిస్టుల పోరాటానికి బిఆర్ఎస్ పూర్తి మద్దతు తెలుపుతుంది. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో జర్నలిస్టుల తరఫున రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు.



మాజీమంత్రి హరీశ్‌రావు సింగరేణి కార్మికుల సమస్యలపై డైరెక్టర్ గౌతమ్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

# నకిలీ ఏజెంట్ల మోసాలకు గురి కావొద్దు

### హెచ్చరించిన అమెరికా ఎంబసీ

**న్యూఢిల్లీ, డిసెంబరు 27:** వీసా దరఖాస్తుదారులకు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో హెచ్ 1బి వీసా ప్రాసెసింగ్, రెన్యువల్స్ ఆలస్యమవుతుండటంపై యుఎస్ ఎంబసీ స్పందించింది. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకుని కొందరు నకిలీ ఏజెంట్లు మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొంది. ఎలాంటి జాప్యాలకు తావు లేకుండా వీసా లభించేలా చూస్తామంటూ ఆ నకిలీ ఏజెంట్లు దరఖాస్తుదారుల్ని సంప్రదిస్తున్నారని అప్రమత్తం చేసింది. అలాంటి హామీలను నమ్మొద్దని, దానివల్ల ఆర్థికంగా నష్టం, ప్రయాణి ప్రణాళికల్లో ఇబ్బందులు తలెత్తవచ్చని ఎక్స్ వేదికగా అడ్వైజరీ జారీ చేసింది. వీసా అపాయింట్‌మెంట్లు అధికారిక వెబ్‌సైట్ల ద్వారానే షెడ్యూల్ అవుతాయని స్పష్టం చేసింది. ఈ ప్రక్రియ ద్వారా కాకుండా ఇతర మార్గాల్లో ఎవరైనా వీసా ఇప్పిస్తామంటే అది మోసం కిందికే వస్తుందని హెచ్చరించింది.

## ముగ్గురు పట్టణ ప్రణాళికాధికారుల సస్పెన్షన్ కొనసాగింపు

**విజయవాడ,డిసెంబరు 27,ప్రభాతవార్త ప్రతినిధి:** గాజువాక ఎంఎల్ఏ పల్లా శ్రీనివాసరావుకు చెందిన వాణిజ్య సముదాయ భవనాన్ని అక్రమంగా కూల్చివేసిన ఘటనలో ముగ్గురు పట్టణ ప్రణాళిక అధికారులు సస్పెన్షన్‌ను కొనసాగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. టౌన్ సర్వే నెంబరు 5/1,5/3లో నిర్మాణంలో భవనాన్ని నిబంధనలకు విరుద్ధంగా,సంబంధిత పోర్టల్‌లో నోటీసు కూడా పెట్టకుండా 2021 ఏప్రిల్ 25న మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) అధ్వర్యంలో కూల్చివేశారు. ఎంఎల్ఏ ఫిర్యాదుపై విచారణ చేయించిన ప్రభుత్వం జీవీఎంసీ జోన్-6, డిప్యూటీ సిటీ ప్లానర్ (డిసీపీ),టి.నరేంద్రరెడ్డి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ (టీపీఎస్) ఎస్.వరప్రసాద్,టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టీపీఒ) ఎస్.వినయ్‌ప్రసాద్‌ని ఇప్పటికే సస్పెండ్ చేసింది. దీనిపై తాజాగా సమీక్షించిన ప్రభుత్వం ముగ్గురు అధికారుల సస్పెన్షన్‌ను కొనసాగించాలని నిర్ణయించింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

## రాజకీయాలు అడ్డం పెట్టుకుని రౌడీయిజం చేస్తున్నారు

### - హోం మంత్రి అనిత



**విజయవాడ,డిసెంబరు 27,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రాభివృద్ధికి ఆటంకం కల్గించేందుకు వైకాపా నేతలు ఎంతకైనా దిగజారుతున్నారని మంత్రి అనిత విమర్శించారు. జంతు బలులు చేసి...ఉన్మాదుల్లా తయారవుతున్నారని మండిపడ్డారు. బహిరంగ ప్రదేశాల్లో జంతుబలి చేయడం నేరమని, వచ్చే ఎన్నికల్లో మేం గెలిస్తే మీ పరిస్థితి ఇదేంటూ నినాదాలు ఇవ్వడం దారుణమని అన్నారు. వైకాపా శ్రేణులు ఏం చేసినా ఆ పార్టీ నాయకుడు నోరు తెరచి తప్పని చెప్పడం లేదన్నారు. శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.'రాజకీయాలను అడ్డం పెట్టుకుని రౌడీయిజం చేస్తున్నారు. జగన్ ఫ్లెక్సీలకు రక్తాభిషేకం చేయడం ఉన్మాదం కాదా? రాష్ట్రాభివృద్ధికి ఆటంకాలు కల్గించేందుకు కుట్రలు చేస్తున్నారు. చిన్న పిల్లల్ని కూడా సైకోలు,ఉన్మాదుల్లా తయారుచేస్తున్నారు. టీనేజ్ పిల్లల జీవితాలతో ఆటలు ఆడుకుంటున్నారు. రాజకీయ నేతల ఉద్దేశాలు కూడా పిల్లల తల్లిద ండ్రులు ఆలోచించాలి.ఆస్థి గురించి సొంత తల్లి,చెల్లిలిపై కేసులు పెట్టిన వారు మీ పిల్లల్ని రక్షిస్తారా? పిల్లలు రోడ్డుపైకి వచ్చి... నరుకుతాం.... చంపుతాం అంటు న్నారు. తమ పార్టీ నేతలు చేసింది తప్పని జగన్ చెప్పలేదా? వైకాపా అధికారంలో ఉన్నప్పుడు అనేక దారుణాలు జరిగాయి. అధికారం కోల్పోయినా మరో రకం దారుణాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి వాటిని ఖండించలేదంటే జగన్ అసలు మనిషేనా' అని అనిత మండిపడ్డారు.

### విజయవాడలో విషాదం.. వృద్ధుడి ప్రాణాలు తీసిన చపాతీ ముక్క

**విజయవాడ, డిసెంబర్ 27:** చపాతీ ముక్క వృద్దుడి ప్రాణాలు తీసింది...ఈ ఘటన విజయవాడ చిట్టినగర్‌లో జరిగింది. కెఎల్‌రావు నగర్‌కు చెందిన తోట ప్రసాద్ రోజు మాదిరిగా శుక్రవారం సాయంత్రం చపాతీ తినేందుకు రెడీ అయ్యారు. అయితే తినడం ప్రారంభించిన కొద్దిసేపటికే చిన్న చపాతీ ముక్క గొంతులో ఇరుక్కుంది. బయటకు తీసేందుకు ప్రసాద్ చాలా ప్రయత్నం చేశారు. ఇంతలో ఊపిరి తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కిందపడిపోయి గిలగిలా కొట్టుకుంటున్నారు. కుటుంబ సభ్యులు గమనించి నీళ్ళు తాగించారు. అయితే ఫలితం లేకపోవడంతో వెంటనే 108ని పిలిపించి ఆస్పత్రికి తరలించారు. ఈలోపే వృద్దుడు తోట ప్రసాద్ మృతి చెందారు.వైద్యులు పరీక్షించి ప్రసాద్ చనిపోయారని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

## గ్రేటర్ విజయవాడ, గ్రేటర్ తిరుపతి నిర్ణయం వాయిదా

### : మంత్రి నారాయణ

**విజయవాడ,డిసెంబరు 27,ప్రభాత వార్తప్రతి నిధి:** గ్రేటర్ విజయవాడ, గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనను ప్రస్తుతానికి రాష్ట్ర ప్రభుత్వం పక్కన పెట్టింది. విజయవాడ,తిరుపతికి గ్రేటర్ హోదాకు సంబంధించి కొన్ని ఇబ్బందులు ఉన్నాయని పురపాలక శాఖ మంత్రి నారాయణ చెప్పారు. జనగణన పూర్తయ్యే వరకు డీ లిమిటేషన్ చేయకూడదని కేంద్రం ఆదేశాలున్నాయని, అందుకే ఈ ప్రక్రియను వాయిదా వేయాలని నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. 'జనగణనకు ముందు విలీనానికి ఇబ్బందులు ఉన్నాయని సిఎం చంద్రబాబు చెప్పారు. జన గణన పూర్తయిన తర్వాతే గ్రేటర్ విజయవాడ, గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనపై నిర్ణయం ఉంటుంది' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారని మంత్రి నారాయణ తెలిపారు. రెండు నగరాలకు మహర్దశ ఉందన్నారు.విజయవాడ నగరాన్ని అద్భుతనగరంగా తీర్చిదిద్దేదిశలో ఇప్పటికే ఎన్నో నిధులు కేటాయింపుతో పాటు. పర్యాటక హంగులు కల్పించామన్నారు.

### మహిళలకు పని ప్రదేశాల్లో

# రక్షణ, భద్రత అవసరం

### - రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డా.రాయపాటి శైలజ



మీడియా సమావేశంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డా.రాయపాటి శైలజ

**విజయవాడ డిసెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళలకు పని ప్రదేశాల్లో రక్షణ, భద్రత అవసరమని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డా.రాయపాటి శైలజ అన్నారు. రాజకీయ పార్టీలు, వృత్తి పరమైన సంస్థలలో "పోష్ చట్టం" అమలు అవసరం అనే అంశంపై మహిళా కమిషన్ కార్యాలయంలో న్యాయవాదుల సౌజన్యంతో అభిప్రాయ వ్యక్తీకరణ జరిగింది. అనంతరం నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మహిళా కమిషన్ చైర్ పర్సన్ మాట్లాడుతూ సుప్రీమ్ కోర్టు పని ప్రదేశాల్లో మహిళల రక్షణ, భద్రతపై అనేక తీర్పులు వెలువరించిందన్నారు. చట్టం అమలులో ఇంకా పూర్తి స్థాయి శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని అన్నారు. పని ప్రదేశంలో రక్షణ లేదనే భావన ఇప్పటికీ ఉందని, ఇది రాజకీయ పార్టీలలోనూ, బార్ అసోసియేషన్ లలోను, విద్యా సంస్థలు తదితర అన్ని ప్రదేశాల్లో అమలు జరగాలని చర్చించడం జరిగిందన్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని చెప్పారు. అసంఘటిత రంగంలో పరిస్థితులు కూడా అంచనా వేయవచ్చన్నారు. చట్టాలను ఒక్కొక్కరు ఒక్కో విధంగా విశ్లేషణ చేయడం జరుగుతుందన్నారు. లైంగిక వేధింపులు పెరుగుతున్నాయని, అయినా కేసులు తక్కువ నమోదు అవుతున్నాయని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు, బార్ అసోసియేషన్ లు కూడా వర్క్ ప్లేస్ గా వస్తుందని చెప్పారు. లైంగిక వేధింపులు పెరగటం, మహిళల రక్షణ, భద్రత అంశాలపై ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలలో పోష్ చట్టం అమలుపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారు. విద్యా సంస్థలలో గుడ్ టచ్ బ్యాడ్ టచ్, విద్యార్థుల ఆత్మహత్యలు వంటి వాటి పట్ల ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళమని, విద్యా సంస్కరణలను ప్రభుత్వం చేపట్టి అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో బాగా జరుగుతుందని అన్నారు. చిన్నతనం నుండే సరైన ఆలోచన కల్పించడం వలన లైంగిక వేధింపులు వంటి సమస్యలు ఉత్పన్నం కావని అభిప్రాయపడ్డారు. సామాజిక కళంకం కలుగుతుందనే ఆలోచనతో బయటకు చెప్పకుండా ఉండటం కూడా జరుగుతుందని చెప్పారు. కుటుంబాల్లో ఆలోచన విధానం మరాలన్నారు. సీనియర్ న్యాయవాది రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ లైంగిక వేధింపుల నివారణకు సుప్రీం కోర్టు కొన్ని మార్గదర్శకాలు ఇచ్చిందన్నారు. మహిళా చట్టాలు దుర్వినియోగం అవుతున్నాయనే నెపంతో ఆ చట్టాలను నిర్వీర్యం చేయకూడదన్నారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా చట్టాలను మార్పు చేసి అమలు చేయాలని అన్నారు. పని ప్రదేశం నిర్వచనం విస్తృతం చేయాలన్నారు. రాజకీయ పార్టీలు, క్యాంటీన్, బార్ అసోసియేషన్ లు, డిజిటల్ ప్లాట్ ఫామ్ లు తదితర అన్ని ప్రదేశాలు పని ప్రదేశంగా ఉంటుందని చెప్పారు. రాజకీయ పార్టీలు, బార్ అసోసియేషన్ లు ప్రజల కంటే దూర దృష్టి కలిగి ఉండాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. కొన్ని రాజకీయ పార్టీలు ఇప్పటికే పాటిస్తున్నాయని పేర్కొన్నారు. 20 శాతం మహిళలు న్యాయ వ్యవస్థ లో ఉన్నారని, క్రింద స్థాయి కోర్టులలో 50 శాతం వరకు ఉన్నారని తెలిపారు. పని ప్రదేశంలో మహిళలకు రక్షణపై విశ్వాసం కలిగించాలన్నారు. "చదువుకున్న వారమే, విజ్ఞాన వంతులమే" అయినా ఎందుకు వేధింపులు జరుగుతున్నాయి.

## మహిళా కమిషన్ చైర్మన్‌ను కలిసిన అయేషా మీరా తల్లిదండ్రులు

### - తమ కుమార్తె పేరుతో విద్యాసంస్థ, ట్రస్టు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

**విజయవాడ,డిసెంబరు 27,ప్రభాతవార్తప్రతినిది** అయేషా మీరా హత్య కేసులో ఇప్పటికీ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ అయేషా మీరా తల్లిదండ్రులు శంషాద్ బేగం, బాషా మహిళా కమిషన్ చైర్మన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. 2007 డిసెంబర్ 27న 19 సంవత్సరాల బీ.ఫార్మసీ విద్యార్థిని అయేషా మీరా అత్యంత దారుణంగా హత్యకు గురైంది. ఈ ఘటన జరిగి నేటికి 18 సంవత్సరాలు పూర్తయినా ఇప్పటివరకు అసలు నేరస్తులకు శిక్ష పడకపోవడం బాధాకరమని వారు తెలిపారు. సీబీఐ నివేదిక ప్రకారం కీలక సాక్షాలను ధ్వంసం చేసి, తప్పుడు దర్యాప్తు ద్వారా అమాయకుడైన పిడతల సత్యం బాబును కేసులో ఇరికించారని పేర్కొన్నారు. తొమ్మిది సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించిన అనంతరం సత్యం బాబు నిర్దోషిగా విడుదలై, సత్యమేవ జయతే అని లోకానికి చాటిచెప్పారని గుర్తు చేశారు. అయితే అమాయకుడు విడుదల కావడం సరిపోదని, అసలు నేరస్తులకు కఠిన శిక్ష పడాలని మహిళా సంఘాలు, హక్కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు, అయేషా మీరా తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ న్యాయపోరాటం ఫలితంగా 2018లో ఉమ్మడి హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తు ప్రారంభమైందన్నారు. సీబీఐ దర్యాప్తులో రాజకీయ నాయకుల కుటుంబాలకు సంబంధించిన కీలక సాక్షాలు మాయం చేసినట్టు వెలుగులోకి వచ్చిందని, నేరస్తులను కాపాడేందుకు కొందరు అధికారులు ప్రయత్నించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే 2025 జూన్ 25న హైకోర్టులో సీబీఐ సమర్పించిన సీల్డ్ కవర్ నివేదిక తీవ్రంగా నిరాశపరిచిందని తెలిపారు. అప్పటి నుంచి న్యాయం కోసం ఎదురుచూస్తున్న తమకు ఇది తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు. అయేషా మీరా హత్య జరిగిన సమయంలో చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష నేతగా ఉన్నారని, ఆ సమయంలో తెలుగుదేశం పార్టీ అయేషా మీరా తల్లిదండ్రులకు అండగా నిలిచి రాష్ట్రవ్యాప్తంగా సభలు, ధర్నాలు, నిరసనలు నిర్వహించిందని గుర్తు చేశారు. అయేషా మీరా చనిపోయిన రోజును స్మరణ దినంగా ప్రకటించాలని, ఆమె పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేయాలని కూడా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాలు, హక్కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు పాల్గొని అయేషా మీరా కుటుంబానికి మద్దతు ప్రకటించాయి.

# భారీగా ప్రచార ఆర్భాటం!

### - తొలి మూడురోజులు తిరుమలలో భక్తుల్ని కట్టడి చేస్తాయా?




ఇ డిప్ టోకెన్ ఉన్న భక్తులకే దర్శనం అని జోరుగా ఫ్లెక్సీలు, ఆటోలకు పోస్టర్లు అంటించిన టిటిడి

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** యేడాదికి ఆఖరు రోజులు...కొత్తసంవత్సరంలో కలియుగ వైకుంఠ వాసుడి దివ్యమంగళస్వరూపాన్ని దర్శనం చేసుకుంటే అంతా శుభాలు కలుగుతాయనే ప్రగాఢ విశ్వాసం,దానికంటే ముందే డిసెంబర్ 30 వైకుంఠ ఏకాదశి, 31 వైకుంఠద్వాదశి ఘడియల్లో వైకుంఠవాకిలి ప్రవేశంతో మోక్షం కలుగుతుందనే భక్తకోటి ఆశలు. వైకుంఠద్వార దర్శనాలకు ముందుగానే మూడురోజులకు ఆన్‌లైన్‌లో జారీచేసిన 1.76లక్షలు టోకెన్లు అందుకున్న భక్తులకు మాత్రమే ఆలయం లోపలకు అనుమతినిస్తామని, లేకుంటే కొండపై ఉండవచ్చనేది టిటిడి వర్గాలు హోరెత్తిస్తున్న ప్రచారం. ఈ ప్రచారానికే లక్షలాదిరూపాయలు మంచినీళ్ళలా వ్యయం చేసేశారు. భారీ ఎత్తున ప్రచార ఆర్భాటాలు జోరుగా చేపట్టిన టిటిడి పాలకమండలి, అధికారులు ఎంతవరకు భక్తుల్ని చైతన్యంచేసి తిరుమలపైకి చేరుకుంటే కట్టడిచేయగలరనేది వీడని అంతర్మథనం భయం. పైగా తిరుమలేశుని ఆలయంలో పవిత్రమైన వైకుంఠవాకిలి దర్శనాలకు గోవిందమాలలు ధరించిన భక్తులతోబాటు తమిళనాడు,కర్నాటక, తెలుగురాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు ప్రతి ఏడాది రావడం పరిపాటి. 2021 సంవత్సరం వరకు కేవలం రెండురోజులు వైకుంఠవాకిలి తెరచి ఉంచి దర్శనాలు చేయించే సందర్భంలోనే లక్షలసంఖ్యలో భక్తులు కొండపైకి చేరుకుంటే ఔటర్‌రింగురోడ్డునుండి నారాయణగిరి ఉద్యానవనాల షెడ్డుల మీదుగా వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్ ద్వారా 1.70లక్షల మంది వరకు భక్తులకు ప్రశాంతంగా, ప్రణాళికా బద్ధంగా మోక్షమార్గం దర్శనం చేయించేవారు. అదీ పూర్తిగా ఆ 48గంటలు టిటిడి అధికార గణం, జిల్లా పోలీసు యంత్రాంగం అహర్నిశలు శ్రమిస్తే సకల సదుపాయాలతో చిన్నపాటి లోటుపాట్లు లేకుండా విజయవంతం చేసేవారు. గత నాలుగేళ్ళు తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో టోకెన్లు జారీచేసిన అప్పటి టిటిడి పాలకమండలి, అధికారులు ఏరోజుకారోజు దర్శన టోకెన్లు ఉన్న భక్తులనే తిరుమలకు అనుమతించారు. పైగా టోకెన్‌లేని భక్తులను తిరుపతి అలిపిరి వద్ద కట్టడిచేయగలిగారు. అయితే ఈ ఏడాది జనవరిలో వైకుంఠవాకిలి దర్శనాలు చేయించేందుకు అదే విధానం అమలుచేసి చివరకు అటు టిటిడి వర్గాలు, ఇటు పోలీసువర్గాల క్షేత్రస్థాయి పర్యవేక్షణ కొరవడటంతో పెద్ద తప్పిదాలతో ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయిన ఘటన తెలిసిందే. ప్రస్తుతం పదిరోజుల వైకుంఠద్వార దర్శనం విధానం అమలుచేస్తుండటంతో భక్తులను కొండకు రమ్మని పిలుస్తున్నా ,అత్యంతపవిత్రమైన తొలిమూడురోజులు 30,31,జనవరి 1 మాత్రం ఆన్‌లైన్‌లో టోకెన్లు ఉన్న వారికి మాత్రమే ఆలయంలోనికి ప్రవేశం కల్పిస్తామని టిటిడి ప్రకటనలు సామాన్యభక్తుల్లో, మరీ ముఖ్యంగా స్థానిక భక్తుల్లో ఒకింత ఆశ్చర్యపరుస్తోంది. పైగా చేసిన అభిప్రాయ బేధాల పొరబాట్లకు వెరసి ఒకింత పెద్ద ఎత్తున లక్షలాదిరూపాయలు ఖర్చుచేసి అవగాహన లేని ప్రచార ఆర్భాటంతో టిటిడి వర్గాలుచేతులుదులుపుకునే ప్రయత్నం చేస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదనే విమర్శలు గుప్పుమంటున్నాయి. ఇప్పటికే తిరుమలలో భక్తజనసంద్రం కొనసాగుతోంది. పైగా ఈ రద్దీ నెలాఖరు వరకు ఇలానే ఉంటుందనేది టిటిడి ఉద్యోగుల వాదన.

### నకిలీ ఏజెంట్ల మోసాలకు గురికావొద్దు.. హెచ్చరించిన అమెరికా ఎంబసీ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 27:** వీసా దరఖాస్తుదారులకు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో హెచ్ 1బి వీసా ప్రాసెసింగ్, రెన్యువల్స్ ఆలస్యమవుతుండటంపై యుఎస్ ఎంబసీ స్పందించింది. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకుని కొందరు నకిలీ ఏజెంట్లు మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొంది. ఎలాంటి జాప్యాలకు తావు లేకుండా వీసా లభించేలా చూస్తామంటూ ఆ నకిలీ ఏజెంట్లు దరఖాస్తుదారుల్ని సంప్రదిస్తున్నారని అప్రమత్తం చేసింది. అలాంటి హామీలను నమ్మొద్దని, దానివల్ల ఆర్థికంగా నష్టం, ప్రయాణ ప్రణాళికల్లో ఇబ్బందులు తలెత్తవచ్చని ఎక్స్ వేదికగా అడ్వైజరీ జారీ చేసింది. వీసా అపాయింట్‌మెంట్లు అధికారిక వెబ్‌సైట్ల ద్వారానే షెడ్యూల్ అవుతాయని స్పష్టం చేసింది. ఈ ప్రక్రియ ద్వారా కాకుండా ఇతర మార్గాల్లో ఎవరైనా వీసా ఇప్పిస్తామంటే అది మోసం కిందికే వస్తుందని హెచ్చరించింది. అధికారిక ప్రక్రియలో భాగంగా పేర్కొన్న ఫీజు కంటే ఎక్కువ మొత్తం చెల్లించాల్సిన అవసరం లేదని సూచించింది. అమెరికా తీసుకొచ్చిన కొత్త సోషల్ మీడియా వెట్టింగ్‌పాలసీ కారణంగా భారత్ హెచ్ 1 బి దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతోన్న సంగతి తెలిసిందే. దాని కారణంగా కొన్ని నెలల పాటు వీసా ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి. ఈ వ్యవహారంపై మన దేశం ఆందోళన వ్యక్తం చేసింది.అమెరికా వర్గాలతో చర్చిస్తున్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు.

## గిరిజనుల కోసం అన్ని ఐటిడిఎలకు ట్రైకార్ ద్వారా రూ.13.70 కోట్లు విడుదల: మంత్రి సంధ్యారాణి



**విజయవాడ,డిసెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:**..గిరిజన రైతుల కోసం అన్ని ఐటిడీఏలకు ట్రైకార్ ద్వారా రూ.13.70 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు.ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేసారు.గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.తాజాగా మరల ఐటిడీఏ ద్వారా 90 సబ్సిడీ తో పరికరాలు మంజూరుచేసారన్నారు. గత జగన్ ప్రభుత్వం ట్రైకార్ రుణాలు ఆపి గిరిజనులకు అన్యాయం చేసిందన్నారు. గిరిజన కుటుంబాల జీవనోపాధి బలోపేతం కోసం ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాల అమలు చేస్తున్నామన్నారు.,.లబ్ధిదారులకు వ్యవసాయ జీవనోపాధి పరికరాల పంపిణీ ద్వారా రైతులకు మేల జరుగుతున్నారు. గిరిజన రైతులకు అందజేత రైతుల శ్రమ తగ్గించి ఉత్పాదకత పెంచేందుకు .ట్రాక్టర్లు మినీ ట్రాక్టర్ల.. మంజూరు చేస్తున్నామన్నారు. గిరిజనుల ఉత్పత్తులు మార్కెట్‌కి సులభంగా చేరేందుకు రవాణా కోసం ట్రక్కులు.అందజేస్తున్నామన్నారు. పంటలు మరియు నిల్వ సామగ్రి రక్షణ కోసం టారపాలిన్‌లు పంపిణీ జరుగుతుందన్నారు. వ్యవసాయ పనులు వేగంగా సాగేందుకు .ఆయిల్ ఇంజిన్లు మంజూరు చేసామన్నారు. గిరిజన కుటుంబాల అదనపు ఆదాయం కోసం పెద్ద ఎత్తున ..గోకులాలు.. మంజూరు చేసినట్లు తెలిపారు.

## కైలాసగిరి రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించిన ఇఒ

### శివరాత్రి లోపు పూర్తి చేయాలంటూ ఆదేశాలు

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 27 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్స వాలంటే అభివృద్ధి పనులు పరుగులు తీస్తాయి. యుద్ధ ప్రాతిపదికపై పనులు సాగుతాయి. గత ఏడాది శివరాత్రి సందర్బంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి సూచనలతో ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి అమలు చేసారు.

కాగా కొన్ని పెద్ద పనులు వివిధ కారణాలతో జాప్యం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఇటీవల శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఈ పనులకు సంబంధించి ఆలయ ఇఒ బాపిరెడ్డితో సమీక్షించారు. శివరాత్రి వస్తుంది కాబట్టి పనులు సత్వరంగా పూర్తి చేయాలని ఆదేశించారు. దాంతో ఇఒ ఇంజనీరింగ్ అధికారులను పరుగులు తీయిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆయన పలుప నులను పరిశీలించారు.

# తిరుమల సమాచారం

## 'వైకుంఠ' వాకిలి దర్శనాలకు విస్తృత ఏర్పాట్లు

### - నేటి నుండి ఎస్ఎస్‌డి టోకెన్లు రద్దు
### - టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల,డిసెంబర్ 27 ప్రభాతవార్తప్రతినిధి:** మరో 48 గంటల్లో తిరుమల ఆలయంలో ప్రారంభం కానున్న పదిరోజుల వైకుంఠ వాకిలి దర్శనాలకు విచ్చేసే భక్తలకు విస్తృత ఏర్పాట్లుచేపట్టినట్లు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లలో తాగునీటికొళాయిలు, నీళ్ళడ్రమ్ములు, అన్నప్రసాదం పంపిణీకి మొబైల్‌వ్యాన్ల సౌకర్యాలు కల్పించామన్నారు. భక్తుల అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకుని క్యూలైన్లలో పలు మార్పులు చేపట్టామని తెలిపారు. క్యూలైన్లలో భక్తులు కూర్చునే విధంగా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. వైకుంఠద్వార దర్శనాలకు తరలివచ్చే భక్తులకు కల్పించే సౌకర్యాలు, ఏర్పాట్లపై శనివారం మధ్యాహ్నం అన్ని విభాగాల అధికారులు ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, అన్నప్రసాదం డిప్యూటీ ఇఒ రాజేంద్ర, ఆరోగ్యవిభాగం డిప్యూటీ ఇఒ సోమన్నారాయణ, ఇఇ శ్రీనివాసులు, డిఇ చంద్రశేఖర్, ఐటి డిప్యూటీ జిఎం వెంకటేశ్వర్లునాయుడు,సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవితో కలసి శిలాతోరణం వద్దనుండి వైకుంఠమ్ 2 వరకు క్యూలైన్లను తనిఖీ చేశారు. వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేపట్టామన్నారు. క్యూలైన్లకు అనుసంధానంగా అదనపుమరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. భక్తుల కోసం టిటిడి అందుబాటులో ఉంచిన సదుపాయాలను వినియోగించుకునేందుకు వీలుగా వివిధ భాషల్లో సూచికబోర్డులను కూడా క్యూలైన్లలో,ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేశామన్నారు. భక్తులందరూ టిటిడి కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని సంయమనంతో స్వామివారిని దర్శించుకోవాలని ఆయన కోరారు. కాగా నేటి నుండి జనవరి 7వతేదీ వరకు ఎస్ఎస్‌డి టైమ్‌స్లాట్ టోకెన్లు రద్దు చేశామన్నారు. భక్తులు టిటిడికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇ డిప్ టోకెన్ పొందిన భక్తులు నిర్ధేశిత సమయం ప్రకారం,ఆరోజుల్లోనే ,ఆయా ప్రాంతాల్లో క్యూలైన్ వద్దకు రావాలని ,క్యూలైన్‌ద్వారా వైకుంఠద్వార దర్శనం పొందడానికి ప్రణాళికను రూపొందించుకోవాలని కోరారు.

## అంతా మంచి జరగాలని వేడుకున్నా

### శ్రీవారి దర్శనంలో మాజీ గవర్నర్ నరసింహన్



**తిరుమల,డిసెంబర్ 27పభాత వార్తప్రతి నిధి:** అదే భక్తిభావం...భగవంతునిపై తదేక ధ్యాస వెరసి సాంప్రదాయ దుస్తుల్లో కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని మాజీ గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ దంపతులు దర్శించుకున్నారు. ధనుర్మాసంలో ,నూతన ఆంగ్లసంవత్సరం ఆరంభానికి ముందు తిరుమలకు రావడం, స్వామివారిని దర్శించుకోవడం శుభకరమని, అంతా మంచిజరగాలని ఆకాంక్షించినట్లు నరసింహన్ తెలిపారు. శనివారం ఉదయం ఆయన కుటుంబంతో కలసి తిరుమలకు వచ్చారు. ఉదయం స్వామివారి నైవేద్యవిరామసమయంలో ఆలయంలోనికి చేరుకున్నారు.తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కు ు తీర్చుకున్నారు. ఆలయంలోపల వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అది కారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుమలలో ఏర్పాట్లు, దర్శన సౌకర్యం బావుందన్నారు.

## భగవంతుని ఆశీస్సులందుకున్నాం: ప్రముఖులు



**తిరుమల,డిసెంబర్ 27పభాతవార్తప్రతినిధి:** ధనుర్మాసంలో శనివారం కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సు లందుకున్నట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. శనివారం ఉదయం కేంద్ర మంత్రి కృష్ణపాల్‌గురుజార్, డిఆర్‌డిఎ మాజీ డైరెక్టర్ సతీశ్‌రెడ్డి, క్రికెటర్ కిరణ్‌శర్మ, సినీనటుడు ఆకాశ్‌దాస్‌నాయక్‌లు వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి అదనపు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## స్వచ్ఛంద పరిశుభ్రతకు కోల్‌కతా ఐటిసి సిబ్బంది



**తిరుమల,డిసెంబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** పుణ్యక్షేత్రం తిరుమలకొండను మరింత స్వచ్ఛతగా పరిశుభ్రంగా ఉంచడంలో తమవంతుగా స్వచ్ఛందంగా సేవచేసేందుకు కోల్‌కత్తా ఐటిసి కార్పొరేషన్ సిబ్బంది తిరుమలకు వచ్చారు. వందమంది కార్మికులు తిరుమలలో ఆలయం ముందు, మాఢ వీధులు, వైకుంఠం క్యూలైన్లలో స్వచ్ఛందంగా శుభ్రత చేస్తున్నారు.తిరుమల పరిశుభ్రతకు మారుపేరు. మరీ ఈ వందమంది సిబ్బందితో టిటిడికి సేవలందించి మరింత శుభ్రతను పాటించేలా, వైకుంఠ ద్వారదర్శనాల సమయంలో ఈ అదనపు సిబ్బంది సేవలు మరింతగా ఉపయోగకరంగా మారాయి.

## ఎర్రచందనం స్మగ్లర్ల మూలాలు కదిలించాం

### - 52మంది పరారీ స్మగ్లర్లనుపట్టుకున్నాం -1,872 ఎర్రచందనం దుంగలు స్వాధీనం - టాస్క్‌ఫోర్స్ చీఫ్ సుబ్బరాయుడు



**తిరుపతి,డిసెంబర్ 27ప్రభాత వార్తప్రతినిధి:** శేషాచలం అడవుల నుండి జాతీయ సంపద ఎర్రచందనం అక్రమరవాణా జరగకుండా పటిష్టవ్యూహంతో... పోలీసు,టాస్క్‌ఫోర్స్ , అటవీశాఖ సిబ్బంది సమిష్టి కృషి అద్భుత ఫలితాలనిచ్చిందని తిరుపతి జిల్లా ఎస్పీ, టాస్క్‌ఫోర్స్ చీఫ్ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడే స్మగ్లర్ల మూలాలను కదిలించామని, పరారీలో ఉన్న 52మంది స్మగ్లర్లను పట్టుకోగలిగామని వెల్లడించారు. పటిష్టమైన నిఘాతో పలురకాలుగా కేసుల్లో, అక్రమంగా రవాణా చేస్తూ 1,872 ఎర్రచందనం దుంగలు, 35,476 కిలోల బరువున్నవి సీజ్‌చేయడం జరిగిందన్నారు. శనివారం తిరుపతి కపిలతీర్థంలోని ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో ఆ విభాగం ఎస్పీ శ్రీనివాసులు,అదనపు ఎస్పీ కులశేఖర్, సిసిఎఫ్ ఎస్.శెల్వం, డిఎఫ్ఒ వి.సాయిబాబా, ఫ్లయింగ్ స్క్వాడ్ డిఎఫ్ఒ రామకొండారెడ్డి, ఆర్ఎస్ఎఎస్‌టిఎఫ్ జె.కులశేఖర్, డిఎస్పీ వి.శ్రీనివాసరెడ్డి, షరీఫ్, ఎసిఎఫ్ శ్రీనివాస్‌తో కలసి ఎర్రచందనం అక్రమరవాణాకు తీసుకున్న చర్యలు గురించి వివరించారు. ఏడాది వార్షిక ప్రణాళికను వివరించారు. 2025లో ఎర్రచందనం పరిరక్షణ, సమర్ధవంతమైన అమలు చర్యలు,అన్ని శాఖల మధ్య అంతర్‌రాష్ట్ర సమన్వయం,బలమైన గూడాచారి వ్యవస్థ కఠిన న్యాయ అనుసరణ ద్వారా ఎర్రచందనం స్మగ్లర్లను పట్టుకోగలిగామన్నారు. రికార్డుస్థాయిలో సీజ్‌లు,అరెస్ట్‌లు,వారెంట్ల అమలు,అత్యధిక శిక్షలు, పిడి యాక్టు నమోదు చేయడం జరిగిందన్నారు. 2025లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు. కర్నాటకప్రాంతాల్లో భారీగా పట్టుబడిన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడంలో టాస్క్‌ఫోర్స్ అద్భుతమైన ప్రతిభ చూపిందని జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలు, ఆశయాల మేరకు శేషాచలంలో పూర్తిస్థాయిలో ఎర్రచందనం పరిరక్షణకు మరింతగా అంకితభావంతో పనితీరుసాగిస్తామని చెప్పారు.

# ఏకాగ్రత కోసం..

పిల్లలు సరిగా చదవడం లేదు. చదివినా అవి గుర్తుండటం లేదు. అవి చాలామంది తల్లులు బాధపడుతుంటారు. వారి ఏకాగ్రత పెరగడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తారు. దీనికి ప్రధాన కారణం ఒత్తిడి, మానసిక అలసట అంటున్నారు నిపుణులు.

వీటిని ఇంట్లో ఉండే వస్తువులతోనే దూరం చేయొచ్చట. **ఎలా అంటే...**

**తులసి..** ఇందులోని అడాప్టోజెన్ పిల్లలలో ఒత్తిడి తగ్గుతుందట. అందుకే తులసి పొడిని స్మూతీస్ లేదా వేడి పాలలో కలిపి ఇస్తే అలసట తగ్గి, ఏకాగ్రత పెరుగుతుంది. రోగనిరోధక శక్తికీ, గుండె ఆరోగ్యానికీ ఇది మంచిది.

**.పుదీనా....** తిపిల్లల్లో చురుకుదనం పెంచడానికి పుదీనా తినడం మంచిది అంటుంటాం. అయితే ఏకాగ్రత పెరిగి చదివింది మరచి పోకుండా ఉండటానికి ఇది ఉపయోగపడు తుందట. చాలామందికి పుస్తకం పట్టుకోగానే నిద్ర వచ్చేస్తుంది. అలాంటప్పుడు పెప్పర్ మింట్లు తింటే ఎసిటైల్ కోలిన్ నిద్ర రాకుండా మెదడును ఉత్తేజపరుస్తుంది. మానసిక అలసటను దూరం చేయడానికి ఇవి సహాయపడతాయి.

డిఫ్యూజర్‌లో మింట్ ఆయిల్ వేయడం వల్ల ఫలితం పొందొచ్చు.

# అందరికి అండగా 'ఫుడ్' బిజినెస్



**కొవిడ్‌లో భర్త పని పోయింది. ముగ్గురు పిల్లలతో బతుకు బండిని లాగడం కష్టమైంది. వంటనే జీవనాధారంగా మలుచుకోవాలనుకున్నారు భారతీ తక్కర్. అలా వంటింట్లో మొదలైన తన వ్యాపార ప్రయాణం ఇప్పుడు విదేశాలకూ చేరింది.**

అహ్మదాబాద్‌లోని చాంద్‌ఖేడ్‌లో ఉంటారు భారతి. వయసు 57 ఏళ్లు. భర్త వినోద్. ఓ చిన్న కంపెనీలో లారీ డ్రైవర్‌గా పనిచేసే వారు. వీళ్లకు ముగ్గురు సంతానం. నిరుపేద కుటుంబం. పిల్లల చదువుల కోసం ఎన్నో కష్టాలను ఓర్చుకున్నారు. వాళ్లని ఉన్నత స్థానాల్లో నిలబెట్టాలంటే ఆశయంతో రేయింబవళ్లు శ్రమించేవారు భారతి భర్త వినోద్. కోవిడ్ అంతా బాగానే సాగింది. కానీ తర్వాతే వినోద్ ఉద్యోగం పోయింది. వెనకడుగు వేసి వాళ్ల గ్రామానికి వెళ్లిపోతే, పిల్లలకు చదువు దూరం అవుతుంది. ఇప్పటిదాకా పడిన శ్రమ అంతా వృథా అయిపోతుందని బాధపడు తున్న భర్తను చూసి... 'మీరు కంగారు పడకండి. నేను ఏదోకటి చేస్తానని ధైర్యం చెప్పా. కానీ నేను అప్పటి వరకూ ఇల్లు దాటిందే లేదు. చదువు కూడా అంతంత మాత్రమే. ఏం చేయాలో తెలియని పరిస్థితి. అప్పుడే ఫుడ్ బిజినెస్ మొదలు పెడితే బాగుంటుంది అనిపించింది. గుజరాతీ ప్రత్యేక వంటకమైన థెప్లాలు చాలా బాగా చేస్తా, ఇంట్లోవాళ్లు, బంధువులు అందరికీ నేను చేసే చెప్తే చాలా ఇష్టం. ఎవరు ఇంటికి వచ్చినా అడిగి మరీ చేయించుకుని తినేవారు. వాటిని తయారు చేసి విక్రయించాలి అనుకున్నా. అలా 2022లో వంటింట్లో సరకులతోనే మొదలైంది నా వ్యాపార ప్రయాణం అనే భారతి వ్యాపారం తక్కువ సమయంలోనే మంచి ఆదరణను సంపాదించుకుంది. రోజుకి 15 నుంచి 20 కిలోల థెప్లాలు తయారుచేస్తారు భారతి. ఇందుకు ఉదయాన్నే 5 గంటలు లేస్తారు. మహారాష్ట్ర, ఢిల్లీల నుంచే కాకుండా అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్, దుబాయిలనుడా పెద్ద మొత్తంలో ఆర్డర్లు వస్తాయి. 'రెండేళ్ల క్రితం ఈ వ్యాపారం ప్రారంభించే ముందు పిల్ల ఇంకా చదువుతోంది. పెద్దబ్బాయి సీఏ, చిన్నోడు ఇంజినీరింగ్ చివరి సంవత్సరంలో ఉన్నారు. అమ్మాయికి పెళ్లి చేసి పంపాం. ఇప్పుడు పెద్దబ్బాయి చదువు అయి పోయింది, ఉద్యోగంలో స్థిరపడ్డాడు. ఇంకెందుకు నీకీ కష్టం వదిలేయమ్మా ఈ వ్యాపారం అని చాలాసార్లు చెప్పాడు. అయినా దీన్ని కొనసాగిస్తున్నా. గృహిణైన నాకు ఇంత గుర్తింపు తెచ్చిపెట్టినదాన్ని వదిలేయడ ఇష్టం లేదు అంటారు.



# తిరుప్పావై

## 13వ పాశురము



పుళ్ళిన్ వాయ్ కీణ్డానై
పొల్లావరక్కనై
క్కిళ్ళిక్క ళైన్దానై క్కీర్తిమై
పాడిప్పోయ్
పిళ్ళై కళెల్లారుమ్ పావైక్కళమ్
పుక్కార్,
వెళ్ళియెళున్ద వియాళ
ముఱంగిత్తు
పుళ్ళుమ్ శిలుమ్బినకాణ్
పోదరిక్కణ్ణినాయ్
కుళ్ళక్కుళిర క్కుడైన్దు నీరాడాదే,
పళ్ళిక్కిడత్తియో పావాయ్
నీనన్నాళాల్
కళ్ళమ్ తవిర్న్దు కలన్దేలో
రెమ్బావాయ్

"లోన తుమ్మెదలుగల తామరపూలను పోలిన కనులదానా, లేడివంటి చూపులు కలదానా, శుక్రుడు ఉదయిస్తున్నాడు. గురుడు అస్తమిస్తున్నాడు. పక్షులు కూయు చున్నవి. 'బకాసురుని నోరును చీల్చిన కృష్ణుణ్ణి, రావణా సురుని పదితలలు నరికిన రాముడిని పూజిస్తూ గోపికలు వ్రతక్షేత్రమునకు చేరినారు. ఓ సుకుమారి, ఇంకా స్నానము చేయుకొనియుంటివేమి? ఇది మంచిరోజు. కపటము వీడుము. మాతో కలిసి ఆనందము అనుభవము." అనుచు వెలుపలి గోపికలు మరొక గోపికను ఈ రోజు లేపుతున్నారు.

ఫలం : "అజ్ఞానం తొలగుతుంది"

# రుచికరమైన కేకులు!

## బ్లాక్‌ఫారెస్ట్ కేక్ ..

కావలసినవి: మైదా కప్పున్నర, కోకోవా పావు కప్పు, బేకింగ్ పౌడర్ చెంచా, బేకింగ్ సోడా అర చెంచా, ఉప్పు చిటికెడు, పంచదార పొడి కప్పు + పావు కప్పు + 3 టేబుల్‌స్పూన్లు, పాలు కప్పు బటర్ ముప్పావు కప్పు, వెనీలా ఎసెన్స్ అర కప్పు, క్రీం 2 కప్పులు, చాక్లెట్ బార్ 1 కొద్దిగా, చెర్రీపండ్లు9, చెర్రీపండ్ల ముక్కలు

తయారీ: చెర్రీపండ్ల ముక్కల్లో 3 టేబుల్స్పూన్ల పంచదార, కొన్ని నీళ్లతో చెర్రీ సిరప్ చేయాలి. చాక్లెట్బార్ను తరగాలి. కప్పు పంచదారపొడిలో బటర్ వేసి బీట్ చేయాలి. అందులో మైదా, కోకోవా, పాలు, ఉప్పు, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడా, సగం వెనీలాఎసెన్స్ వేసి కలపాలి. దీన్ని కేక్ ప్యాన్‌లో 180 డిగ్రీల వద్ద 30 నిమిషాలు బేక్ చేయాలి.



కొత్త సంవత్సరం అనగానే ఇళ్ల మీద స్టార్ల మెరుపులు. శాంటాక్లాజ్ ఇచ్చే కానుకలను తలచుకుని పిల్లల ముఖాల్లో మైమరపులు. ఇక వంటల సందడి గురించి ఎంత చెప్పినా తక్కువే ఎప్పుడు చేసే డోనట్స్, డైమండ్ బిస్కెట్స్ తో పాటు ఈ స్పెషల్ కేక్స్ లో శీకొన్ని చేసి చూడండి...

చల్లారాక.. చెర్రీ సిరప్ను లేయర్లా వేయాలి. క్రీంలో పావుకప్పు పంచదార, మిగిలిన వెనీలా కలపాలి. ఇందులో కొంత భాగాన్ని పైపింగ్ బ్యాగ్లో వేయాలి. మిగిలిన క్రీంను కేక్ మీద లేయర్ల అదొకటి, ఇదొకటి చొప్పున ఇంకో రెండు పొరలు వచ్చాక.. పైన వేసి, దాని మీద చెర్రీసిరప్ ఇలా.. చెర్రీపండ్లు, మధ్యలో కొన్ని చాక్లెట్ కర్ల్స్ వేసి మిగిలినవి కేక్ చుట్టూ అద్దాలి. పైపింగ్ బ్యాగ్లో ఉన్న క్రీంతో అందంగా బోర్డర్లు, పూలు, డిజైన్లు వేసి.. కొంతసేపు ఫ్రిజ్‌లో ఉంచితే నోరూరించే 'బ్లాక్ ఫారెస్ట్ కేక్ రెడీ.

## కాఫీ కేక్ ..



కావలసినవి. కేక్ పిండి కోసం మైదాపిండి 3 కప్పులు, పంచదార రెండుంబావు కప్పులు, అన్సాల్టెడ్ బటర్, క్రీం కప్పు చొప్పున, చిక్కటి పాలు పావు కప్పు, బేకింగ్ పౌడర్ ముప్పావు చెంచా, బేకింగ్ సోడా, ఉప్పు అర చెంచా చొప్పున, గుడ్లు 4, వెనీలా ఎక్స్‌ట్రా ట్రాక్ట్ సరిపోతుంది. టాపింగ్ కోసం: మైదాపిండి, బ్రౌన్ షుగర్ కప్పు చొప్పున, అన్సాల్టెడ్ బటర్ అర కప్పు, దాల్చిన చెక్క పొడి చెంచా, ఉప్పు చిటికెడు **లేయర్ కోసం:** పంచదార పావు కప్పు, మైదాపిండి టేబుల్ స్పూన్, దాల్చిన చెక్క ముక్క **తయారీ:** చిన్న పాత్రలో మైదా, దాల్చినచెక్క పొడి, బటర్, ఉప్పు, బ్రౌన్ షుగర్లను కలిపి పక్కనుంచాలి. మరో పాత్రలో పంచదార, దాల్చినచెక్క పొడి, మైదాలను కలపాలి. మిక్సీ జార్‌లో మైదాపిండి, పంచదార, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడా, ఉప్పు, బటర్ వేసి రెండుసార్లు తిప్పాలి. మరో జార్లో క్రీం, పాలు, గుడ్లు, వెనీలాలను గ్రైండ్ చేయాలి. ఈ పిండిలో సగభాగాన్ని వెన్న రాసిన కేక్ ప్యాన్‌లో సమంగా సర్ది.. దాల్చినచెక్క పొడి కొంత చల్లాలి. దాని మీద మిగిలిన పిండి వేసి.. పైన తక్కిన దాల్చినచెక్క పొడి చల్లాలి. ఈ పొర మీద మైదా, బ్రౌన్ షుగర్ మిశ్రమం పరిచినట్లు చేసి.. అవెన్‌లో 350 డిగ్రీల ఫారెన్‌హీట్ వద్ద 55 నిమిషాలు బేక్ చేయాలి. ఆవెన్ లోంచి తీసి.. గది ఇంటికి వచ్చాక పాలిథిన్ కవర్ కప్పి రెండు గంటలు ఫ్రిజ్‌లో ఉంచితే ఖికాఫీ కేక్ తిని ఆనందించవచ్చు.

## కుక్కర్ కేక్ ..

కావలసినవి: మైదాపిండి కప్పున్నర, పాలు కప్పు, పంచదార ముప్పావు కప్పు, వెన్న అర కప్పు, వెనిగర్, బేకింగ్ పౌడర్ చెంచా చొప్పున, బేకింగ్ సోడా అర చెంచా, ఉప్పు చిటికెడు, వెనీలా ఎసెన్స్ కొద్దిగా, చాక్లెట్ చిప్స్ 100 గ్రాములు**తయారీ:** ఏడంగుళాల కేక్ ట్రెను వెన్నతో గ్రీజ్ చేసి.. కాస్త పిండి జల్లి అంతటా పరచుకునేలా అటూ ఇటూ కదిలించాలి. ప్రెషర్ కుక్కర్లో ఉప్పు వేసి.. దాని మీద చిన్న స్టాండ్ ఉంచి మూత పెట్టి వేడిచేయాలి. మిక్సింగ్ బౌల్లో మైదాపిండి, పంచదార, పాలు, వెన్న, వెనిగర్, ఉప్పు, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడాలను కలపాలి. ఈ మిశ్రమాన్ని కేక్ ట్రేలో వేసి రెండుసార్లు. కుదించి నట్లు చేసి.. పటకారుతో కుక్కర్లో



## లెమన్ కేక్ ....




**కావలసినవి.** మైదాపిండి కప్పున్నర, పంచదార కప్పు, పాలు ముప్పావు కప్పు, వెన్న అర కప్పు, వెనీలా ఎక్స్‌ట్రాక్ట్ తగినంత, గుడ్లు 2, బేకింగ్ పౌడర్ చెంచా, నిమ్మరసం, లెమన్ జెస్ట్ టేబుల్ స్పూన్ చొప్పున రువా.**తయారీ,** పంచదార, వెన్నలను ఎలక్ట్రిక్ మిక్సర్ కలపాలి. అందులో కోడిగుడ్లు, వెనీలా ఎక్స్ ట్రాక్ట్ జతచేసి మళ్లీ కలపాలి. మరో పాత్రలో మైదా, బేకింగ్ పౌడర్లను కలపాలి. దానికి పాలు, నిమ్మరసం, లెమన్ జెస్ట్ జతచేసి మెత్తటి పేస్టులా చేయాలి. ప్యాన్‌లో వెన్న రాసి.. మిశ్రమాన్ని సమంగా సర్దాలి. అవెన్ను హీట్ చేసి.. 175 డిగ్రీల సెల్సియస్ వద్ద 35 నిమిషాలు బేక్ చేస్తే... 'లెమన్ కేక్' తయారైనట్లే.

# రంగవల్లి



**- పెద్ది ఉషాదేవి**
యిలకటూరి పేల



17 చుక్కలు,మధ్య చుక్క 9 వచ్చే వరకు



**ముగ్గులకుఆహ్వానం:**

**మా చిరునామా:** ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
**Gmail: cheli@vaartha.com**

కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు

# 'శంబాల'కి అద్భుతమైన స్పందన

-యుగంధర్ ముని



**'శంబాల్ల ప్రయాణం ఎప్పుడు ఎలా మొదలైంది?..**

మూడేళ్ల క్రితం ఈ పాయింట్ అనుకున్నాను. నాకు రాజశేఖర్ గారితో ఐదేళ్ల నుంచి అనుబంధం ఉంది. ఈ పాయింట్‌ను ఆయనకు చెప్పాను. ఆ కథ నిర్మాత గారికి చాలా నచ్చింది

**'శంబాల' కథను రాయడంలో మీరు తీసుకున్న జాగ్రత్తలు ఏంటి?..**

దర్శకుడిగా ఈ కథను ఎంతో బాధ్యతతో రాసుకున్నాను. నేను చెప్పే కథను చాలా మంది చూస్తారు. ఎంతో నేర్చుకుంటారు. ఏ ఒక్కరినీ బాధపెట్టకూడదు.

**శంబాల్లకి వస్తున్న రెస్పాన్స్ చూసి ఎలా ఫీల్ అవుతున్నారు?..**

'శంబాల్ల రెస్పాన్స్ చూసి నాకెంతో ఆనందంగా ఉంది. హౌస్ ఫుల్ బోర్డులు పడినా కూడా గేట్లు తన్నుకుంటూ వెళ్తున్నారు. ఇవన్నీ నేను చిన్నప్పుడు చిరంజీవి సినిమాలకు చూశాను. ఇప్పుడు ఇలా నా మూవీకి అన్ని చోట్లా అద్భుతమైన స్పందన రావడం ఆనందంగా ఉంది. తమిళనాడు, కర్ణాటకలోనూ మా సినిమాకు మంచి స్పందన వస్తోంది.

**'శంబాల' విజయం సాధించడంపై ఇండస్ట్రీ నుంచి ఎవరైనా కాల్ చేశారా?..**

ఇండస్ట్రీ నుంచి చాలా మంది ఫోన్స్ చేశారు. హీరోలు, దర్శక, నిర్మాతలందరూ ఫోన్స్ చేసి అభినందిస్తున్నారు. ఆదిగారు ఈ మూవీ విజయం పట్ల ఆనందంగా ఉన్నారు.

**ఆది గారు శంబాల కథలో ఇచ్చిన ఇన్ పుట్స్ గురించి చెప్పండి?..**

ఆది గారు స్క్రిప్ట్‌లో ఎక్కువగా ఇన్ పుట్స్ ఇవ్వలేదు. కథా చర్చల టైంలో ఆది గారు సలహాలు ఇచ్చారు.

**'శంబాల' లో ఆది, ఇతర ఆర్టిస్టుల గురించి చెప్పండి?..**

'శంబాల్ల కథకి కంప్లీట్ యాక్టర్, అన్ని రకాల ఎమోషన్స్ పండించే హీరో కావాలని నేను అనుకున్నాను. రాజశేఖర్ గారు ఆది పేరు చెప్పారు. ఆదిగారు ఈ పాత్రకు న్యాయం చేశారు.

**'శంబాల' కి బడ్జెట్ పెరిగింది కదా?..**

'శంబాల్ల కథ అనుకున్నప్పుడు ఓ బడ్జెట్ అనుకున్నాం. ఆ తరువాత రామోజీ ఫిల్మ్ సిటీకి వెళ్లి చూస్తే అక్కడే ఓ ముప్పై శాతం బడ్జెట్ పెరుగుతుందని అర్థమైంది. ఆ తరువాత చివరకు ఓ పది శాతం బడ్జెట్ పెరిగి ఉంటుంది.

# 'మన శంకరవరప్రసాద్ గారు' మెగా విక్టరీ మాస్ సాంగ్ 30న రిలీజ్,



మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేశ్ కలిసి నటిస్తున్న క్రేజీ ఎంటర్‌టైనర్'మన శంకర వర ప్రసాద్ గార్థ పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించి అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న మ్యాసీవ్ అప్‌డేట్ ఇప్పుడు వచ్చేసింది. ఈ చిత్రంలోని థర్డ్ సింగిల్ 'మెగా విక్టరీ మాస్ సాంగ్థ ను డిసెంబర్ 30న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. దీనికి సంబంధించిన ప్రోమోను రేపు రిలీజ్ చేయను న్నారు. సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ అదిరిపోయింది. ఎనర్జీతో నిండిన ఈ పోస్టర్‌లో మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేశ్ ఇద్దరూ స్టైలిష్ డాన్స్ పోజుల్లో అదరగొట్టారు. బ్యాక్‌గ్రౌండ్‌లో డ్యాన్సర్లతో కలిసి పూర్తి సెలబ్రేషన్ వైబ్స్‌ను క్రియేట్ చేశారు. డెనిమ్ లుక్, సన్‌గ్లాసెస్‌తో చిరంజీవి మెగా స్వాగ్ తో కనిపిస్తే, రెడ్ జాకెట్‌లో వెంకటేశ్ స్టన్నింగ్‌గా కని పిస్తు న్నారు. ఇద్దరి మాస్ అప్పీల్, స్వాగ్ పీక్స్ లో ఉన్నాయి. ఈ సాంగ్ బిగ్గెస్ట్ సెలబ్రేషన్ ఆంథమ్ గా మ్యూజిక్ చార్ట్స్‌ను షేక్ చేయబోతుంది. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ ని గ్రాండ్ గా స్టార్ట్ చేయడానికి ఇది పర్ఫెక్ట్ సాంగ్. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సాహు గరపాటి, సుష్మిత కొణిదెల ఈ చిత్రాన్ని భారీగా నిర్మిస్తు న్నారు. మన శంకర వర ప్రసాద్ గారు జనవరి 12న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కానుంది.

# తెర

# విజయాన్ని ఇచ్చిన ఆడియన్స్‌కి థాంక్ యూ



ఛాంపియన్ కి చాలా లాంగ్ రన్ ఉంటుంది. అందరూ కూడా ఫ్యామిలీతో కలిసి వెళ్లి చూడాలని కోరుకుంటు న్నాను: డైరెక్టర్ ప్రదీప్ అద్వైతం ఛాంపియన్ సక్సెస్ గొప్ప సాటిస్ఫాక్షన్ ఇచ్చింది: నిర్మాత స్వప్న దత్ స్వప్న సినిమాస్ లేటెస్ట్ బ్లాక్ బస్టర్ ఛాంపియన్. ఈ చిత్రంలో రోషన్, అనస్వర రాజన్ లీడ్ రోల్స్ పోషించారు. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్ సమర్పణ లో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్‌తో కలిసి నిర్మించారు. ఈ చిత్రం డిసెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ అందుకొని సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ పీపుల్స్ ఛాంపియన్ సక్సెస్ మీట్ నిర్వహించారు. పీపుల్స్ ఛాంపియన్ సక్సెస్ మీట్ లో హీరో రోషన్ మాట్లాడుతూ.. మీడియా అందరికీ థాంక్యు సో మచ్. ఛాంపియన్ సినిమా నాకు చాలా స్పెషల్. ఈ ప్రాజెక్టుకి నేను ఎమోషనల్ అటాచ్ అయ్యాను. డైరెక్టర్ ప్రదీప్ అద్వైతం మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. మా సినిమాని బ్లాక్ బాస్టర్ చేసిన ఆడియన్స్ అందరికీ థాంక్యూ. ప్రొడ్యూసర్ స్వప్న దత్ మాట్లాడుతూ... అందరికి నమస్కారం. వైజయంతి మూవీస్ కి 50 ఇయర్స్. స్వప్న సినిమాస్ మొదలై కూడా 25 ఏళ్లు అవుతుంది. ఈ రెండు బ్యానర్స్ లో ఎప్పుడు కూడా మేము ఈజీ సినిమాలు చేయలేదు. ప్రతిసారి ఒక ఛాలెంజింగ్‌గా ఉన్న కథలు ఎంచుకుని సినిమాలు చేస్తున్నాం.

# 'నీలకంఠ' ట్రైలర్ లాంచ్



పలు తెలుగు, తమిళ సూపర్ హిట్ చిత్రాల్లో బాల నటుడిగా నటించిన మాస్టర్ మహేంద్రన్ హీరోగా మారి చేస్తున్న సినిమా "నీలకంఠ". ఈ చిత్రాన్ని శ్రీమతి ఎం.మమత, శ్రీమతి ఎం. రాజరాజేశ్వరి సమర్పణలో ఎల్ఎస్ ప్రొడక్షన్స్, గ్లోబల్ సినిమాస్ బ్యానర్స్ పై మర్లపల్లి శ్రీనివాసులు, వేణుగోపాల్ దీవి నిర్మిస్తున్నారు. రాకేష్ మాధవన్ దర్శకత్వం వహిస్తున్నారు. నేహ పఠాన్, యష్న ముతులూరి, స్నేహ ఉల్లాల్‌హీరోయిన్స్ గా నటిస్తు న్నారు. "నీలకంఠ" సినిమా పాన్ ఇండియా స్థాయిలో తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళంలో జనవరి 2న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు.

# సెన్సార్ సూచనలతో 'వానర'



టైటిల్ "వనవీర"గా మార్పు, జనవరి 1 గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న "వనవీర".. అవినాష్ తిరువీధుల హీరోగా, దర్శకుడిగా పరిచయమవుతున్న సినిమా "వనవీర". ఈ చిత్రంలో సిమ్రాన్ చౌదరి హీరోయిన్ గా నటిస్తోంది. నందు ప్రతినాయకుడిగా కనిపించను న్నారు. "వనవీర" చిత్రాన్ని శంతను పత్తి సమర్పణలో సిల్వర్ స్క్రీన్ సినిమాస్ బ్యానర్ పై అవినాష్ బుయానీ, ఆలపాటి రాజా, సి.అంకిత్ రెడ్డి నిర్మిస్తున్నారు. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్, వివేక్ సాగర్ మ్యూజిక్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ కాబోతున్నాయి. మైథలాజికల్ రూరల్ డ్రామా కథతో తెరకెక్కిన "వనవీర" సినిమా న్యూ ఇయర్ సందర్భంగా జనవరి 1న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటుడు బాబీ మాట్లాడుతూ "వనవీర" టైటిల్ చాలా బాగుంది. ఈ సినిమాతో సంక్రాంతి వారం పది రోజుల ముందుగానే మాకు వస్తుందని ఆశిస్తున్నాం. ఫ్యామిలీ ఆడియెన్స్‌తో పాటు యూత్ డీవోపీ ఛోటా కె ప్రసాద్ మాట్లాడుతూ రెండేళ్లు కష్టపడి చేసిన చిత్రమిది. ఈ సినిమా టైటిల్ "వానర"ను మీరే ఆడియెన్స్ లోకి తీసుకెళ్లారు. అలాగే "వనవీర"ను కూడా ప్రేక్షకులకు చేర్చాలి.

# 'కాగితం పడవలు' ట్రైలర్ లాంచ్



ఎంజీఆర్ తుకారాం దర్శకత్వంలో తెరకెక్కుతున్న బ్యూటిఫుల్ లవ్ స్టోరీ కాగితం పడవలుఖి. ఎస్ఎల్ఎన్ సినీ క్రియేషన్స్, ప్రణధి క్రియేషన్స్, నవ నారాయణ సినీ క్రియేషన్స్ బ్యానర్స్ పై కీర్తన నరేష్ T. R. ప్రసాద్ రెడ్డి వెంకట్రాజుల, గాయిత్రమ్మ అంజనప్ప నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా చార్మింగ్ స్టార్ శర్వానంద్ ఈ సినిమా ట్రైలర్ ని లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్ సందర్భంగా హీరో శర్వా మాట్లాడుతూ.. తుకారం ఎలాంటి ఇండస్ట్రీ బ్యాక్ గ్రౌండ్ లేకుండా సినిమా మీద పాషన్ తో ఇక్కడికి వచ్చాడు. ఈ టీజర్ చూస్తుంటే చాలా అద్భుతంగా ఉంది. "ప్రేమ నిప్పులాంటిది. అది రెండు జీవితాలకు వెలుగునిచ్చే దీపం అవ్వచ్చు.. లేదా అడవిని దహించే కార్చిచ్చుగా మారొచ్చు"అనే డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. ప్రేమకథలోని డెప్త్ ఆడియన్స్ కి వెంటనే కనెక్ట్ అవుతుంది. లీడ్ పెయిర్ వర్ధన్, కృష్ణప్రియ కెమిస్ట్రీ బ్యూటీఫుల్‌గా ఉంది. స్క్రీన్‌పై వారి ఎమోషన్స్ హార్ట్ టచింగ్ వున్నాయి. ఎంజీఆర్ తుకారాం టేకింగ్ అద్భుతంగా వుంది.

# 'కికి అండ్ కొకొ' టీజర్ విడుదల



ప్రపంచవ్యాప్తంగా హాలీవుడ్ అనిమేషన్ చిత్రాలకున్న ఆదరణ అంత ఇంత కాదు! అన్ని జోనర్ చిత్రాలకు ఎంత విలువ ఇస్తారో? అనిమేషన్ చిత్రాలకు కూడా అంతే ప్రాముఖ్యత ఇస్తారు. ఇప్పుడిప్పుడే మన భారతీయ అనిమేషన్ చిత్రాలు కూడా విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ ఏడాది జూలై లో విడుదల అయిన మహా అవతార్ నరసింహ్మా అనిమేషన్ చిత్రం, పిల్లలని, పెద్దలని విశేషంగా ఆకట్టుకుని రికార్డు స్థాయి వసూల్లతో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే! ప్రస్తుతం హృదయాన్ని హత్తుకునే ఓ ఇండియన్ అనిమేషన్ సినిమా 'కికి కోకో' రుపొందుకుంటుంది. పిల్లలకు పిల్లల మనసున్న పెద్దలకు నచ్చేలా రూపొందుతున్న యానిమేషన్ మూవీ ఖికికికి అండ్ కొకొఖి. ఈ చిత్రాన్ని ఇనికా స్టూడియోస్ మన ముందుకు తీసుకొస్తోంది. ఈ యానిమేషన్ చిత్రానికి ధరణి నిర్మాత కాగా పి. నారాయణన్ దర్శకత్వం వహిస్తున్నారు. బాలనటి శ్రీనిక కొకొ పాత్రలో నటిస్తోంది. మీనా చాబ్రియా సీయావోగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణలో ఉన్న యానిమేషన్ మూవీ "కికి అండ్ కొకొ" త్వరలో థియేటర్స్ తో పాటు 9 భాషల్లో ఓటీటీలోకి రాబోతోంది. ఈ రోజు హైదరాబాద్‌లో జరిగిన భారతీయ అన్ని భాషల్లోనే కాకుండా ప్రపంచవ్యప్తంగా పలు భాషల్లో ఈ చిత్రం విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ లోని ప్రసాద్ ప్రివ్యూ థియేటర్ లో ఈ చిత్రానికి సంబంధించిన టిజర్ విడుదల ప్రెస్ మీట్ లో ఈ యానిమేషన్ మూవీ హైలైట్స్ తెలిపారు చిత్రబృందం. సిరీస్ లా చేయాలనే ఆలోచనలో ఉన్నాం. అన్నారు.

ఆట

## షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో..
# సూరజ్‌కు డబుల్ స్వర్ణాలు



**న్యూఢిల్లీ:** జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో సూరజ్ శర్మ సీనియర్, జూనియర్ పురుషుల జాతీయ టైటిళ్లను కైవసం చేసుకుని డబుల్ స్వర్ణాలను సాధించాడు. జూనియర్ ఫైనల్‌లో సూరజ్ మొదట తన అధిక్యాన్ని చాటుకుని 30 హిట్‌లతో బంగారు పతకాన్ని సాధించాడు. తర్వాత సీనియర్ ఫైనల్స్‌లో 31 హిట్‌లతో రెండవ టైటిల్‌ను సాధించాడు. సీనియర్ ఫైనల్‌ను సూరజ్ ఆధిపత్య రీతిలో ప్రారంభించి తన మొదటి 20 లక్ష్యాలలో 19 లక్ష్యాలను చేధించి 31 హిట్‌లతో పోటీని ముగించాడు. డిఫెండింగ్ ఛాంపియన్ పంజాబ్‌కు చెందిన విజయ్‌వీర్ సిద్ధూ కంటే మూడు స్థానాల్లో నిలిచాడు. అతను 28 హిట్‌లతో రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. రాజస్థాన్‌కు చెందిన భవేష్ షెఖావత్ మొత్తం 24 హిట్‌లతో కాంస్య పతకాన్ని సాధించాడు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నెలవల్లి ముఖేష్‌పై వరుసగా మూడు షూట్‌ఆఫ్‌లలో పాల్గొన్న తర్వాత అంకుర్ గోయెల్ 14 హిట్‌లతో నాల్గవ స్థానంలో నిలిచాడు. చివరికి ముఖేష్ 12 హిట్‌లతో ఐదవ స్థానంలో నిలిచాడు. హర్యానాకు చెందిన ఆదర్శ్ సింగ్ ఐదు హిట్‌లతో ఆరో స్థానంలో నిలిచాడు.

## వరల్డ్ రాపిడ్ ఛాంపియన్‌షిప్:
# గౌతమ్ చేతిలో ముగ్గురు గ్రాండ్ మాస్టర్ల ఓటమి




**న్యూఢిల్లీ:** పపంచ రాపిడ్ ఛాంపియన్‌షిప్-2025ను భారత్ అద్భుతంగా ప్రారంభించింది. ఇందులో గౌతమ్ కృష్ణ ముగ్గురు గ్రాండ్‌మాస్టర్‌లపై ఆధిక్యం సంపాదించాడు. ఖతార్‌లో మొదటి రోజు తర్వాత దొమ్మరాజు గుకేష్, ఎరిగియసి అర్జున్ ఉమ్మడి ఆధిక్యాన్ని పంచుకున్నారు. అర్జున్ వరుసగా నాలుగు విజయాలతో ప్రారంభించగా, ఐదవ మ్యాచ్‌లో నార్వేకు చెందిన అనుభవజ్ఞుడు మాగ్నస్ కార్ల్‌సెన్‌తో డ్రాగా ఆడి 4.5 పాయింట్లతో ఈ రోజును ముగించాడు. అలాగే గుకేష్ తన మొదటి గేమ్‌ను డ్రాగా ఆడాడు. కానీ తర్వాత వరుసగా నాలుగు విజయాల తదుపరి అర్జున్‌తో కలిసి మాగ్నస్, మాక్సిమ్ వాచియర్-లాగ్రేవ్, వ్లాడిస్లావ్-ఆర్టెమివ్ లతో కలిసి ఉమ్మడి ఆధిక్యంలో నిలిచాడు. ఇక తొలి రోజు స్టార్‌గా నిలిచిన భారత ఐఎం గౌతమ్ కృష్ణ, తన మొదటి మూడు గేమ్‌లలో ముగ్గురు గ్రాండ్‌మాస్టర్లు అలెగ్జాండర్ ఇండ్జిక్, అరవింద్ చిదంబరం, టెయిమోర్ రాడ్జాబోవ్‌ను ఓడించాడు. ఆ తర్వాత అతను చివరి రెండు ఆటలలో రెండు డ్రాలు ఆడాడు. వాటిలో ఒకటి నెదర్లాండ్స్‌కు చెందిన అనిష్ గిరితో జరిగిన మ్యాచ్‌తో సహా అజేయంగా నిలిచాడు. దీంతో కృష్ణ ఒక రోజులోనే 60 రేటింగ్ పాయింట్లు పొందాడు. కాగా మహిళల విభాగంలో ద్రోణవల్లి హారిక మొదటి రోజు అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చిన భారతీయురాలిగా నిలిచింది. 4 ఆటలలో 3.5 పాయింట్లు సాధించింది. మరో ఆరుగురు భారత్ క్రీడాకారిణులు ఆర్ వైశాలి, కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్, రక్షిత, సవిత శ్రీ, పద్మిని రౌత్ ప్రస్తుతం నాటికి 3/4 పాయింట్లతో టాప్ 30లో ఉన్నారు.

## టాటా ఓపెన్ టూర్..
# అగ్రస్థానానికి సంధు

**న్యూఢిల్లీ:** టాటా ఓపెన్ 2025లో భారత్‌కు చెందిన యువరాజ్ సంధు టాప్ ప్లేస్‌కు చేరుకున్నాడు. గోల్ఫురిలో జరిగిన ఈవెంట్ పిజిటిఐ సీజన్ ఫైనల్ యొక్క రౌండ్ టూలో ఎనిమిది అండర్ 64లో అద్భుతమైన ప్రదర్శనతో సంధు లీడర్‌బోర్డ్‌లో అగ్రస్థానానికి చేరుకున్నాడు.



బెల్డిహ్‌లో ఆడిన యువరాజ్ (67-64), హాఫ్‌వే దశలో మొత్తం 11అండర్ 131తో మూడు షాట్‌లతో ఆధిక్యంలో ఉండటంతో ఓవర్‌నైట్ టై ఎనిమిదో స్థానం నుండి ఏడు స్థానాలు పైకి ఎగబాకాడు. రౌండ్ వన్ తర్వాత 4 ఆధిక్యంలో ఉన్న సంధు, ముందు 9 స్థానాల్లో వరుసగా మూడు బర్డీలను సేకరించాడు. తదుపరి వరుసగా చిన్న బ్లిప్, తర్వాత వరుసగా ఆరు బర్డీలతో బర్డీ స్ప్రీ చేశాడు. సంధు చేసిన తొమ్మిది బర్డీలలో రెండు టాప్‌క్లాస్ అప్ అండ్ డౌన్స్, 12 నుండి 15 అడుగుల పరిధి నుండి రెండు లాంగ్ మార్పిడులు, రెండు నాలుగు అడుగుల మార్పిడులు ఉన్నాయి. ఈ ఏడాదిలో 6 సార్లు విజేతగా నిలిచిన యువరాజ్, ఇప్పటికే 2025 ఆర్డర్ ఆఫ్ మెరిట్ కిరీటాన్ని గెలుచుకున్నాడు. సంధు ఇప్పుడు రికార్డు స్థాయిలో ఏడవ టైటిల్ కోసం చూస్తున్నాడు. అలాగే మూడవ ఈవెంట్ ఆడుతున్న 21 ఏళ్ల శుభమ్ జగ్లాన్ (68-66), గోల్ఫురిలో రౌండ్ టూలో ఫోర్ అండర్ 66 సాధించి నాలుగు స్థానాలు ఎగబాకి మొత్తం ఎనిమిది అండర్ 134తో రెండవ స్థానానికి చేరుకున్నాడు.

# ఆటకు దిగ్గజాల వీడ్కోలు





### 2025 క్రీడల్లో ముగిసిన ఒక శకం
### క్రికెట్ నుంచి మల్లయోధులు వరకు షాక్








**న్యూఢిల్లీ:** ఈ ఏడాది 2025 ప్రపంచ క్రీడల్లో ఒక శకం ముగిసింది. క్రికెట్ పిచ్ నుండి కుస్తీ పోటీల వరకూ విభిన్న క్రీడల్లో మైదానంలో తమ అసాధారణ ప్రతిభతో అభిమానులను మంత్రముగ్ధులను చేసిన ఎందరో సూపర్ స్టార్‌లు ఈ ఏడాది తమ కెరీర్‌కు వీడ్కోలు పలికారు. టీమిండియా స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ దగ్గర నుండి వివిధ క్రీడలకు సంబంధించి సెరిజియో బుస్కెట్స్, జోర్డీ అల్బా, మార్సెలో, హెమల్స్ లాంటి ప్రపంచ స్థాయి ఆటగాళ్ల వరకూ పలువురు తమ సుదర్ఘ కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించి షాక్ ఇచ్చారు. భారత టెస్టు జట్టు కెప్టెన్‌గా ఉన్న సమయంలోనే రోహిత్ శర్మ సుదీర్ఘ టెస్టు క్రికెట్ కెరీర్‌కు మే 07న గుడ్ బై చెప్పేశాడు. 2013లో టెస్టు అరంగేట్రం చేసిన రోహిత్ 67 మ్యాచ్‌లలో 4,301 పరుగులు సాధించాడు. టెస్టు కెరీర్‌లో 12 శతకాలు, 18 అర్ధశతకాలు ఉన్నాయి. 2019లో దక్షిణాఫ్రికాపై చేసిన 212 పరుగులు అతని టెస్టు కెరీర్‌లో అత్యుత్తమ ఇన్నింగ్స్‌గా నిలిచింది. కెప్టెన్‌గా 24 టెస్టుల్లో భారత్‌ను నడిపిన రోహిత్, 12 విజయాలు అందించి తనదైన ముద్ర వేశాడు. అలాగే, 2024లో టీ20 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత రోహిత్ సైతం ఆ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. ఇక భారత క్రికెట్ చరిత్రలో లెజెండ్ అయిన విరాట్ కోహ్లీ మే 12న టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 14 ఏళ్ల టెస్టు కెరీర్‌లో 123 మ్యాచ్‌లు ఆడి, 9,230 పరుగులు (సగటు 46.85) సాధించాడు. అతడి నాయకత్వంలో భారత్ జట్టు అద్భుతమైన విజయాలను అందుకుంది. విదేశీ గడ్డపై చిరస్మరణీయ టెస్టు విజయాలు కోహ్లీ సేన సాధించింది. 2024లో టీ20 వరల్డ్ కప్ విజయం అనంతరమే టీ20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. అమెరికాకు చెందిన ప్రొఫెషనల్ రెజ్లింగ్ దిగ్గజం గ్రేట్ జాన్ సీనా ఈ ఏడాది డిసెంబర్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ ఈవెంట్స్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. 2001లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూలో చేరిన సీనా రికార్డు స్థాయిలో 16 సార్లు వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచాడు. రెండుసార్లు గ్రాండ్ స్లామ్ విజేత అయిన రొమేనియాకు చెందిన సిమోనా హాలెప్ 33 ఏళ్ల వయసులో టెన్నిస్ నుంచి రిటైర్ ప్రకటించింది. 2017లో వరల్డ్ నంబర్ 1 ర్యాంక్‌ను చేరుకున్న హాలెప్ 2018 ఫ్రెంచ్ ఓపెన్, 2019 వింబుల్డన్ టైటిళ్లు గెలిచింది. మొత్తంగా 24 సింగిల్స్ టైటిళ్లు, 40 మిలియన్ డాలర్లకు పైగా ప్రైజ్ మనీతో ఆమె కెరీర్ ముగిసింది. బార్సిలోనా, స్పెయిన్ జట్లకు వెన్నెముకగా దిగ్గజ మిడ్‌ఫీల్డర్ బుస్కెట్స్ (37) ఫుట్‌బాల్‌కు ఈ ఏడాదే వీడ్కోలు పలికాడు. 2010 ప్రపంచకప్ విజేత అయిన ఆయన, తన కెరీర్ ముగింపులో మెస్సీతో కలిసి మయామీ తరపున ఆడాడు. స్పెయిన్ తరఫున 143 మ్యాచ్‌లు ఆడిన అతడు 2010 వరల్డ్ కప్, 2012 యూరో కప్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. అలాగే, తన కెరీర్‌లో మొత్తం 700కుపైగా మ్యాచ్‌లు అడి 9 లా లిగా టైటిళ్లు, 3 ఛాంపియన్స్ లీగ్‌లు గెలిచాడు.

# 14 యేళ్ల తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై ఇంగ్లండ్ గెలుపు

### నాలుగో టెస్టులో 4 వికెట్ల తేడాతో విక్టరీ



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా గడ్డపై ఆ దేశాన్నే ఓడించింది. ఇంగ్లండ్. సుమారు 14 ఏళ్ల విరామం తర్వాత ఆసీస్ పిచ్‌పై టెస్టుల్లో ఇంగ్లండ్ జట్టు విజయం సాధించింది. మెల్‌బోర్న్‌లో శనివారం జరిగిన నాలుగో టెస్టులో ఇంగ్లండ్ 4 వికెట్ల తేడాతో అసాధారణ విక్టరీ నమోదు చేసింది. ఆసీస్, ఇంగ్లండ్ మధ్య జరిగిన పెర్త్ టెస్టులో ఆస్ట్రేలియా విక్టరీ కొట్టగా, ఇవాళ మెల్‌బోర్న్‌లో ఇంగ్లండ్ స్వీట్ విక్టరీ నమోదు చేసింది. హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో 175 రన్స్ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఇంగ్లండ్ 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకున్నది. ఆస్ట్రేలియా బౌలర్లు ఇంగ్లండ్ బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టారు. టార్గెట్ చిన్నదే అయినా ఇంగ్లండ్ క్రికెటర్లు ఇబ్బందిపడాల్సి వచ్చింది. పేస్ అటాక్‌తో ఆస్ట్రేలియా బౌలర్లు చమటలు పట్టించింది. ఇవాళ రెండో రోజు ఆస్ట్రేలియా తన రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 132 రన్స్ కే ఆలౌటైంది. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రౌడన్ కార్సే 4, స్టోక్స్ 3, టాంగే రెండు వికెట్లు తీసుకున్నారు. వాస్తవానికి యాషెస్ సిరీస్‌ను ఇప్పటికే ఆస్ట్రేలియా సొంతం చేసుకున్నది. కానీ ప్రస్తుతం



ఆధిపత్యాన్ని 3-1కి తగ్గించింది ఇంగ్లండ్. ఆస్ట్రేలియా తన స్వంత గడ్డపై ఓడించేందుకు ఇంగ్లండ్‌కు 15 ఏళ్ల పట్టింది. ఇన్నేళ్లలో ఇంగ్లండ్ 16 టెస్టుల్లో ఓడగా, రెండు మ్యాచ్‌లను డ్రా చేసుకున్నది. రెండు రోజుల్లోనే ముగిసిన పెర్త్ టెస్టులో మొత్తం 847 బంతులు వేయగా, ఇక మెల్‌బోర్న్ టెస్టులో 852 బాల్స్ పడ్డాయి. 2011లో సిడ్నీలో జరిగిన టెస్టులో చివరిసారి ఇంగ్లండ్ విజయం సాధించింది.

# తులం బంగారం రూ.1.43 లక్షలు
## కిలో వెండి రూ.2.50 లక్షలు




వాణిజ్యం

**ముంబయి, డిసెంబరు 27:** బంగారం, వెండి ధరలు గణనీయంగా పెరిగాయి. హైదరాబాద్ నగరంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,43 లక్షలు పలికి గరిష్ఠ స్థాయికి చేరుకుంది. 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,31లక్షలుగా ఉంది. వెండి కిలో ధర రూ.2.50 లక్షలకు చేరుకుంది. నెల రోజుల్లోనే వెండి ధర రూ.80వేలకు పైగా పెరగడం గమనార్హం. ప్రస్తుత క్యాలెండర్ సంవత్సరం2025లో పసిడి ధర 70 శాతం పెరిగింది. ఒక క్యాలెండర్ ఏడాదిలో బంగారం ఇంత భారీగా పెరగడం సుమారు 45 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి అని బులియన్ రంగ నిపుణులుచెపుతున్నారు. భౌగోళిక, రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో 2026 ప్రారంభంలోనూ పసిడి ధరలు మరింత పెరిగే అవకాశముందని అంచనా వేస్తున్నారు. అమెరికాలో ద్రవ్యోల్బణం అంచనాల కంటే తక్కువగా ఉండటంతో, ఫెడరల్ రిజర్వ్ తదుపరి సమీక్షలో వడ్డీ రేట్లను తగ్గిస్తుందనే అంచనాలు పెరుగుతున్నాయి. ఆర్థిక అనిశ్చితులు కొనసాగుతుండటంతో, సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం, వెండి వైపు పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతున్నారు.




## టెక్ సిఇఒల్లో టాప్ బిలియనీర్
# జయశ్రీ ఉల్లాల్

**న్యూఢిల్లీ, డిసెంబరు 27:** ప్రపంచ టెక్ రంగంలో భారత సంతతికి చెందిన అత్యంత సంపన్న ఎగ్జిక్యూటివ్‌లుగా ఉన్న సత్య నాదెళ్ల, సుందర్ పిచాయ్‌లను వెనక్కి నెట్టి అరిస్టా నెట్‌వర్క్స్ ప్రెసిడెంట్, సీఈఓ జయశ్రీ ఉల్లాల్ నిలిచారు. హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025 ప్రకారం జయశ్రీ ఉల్లాల్ నికర సంపద రూ. 50,170 కోట్లుగా ఉంది. భారత సంతతికి చెందిన అత్యంత సంపన్న ప్రొఫెషనల్ మేనేజర్‌గా ఆమె నిలిచారు. ఇదే జాబితాలో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల రూ. 9,770 కోట్ల సంపదతో రెండో స్థానంలో ఉండగా, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ రూ. 5,810 కోట్లతో ఏడో స్థానంతో సరిపెట్టుకున్నారు. జయశ్రీ ఉల్లాల్ 2008 నుంచి కంప్యూటర్ నెట్‌వర్కింగ్ సంస్థ అయిన అరిస్టా నెట్‌వర్క్స్‌కు నాయకత్వం వహిస్తున్నారు. ఆమె నేతృత్వంలో ఈ కంపెనీ అద్భుతమైన వృద్ధిని సాధించింది. ఫోర్బ్స్ కథనం ప్రకారం 2024లో కంపెనీ ఆదాయం 7 బిలియన్ డాలర్లకు చేరింది. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే దాదాపు 20 శాతం అధికం. కంపెనీ స్టాక్‌లో జయశ్రీకి దాదాపు 3 శాతం వాటా ఉంది. 1961లో లండన్‌లో జన్మించిన జయశ్రీ, తన ఐదో ఏట కుటుంబంతో కలిసి భారత్‌కు వచ్చారు. ఆమె తండ్రి ఒక భౌతిక శాస్త్రవేత్త. ఆయన ఐఐటీల ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. జయశ్రీ న్యూఢిల్లీలోని కాన్వెంట్ ఆఫ్ జీసెస్ అండ్ మేరీలో పాఠశాల విద్యను అభ్యసించారు. అనంతరం తండ్రి ఉద్యోగరీత్యా శాన్‌ఫ్రాన్సిస్కోకు వెళ్లారు. అక్కడ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ, ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. కెరీర్ తొలినాళ్లలో ఏఎండీ, ఫెయిర్‌చైల్డ్ సెమీకండక్టర్ వంటి సంస్థల్లో పనిచేసిన జయశ్రీ, సిస్కోలో చేరాక ఉన్నత స్థాయికి ఎదిగారు. 2008లో కేవలం 30 మంది ఉద్యోగులతో ఉన్న అరిస్టా నెట్‌వర్క్స్‌లో చేరి, దానిని క్లౌడ్ నెట్‌వర్కింగ్ రంగంలో అగ్రగామి సంస్థగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం ఆమె శాన్‌ఫ్రాన్సిస్కోలో నివసిస్తున్నారు.

## ఈ యేడాది రూ.1.58 లక్షలకోట్ల
# పెట్టుబడులు విత్‌డ్రా!

**న్యూఢిల్లీ, డిసెంబరు 27:** విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు ఊపందుకోవడం కార్పొరేట్ సుపరిపాలనతోపాటు కార్పొరేట్ ఫలితాలతో వచ్చే ఏడాది మరింతగా విదేశీ పెట్టుబడులు పెరుగుతాయని మార్కెట్ నిపుణులు అంచనావేస్తున్నారు. డిసెంబరులో ఇప్పటివరకూ 22,100 కోట్లు విక్రయించినప్పటికీ వచ్చే ఏడాది ఎఫ్ఐఐలు మరింతగా రావచ్చని అంచనా. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు ఈ కేలండర్ సంవత్సరంలో రూ.1,58,407 కోట్ల రూపాయలు విలువైన షేర్లు విక్రయించారు. స్థూల ఆర్థికవృద్ధి పటిష్టత వల్ల వచ్చేఏడాది ఈ ఎఫ్ఐఐలు మళ్లీ రివర్స్‌లో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని అందువల్ల మరింతగా పెరుగుతాయని జియోజిత్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహకర్త డా.వికెవిజయ్‌కుమార్ అన్నారు.




ఎఫ్ఐఐల విత్‌డ్రాలో భారత్‌లో ఎఫ్ఐఐలు కొత్తరికార్డు నమోదు చేసాయన్నారు. 2024లో ఎఫ్ఐఐలు ఎక్స్ఛేంజిలద్వారా రూ.1,21,210 కోట్ల షేర్లను ఈక్విటీల్లో విక్రయించారు. నికరంగా పెట్టుబడులు మాత్రం సానుకూలంగా ఉన్నాయి. రూ.1,21,637 కోట్లు పెట్టుబడులుపెట్టారు. అయితే 2025 గణాంకాలు అందుకు విరుద్ధంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. 2026 ప్రారంభంనుంచే కూడా ఎఫ్ఐఐలు మళ్లీ పెటుబడులకు ఉపక్రమించే అవకాశం ఉందన్నారు. డాలరుతో రూపాయి మారకం విలువలు వార్షికద్దతిలోచూస్తే ఐదుశాతం క్షీణించింది. వారాంతంలో ముడిచమురుదరలు రికవరీ అవుతున్నాయి. నిరక ఎఫ్‌డిఐలు సుమారు 6.2 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఏడాదిక్రితం 3.3 బిలియన్ డాలర్లుమాత్రమే ఉన్న ఈ పెట్టుబడులు ఏప్రిల్ అక్టోబరుమధ్యకాలంలో 6.2బిలియన్ డాలర్లకు చేరాయి.



## మొబైల్ ఫోన్ల ఉత్పత్తిలో
# భారత్ నం-2


**న్యూఢిల్లీ, డిసెంబరు 27:** ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో భారత్ సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీ దేశంగా భారత్ అవతరించిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ శనివారం ప్రకటించారు. గత 11 ఏళ్లలో దేశీయంగా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి ఆరు రెట్లు పెరిగిందని, ఎగుమతులు ఏకంగా ఎనిమిది రెట్లు వృద్ధి చెందాయని ఆయన సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, ముఖ్యంగా ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం ఈ అద్భుత ప్రగతికి చోదకశక్తిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. భారీస్థాయి ఎలక్ట్రానిక్స్ తయారీ కోసం ప్రవేశపెట్టిన పీఎల్ఐ పథకం ద్వారా ఇప్పటివరకు రూ. 13,475 కోట్ల పెట్టుబడులు ఆకర్షించినట్లు మంత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా దేశంలో సుమారు రూ. 9.8 లక్షల కోట్ల విలువైన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి సాధ్యమైందని, ఇది తయారీ, ఉద్యోగ కల్పన, ఎగుమతులను గణనీయంగా పెంచిందని వివరించారు. కేవలం గత ఐదేళ్లలోనే ఈ రంగంలో 1.3 లక్షలకు పైగా ఉద్యోగాల కల్పన జరిగిందని ఆయన అన్నారు. ఒకప్పుడు ఏడో స్థానంలో ఉన్న ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు, ఇప్పుడు దేశంలో మూడో అతిపెద్ద ఎగుమతి కేటగిరీగా ఎదగడం 'మేక్ ఇన్ ఇండియా విజయానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం తొలుత పూర్తయిన ఉత్పత్తులపై దృష్టి సారించినప్పటికీ, క్రమంగా విడిభాగాలు, ముడి పదార్థాలు, వాటిని తయారుచేసే యంత్రాల తయారీ సామర్థ్యాన్ని పెంచడంపై కూడా దృష్టి పెట్టిందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఇందుకోసం ప్రవేశపెట్టిన ఎలక్ట్రానిక్స్ విడిభాగాల మ్యానుఫ్యాక్చరింగ్ స్కీమ్‌కు అద్భుత స్పందన లభించిందని చెప్పారు. ఈ పథకం కింద 249 దరఖాస్తులు రాగా, వాటి ద్వారా రూ. 1.15 లక్షల కోట్ల పెట్టుబడులు, రూ. 10.34 లక్షల కోట్ల ఉత్పత్తి, 1.42 లక్షల ఉద్యోగాలు రానున్నాయని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. భారత ఎలక్ట్రానిక్స్ రంగంలో ఇదే అత్యధిక పెట్టుబడి నిబద్ధత అని, ఇది పరిశ్రమకు ప్రభుత్వంపై ఉన్న విశ్వాసాన్ని సూచిస్తోందని ఆయన అన్నారు. సెమీకండక్టర్ రంగంలోనూ భారత్ వేగంగా పురోగమిస్తోందని మంత్రి తెలిపారు. ఇప్పటికే పది యూనిట్లకు ఆమోదం లభించగా, వాటిలో మూడు పైలట్ లేదా ప్రాథమిక ఉత్పత్తి దశలో ఉన్నాయని చెప్పారు. త్వరలోనే భారత్‌లో తయారైన ఫ్యాబ్‌లు, ఏటీఎంపీలు ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ తయారీదారులకు చిప్స్‌ను సరఫరా చేస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత దశాబ్ద కాలంలో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం దేశవ్యాప్తంగా 25 లక్షల ఉద్యోగాలను సృష్టించిందని, ఇదే క్షేత్రస్థాయిలో నిజమైన ఆర్థిక వృద్ధి అని మంత్రి అభివర్ణించారు. పూర్తయిన ఉత్పత్తుల నుంచి విడిభాగాల వరకు ఉత్పత్తి పెరుగుతోంది. ఎగుమతులు దూసుకుపోతున్నాయి. ప్రపంచ కంపెనీలు నమ్మకంతో ఉన్నాయి. భారత కంపెనీలు పోటీ పడుతున్నాయి. ఉద్యోగాలు సృష్టించబడుతున్నాయి. ఇదే మేక్ ఇన్ ఇండియా విజయగాథ అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

# వచ్చే యేడాది ఆర్థికవృద్ధి 7.4% అంచనా!




**న్యూఢిల్లీ,డిసెంబరు 27:** భారత జిడిపి వృద్ధిరేటు 2026 సంవత్సరంలో 7.4శాతం నమోదవుతుందని ఆర్థికనిపుణుల అంచనాలు వెలువడ్డాయి. జిఎస్టీ రేట్‌కట్‌లు, దేశీయంగా పెరుగుతున్న డిమాండ్, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వినియోగ సామర్థ్యం పెరుగుతుండటంతో ఆర్బీఐ వడ్డీరేట్లను స్థిరంగా కొనసాగించే అవకాశం ఉందని, ఫిబ్రవరిలో జరిపే ఎంపిసి సమావేశంలోకూడా ఇదే నమోదవుతుందని చెపుతున్నారు. అలాగే రిటైల్‌ద్రవ్యోల్బణం అదుపులోనే ఉంటుందని, ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకుంటాయని, విదేశీ రిస్కులు అంటే వాణిజ్య డీల్స్ జాప్యం జరిగినా ఆర్థికవృద్ధి పెరుగుతుందని చెపుతున్నారు. 2026 రెండో అర్ధభాగంలోనే ఈ వృద్ధి మరింత ఉంటుందని చెపుతున్నారు. అయితే భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం, ప్రపంచదేశాల పాలసీ నిర్ణయాలు, కేంద్ర బ్యాంకుల వడ్డీరేట్ల నిర్ణయాలు, కమోడిటీ ధరవరలు, ద్రవ్యోల్బణం వంటివే కీలకం అవుతాయని చెపుతున్నారు. రిటైల్ ద్రవ్యోల్బణం నవంబరులో 0.7శాతానికి పెరిగింది. అక్టోబరులో 0.3శాతం మాత్రమే ఉంటే ఈసారి ఆహార, శీతలపానీయాల ధరలు పెరగడంతోస్వల్పంగా పెరిగినట్లు అంచనా. ఇక నిర్మాణరంగ కార్యకలాపాలు, మైనింగ్, విద్యుత్ రంగాలు ఊపందుకున్నాయి. సిమెంట్ ఉతనపత్తి 7.5శాతంగా ఉంటుందని అంచనా. ఉక్కు ఉత్పత్తి డిమాండ్ 7-8శాతాంగా ఉంటుంది. విద్యుత్ డిమాండ్‌కూడా 2026 ఆర్థిక సంవత్సరంలో 1.5-2శాతంమధ్యలో ఉంటుందని వెల్లడి అయింది. ఇక్రా, ఫిట్జ్‌రేటింగ్ వంటిసంస్థలు 2026లో భారత్‌కు ఆర్థిక వృద్ధి అవకాశాలు మరింత ఎక్కువ ఉండవచ్చని అంచనావేసాయి. 2026లో రెండోత్రైమాసికఫలితాలు కూడా ఇందుకు దోహదంచేస్తాయని అంచనా. ఆర్థిక సేవలు, బ్యాంకులు, ఉత్పత్తి, సేవలరంగాల్లో వృద్ధి జిడిపిని మరింత వృద్ధి బాటలోకి తీసుకువెళుతుందని ఈ సంస్థలు అంచనావేసాయి.

# ఫండ్స్ మార్కెట్లలో 'సిప్'లే ఎక్కువ!
### ఇప్పటివరకూ రూ.3.04 లక్షలకోట్లు ఫండ్స్ పెట్టుబడులు




**న్యూఢిల్లీ, డిసెంబరు 27:** భారత్‌లో ఫండ్స్ మార్కెట్‌లలో సిప్ పెట్టుబడులు ఊపందుకున్నాయి. సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్‌ప్లాన్ కింద నవంబరు నాటికి మొత్తం రూ.3 లక్షలకోట్ల పెట్టుబడులు వచ్చినట్లు తెలుస్తోంది. ఆంఫీ డేటా ప్రకారంచూస్తే ఈక్విటీల్లో సిప్‌లు గత ఏడాది 27శాతంనుంచి 37శాతానికి పెరిగాయి. 2025లో ఇప్పటివరకూ రూ.3.04 లక్షలకోట్లు పెట్టుబడులు కుమ్మరించారు. అదే 2024 నవంబరునాటికి 2.69 లక్షలకోట్లుమాత్రమే పెట్టుబడులు వచ్చాయని ఆంఫీ డేటా చెపుతోంది. ఇన్వెస్టర్లు గణనీయంగా సిప్‌లనే ఎంచుకుంటున్నారని, భారీ పెట్టుబడులకు సుస్థిర వ్యవస్థగా సిప్‌లు పేర్కొంటున్నారు. ఎక్కువగా రిటైల్ ఇన్వెస్టర్లు భాగస్వామ్యం ఉందని, మ్యూచువల్‌ఫండ్ పరిశ్రమలో మొత్తం నిర్వహణ ఆస్తులు ప్రస్తుతం 80.80 లక్షలకోట్లకు చేరడం రిటైల్ భాగస్వామ్యం పెరగడం వల్లనేనని తెలుస్తోంది. అదే అంతకుముందునెలలో రూ.79.87 లక్షలకోట్లుమాత్రమే ఉన్నాయి. 2025 మొదటి పదినెలల్లో సిప్‌ల వాటా 37శాతంగా ఉంది. ఈక్విటీ స్కీమ్‌లలో సిప్ పెట్టుబడులు మొత్తం సిప్‌లలో 80శాతంగా ఉన్నట్లు అంచనా. నవంబరునెలలోనే రూ.29,445 కోట్లుపెట్టుబడులు వచ్చాయి. అయితే అక్టోబరులో వచ్చిన రూ.29,529 కోట్లకంటే తక్కువే. దేశీయంగా నగదు లభ్యత పెరగడం, రిటైల్ సిప్ భాగస్వామ్యం పెరగడం, భారత్ మధ్యంతర ఆర్థిక, కార్పొరేట్ రాబడులు మరింతగా ఊపందుకోవడం వంటి వాటివల్లనే సిప్ పెట్టుబడులు పెరిగినట్లు తెలుస్తోంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.